'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 100

సోమవారం 1-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

భారత్‌కు తొలి షాక్

ప్రపంచకప్‌లో టీమిండియాకు తొలి ఓటమి ఎదురైంది. బర్మింగ్‌హామ్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 31 పరుగులతో భారత్‌ను ఓడించి సెమీఫైనల్ ఆశలను సజీవంగా నిలబెట్టుకుంది. బెయిర్‌స్టో (111) సెంచరీ చేయడంతో తొలుత ఇంగ్లండ్ 7 వికెట్లకు 337 పరుగులు సాధించింది. భారత్ 5 వికెట్లకు 306 పరుగులు చేసి ఓడిపోయింది. రోహిత్ శర్మ (102) సెంచరీ వృథా అయింది.

– స్పోర్ట్స్‌లో

న్యూస్‌రీల్

రూ. 2,700 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

పాక్ నుంచి అక్రమంగా వాణిజ్య మార్గం ద్వారా భారత్‌కు తీసుకొస్తున్న 532 కిలోల హెరాయిన్‌ను సరిహద్దులోని అట్టారి చెక్ పోస్టు వద్ద అధికారులు పట్టుకున్నారు. దీని విలువ రూ. 2,700 కోట్లు ఉంటుందని తెలిపారు. - వివరాలు 5లో

క్రెడిట్ కార్డ్ తిరిగిచ్చేస్తున్నారా?

క్రెడిట్ కార్డును రద్దు చేసుకునే విషయం లోనూ లాభనష్టాలు ఉంటాయి. కార్డును రద్దు చేసుకుంటే రుణ వినియోగ రేషియో రేటు ప్రభావితం కావచ్చు. కొన్ని సందర్భాల్లో రద్దు మంచికే దారితీయవచ్చు. అందుకే క్రెడిట్ కార్డు స్వాధీన విషయం లోనూ శ్రద్ధ అవసరం. - బిజినెస్‌లో

నాన్ సబ్సిడీ సిలిండర్‌పై రూ. 100 తగ్గింపు - 5లో

ఆదివారం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం సార్సాల అటవీ ప్రాంతంలో ఎఫ్ఆర్‌వో అనితపై కర్రలతో దాడి చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణ, ఆయన అనుచరులు. (ఇన్‌సెట్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత

మహిళా అటవీ అధికారిపై ప్రజాప్రతినిధి దాడి

సిర్పూర్ ఎమ్మెల్యే సోదరుడు కోనేరు కృష్ణ, అనుచరుల వీరంగం

- కాగజ్‌నగర్ మండలం సార్సాలలో అటవీ అధికారులపై దాడి
- దాడిలో విరిగిన ఎఫ్ఆర్‌వో అనిత చేయి.. నెత్తురోడుతున్నా వదలని వైనం
- ఘటనపై అధిష్ఠానం సీరియస్.. రాజీనామా చేయాలని కృష్ణకు ఆదేశం
- జెడ్పీ వైస్‌చైర్మన్, జెడ్పీటీసీ సభ్యత్వానికి రాజీనామా చేసిన కృష్ణ
- 16 మందిపై కేసులు నమోదు.. కృష్ణ, మరొకరి అరెస్టు
- కాగజ్‌నగర్ డీఎస్పీ, రూరల్ సీఐపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు
- బాధ్యులెవరైనా చట్టం ముందు సమానమే: కేటీఆర్ ట్వీట్
- రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందంటూ మండిపడ్డ విపక్షాలు

సాక్షి, ఆసిఫాబాద్: పోడు భూమి రణరంగమైంది. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భూమిని చదును చేసి మొక్కలు నాటేందుకు వెళ్లిన ఫారెస్ట్ అధికారుల బృందంపై అధికార టీఆర్ఎస్ పార్టీ నాయకుడు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు, కుమురంభీం జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణతో పాటు ఆయన అనుచరులు యథేచ్ఛగా దాడి చేశారు. ఈ ఘటనలో ఓ మహిళా అటవీ అధికారిణి చేయి విరగడంతో పాటు పలువురు అటవీ సిబ్బందికి గాయాలయ్యాయి. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం సార్సాల అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. అధికార పార్టీ నాయకుడు, సాక్షాత్తూ జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్, ఎమ్మెల్యే సోదరుడు ఇందుకు బాధ్యుడు కావడంతో

మిగతా 2వ పేజీలో ▶

మహోద్యమంగా జలసంరక్షణ

దేశ ప్రజలకు పిలుపునిచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ

ప్రధాని నోట మన 'ఊటకుంట' మాట..

- దేశంలో జల సంరక్షణను ఓ మహోద్యమంగా చేపట్టాల్సిన అవసరముందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రజలంతా వర్షపునీటిని సంరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని తిమ్మాయిపల్లి తండా శివారులో నిర్మించిన ఊటకుంటను ప్రస్తావించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం నిర్వహించిన తొలి మాసాంతపు మన్‌కీ బాత్‌లో ప్రధాని మాట్లాడారు.

- వివరాలు 5లో

ఉత్తర కొరియాలో ట్రంప్

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ఉత్తర కొరియా వచ్చారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ ఉన్‌తో సమావేశమయ్యారు. పదవిలో ఉన్న అమెరికా అధ్యక్షుడు ఉత్తర కొరియా రావడం ఇదే మొదటిసారి కావడంతో ట్రంప్ పర్యటన చరిత్రాత్మకమయింది. - వివరాలు 5లో

ఐటీ మినహాయింపు పరిమితి పెంపు!

- రూ.10 కోట్ల ఆదాయం మించితే 40 శాతం పన్ను...
- బడ్జెట్‌లో ఈ దిశగా చర్యలు ఉండొచ్చని కేపీఎంజీ ప్రజా సర్వేలో వెల్లడి

- బిజినెస్‌లో

చైనాలో 'స్టార్‌ఫిష్' విమానాశ్రయం

- భారీ స్టార్‌ఫిష్ ఆకారంలో చైనా ప్రభుత్వం నిర్మిస్తున్న బీజింగ్‌లోని డాక్సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడి 70 సంవత్సరాల వేడుకల సందర్భంగా ప్రారంభించనున్నారు. పది ఫుట్‌బాల్ మైదానాలకు సమానమైన స్థలంలో కళ్లు చెదిరేలా నిర్మించిన ఈ విమానాశ్రయాన్ని రూ. 1.20 లక్షల కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

5 లో

బంగాళాఖాతంలో అల్పపీడనం

- నేడు, రేపు ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు
- అనేక చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- గత నెల రాష్ట్రవ్యాప్తంగా 35% లోటు వర్షపాతం నమోదు
- రాజధానిలో 11% అధికం.. ఖమ్మం జిల్లాలో 73% లోటు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి - 14లో

డాక్టర్ ఫీజుల మోత!

- ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు రంగం సిద్ధం
- బీ, సీ కేటగిరీ సీట్లలో 5% పెంచుకునేందుకు అవకాశమివ్వాలని సర్కారుకు యాజమాన్యాల లేఖ
- బీ కేటగిరీకి రూ. 57 వేలు, ఎన్ఆర్ఐ కేటగిరీకి రూ. 1.15 లక్షలు అదనంగా పెరిగే అవకాశం
- యాజమాన్య కోటా నోటిఫికేషన్ కంటే ముందే ఫీజుల పెంపుపై రానున్న స్పష్టత

- వివరాలు 14లో

ధనలక్ష్మి... ధాన్యలక్ష్మి!

- ధాన్యం సేకరణలో దేశంలో తెలంగాణకు రెండో స్థానం
- 14.73 లక్షల మంది రైతుల నుంచి 77.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- గతేడాదికన్నా 23.43 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ
- సీఎం రైతు సంక్షేమ పథకాల వల్లే ఈ ఘనత: వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి
- తొలి స్థానంలో నిలిచిన పంజాబ్.. సాగునీటి వనరుల వృద్ధి, పంటల విస్తీర్ణం పెరుగుదల కూడా కారణం

- వివరాలు 2లో

14 తర్వాత ఎప్పుడైనా రెడీ!

మునిసి'పోల్స్' ప్రక్రియ వేగవంతం

- ఈ నెల ఏడో తేదీ లోగా వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తి
- నాలుగు రోజుల పాటు అభ్యంతరాలకు అవకాశం
- 8వ తేదీ నుంచే పోలింగ్ స్టేషన్ల ముసాయిదా కసరత్తు
- 12 నాటికి వార్డుల వారీ ఓటర్ల తుది జాబితా
- ఆ తర్వాత రెండు రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు
- సూత్రప్రాయ షెడ్యూల్‌ను ఖరారు చేసిన పురపాలక శాఖ
- ఎట్టి పరిస్థితుల్లో మూడో వారం ఆఖరులో ఎన్నికల నోటిఫికేషన్!

సాక్షి, హైదరాబాద్: కొత్త చట్టంతో సంబంధం లేకుండా మునిసిపల్ ఎన్నికలను నిర్వహించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పనులను వేగవంతం చేసింది. ఈనెల 14వ తేదీ తర్వాత ఏ క్షణాన నోటిఫికేషన్ వచ్చినా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండేలా పురపాలక శాఖ సూత్రప్రాయంగా షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఆదివారం నుంచే ప్రారంభమయిన ఈ షెడ్యూల్ ప్రకారం మొత్తం 14 రోజుల్లో వార్డుల పునర్విభజన నుంచి రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ వరకు అన్నీ పూర్తి కానున్నాయి. ఇప్పటికే ఏ మునిసిపాలిటీ, కార్పొరేషన్‌లో ఎన్ని వార్డులు చేయాలో నిర్ధారణ కాగా, ఈ వార్డుల పునర్విభజన ప్రక్రియతోనే షెడ్యూల్‌ను ప్రారంభించనున్నారు. నిర్దేశిత జనాభాకు అనుగుణంగా ఆయా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల సరిహద్దులను నిర్ధారించే ప్రక్రియ ఆదివారమే ప్రారంభమైంది. ఈ పునర్విభజన ప్రతిపాదనలను సోమవారం కల్లా సిద్ధం చేయాలని, ఆ తర్వాత నాలుగు రోజుల పాటు అభ్యంతరాలకు అవకాశమివ్వాలని, ఏడో తేదీ కల్లా ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

8వ తేదీ నుంచి కీలక ప్రక్రియలు

వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాత వార్డుల వారీ ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల తుది జాబితాల తయారీపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టనుంది. ఈ మూడు ప్రక్రియలు 8వ తేదీ నుంచే ప్రారంభించి 12వ తేదీ కల్లా పూర్తి చేయాలని పురపాలక శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఓటర్ల జాబితాల తయారీ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, అభ్యంతరాల స్వీకరణ, తుది ప్రచురణలకు నిర్దేశిత గడువును కూడా షెడ్యూల్‌లో ఉంచారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తయిన తర్వాత రెండ్రోజుల్లో అంటే ఈ నెల 14వ తేదీ కల్లా వార్డు మెంబర్లు, మునిసిపల్ చైర్‌పర్సన్లు/మేయర్ల రిజర్వేషన్లు కూడా ఖరారు చేస్తారు. ఈ ఖరారు ప్రక్రియ పూర్తి కావడంతో మునిసిపల్ ఎన్నికల వ్యవహారాన్ని ఇక ఎలక్షన్ కమిషన్‌కు అప్పగిస్తామని.. ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికల నిర్వహణ కోసం సర్వం సిద్ధంగా ఉండేలా షెడ్యూల్ రూపొందించామని పురపాలక శాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'తో చెప్పారు. కాగా, ఈ ప్రక్రియలన్నీ పూర్తయిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో ఈ నెల

మిగతా 4వ పేజీలో ▶

..మద్దతుగా ఇప్పుడు రాజీనామాలు చేసి, తర్వాత పార్టీ కూడా మారతారట సార్!



ధనలక్ష్మి.. ధాన్యలక్ష్మి!

ధాన్యం సేకరణలో దేశంలో రాష్ట్రానికి రెండో స్థానం

- 14.73 లక్షల రైతుల నుంచి 77.41లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ
- గతేడాదికన్నా 23.43 లక్షల మెట్రిక్ టన్నులు ఎక్కువ
- మొత్తం ధాన్యం కొనుగోళ్ల విలువ రూ.13,675 కోట్లు
- సీఎం రైతు సంక్షేమ పథకాల వల్లే ఈ ఘనత: మంత్రి నిరంజన్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ధాన్యం సేకరణలో సరికొత్త రికార్డులు నెలకొల్పింది. రాష్ట్ర చరిత్రలోనే గతంలో ఎన్న డూ లేనంతగా ధాన్యం సేకరణ ద్వారా దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా ధాన్యం సేకరణ పాలసీని పౌరసరఫరాలశాఖ పకడ్బందీగా రూపొందించడం ఒక ఎత్తయితే.. దీనికి అనుగుణంగా కనీస మద్దతు ధరలకు జరిగిన కొనుగోళ్లు, మార్కెట్ వ్యవస్థ బలోపేతం, సాగునీటి వనరుల వృద్ధితో పంటల విస్తీర్ణం పెరగడం కారణంగా ధాన్యం కొనుగోళ్లు కొత్త రికార్డులు నెలకొల్పుతున్నాయి.

అందరి సహకారంతోనే సాధించాం

'సీఎం, మంత్రి సూచనల మేరకు శాఖ అధికారులు, జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్లు బాగా పనిచేయడం వల్ల ఈ రికార్డు సాధ్యమైంది. ధాన్యం అమ్ముకోవడంలో రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా ధాన్య సేకరణకు సంబంధించిన విభాగాలతో రాష్ట్రస్థాయిలో శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ సమన్వయం చేసుకున్నారు. స్వయంగా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులు, రవాణా వంటి అంశాలను పరిశీలించారు. చరిత్రలోనే తొలిసారిగా అత్యధికంగా ధాన్యం దిగుబడి అయింది. కానీ ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకుండా విజయవంతంగా కొనుగోళ్లను పూర్తిచేయగలిగాం. ఇందుకు కృషిచేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు'

– మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ చైర్మన్

ఈ ఘనత ముఖ్యమంత్రిదే

'ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ చర్యలు ముఖ్యంగా రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, కొత్తగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు పెరిగాయి. ఇందుకు అనుగుణంగా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేశాం. రాష్ట్రంలో ఈ ఏడాది లక్ష్యానికి మించి రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ జరిపాం. ఎక్కడా ఎలాంటి లోపాలకు తావు లేకుండా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ, సంస్థ అధికారులతోపాటు ఇతర విభాగాల అధికారులతో పూర్తి సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాం. కొత్త రాష్ట్రమైన తెలంగాణ కేవలం ఐదేళ్లలో ధాన్యం సేకరణలో దేశంలోనే పంజాబ్ తరువాత రెండవ స్థానానికి చేరుకుంది. ఇది రాష్ట్ర ప్రజలకు గర్వకారణం. ఈ ఘనత ముఖ్యమంత్రిదే'

– నిరంజన్ రెడ్డి, మంత్రి

4 రెట్లు పెరిగిన సేకరణ

రాష్ట్రంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు గడిచిన ఐదేళ్లలో ఏకంగా 4 రెట్లు పెరిగాయి. 2014-15లో ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో కలిపి మొత్తంగా 24.29 లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేయగా, ఈ ఏడాది 2018-19లో పౌరసరఫరాల శాఖ రైతుల నుంచి అంచనాలకు మించి ధాన్యాన్ని కొనుగోలు చేసి రికార్డు సృష్టించింది. రూ.13,675 కోట్ల విలువ చేసే 77.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 14.73 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధికం. కనీస మద్దతు ధర (గ్రేడ్-ఏ రకం క్వింటాల్‌కు రూ.1,770, సాధారణ రకం – క్వింటాల్‌కు రూ.1,750)కు సంబంధించిన చెల్లింపులను రైతు ఖాతాలోకి నేరుగా జమ చేసింది. ఖరీఫ్‌లో 8,09,885 మంది రైతుల నుండి 3,297 కొనుగోలు కేంద్రాల ద్వారా 40.41 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 6,63,723 మంది రైతుల నుండి 3,509 కొనుగోలు కేంద్రాల ద్వారా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ మొత్తం సేకరణతో తెలంగాణ రాష్ట్రం పంజాబ్ తరువాత దేశంలోనే రెండవ స్థానం సంపాదించింది. ఖరీఫ్, యాసంగిలో తెలంగాణ పౌరసరఫరాల సంస్థ 6,816 కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో 14,73,608 మంది రైతుల నుండి 77.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. గత ఏడాది 2017-18లో 53.98 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, ఈ ఏడాది 23.43 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా కొనుగోలు చేసింది.

మహిళా అటవీ అధికారిపై దాడి

▶ మొదటి పేజీ తరువాయి

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయింది. ఈ ఘటనపై అటు అధికార టీఆర్ఎస్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలూ తీవ్రంగా స్పందించాయి. అటవీ అధికారులపై దాడి చేసిన వారెవరైనా చట్టం ముందు సమానులేనంటూ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేయగా, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని విపక్షాలు మండిపడ్డాయి. ఘటనకు బాధ్యులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కింద అరెస్టు చేయాలని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటన స్థానిక పోలీసు అధికారులకూ చిక్కు తెచ్చిపెట్టింది. ఘటనపై స్పందించిన ప్రభుత్వం.. ఘటనాస్థలంలో పోలీసు బందోబస్తు ఉండీ ఘర్షణను నివారించి దాడిని అడ్డుకోలేకపోవడంతో కాగజ్‌నగర్ డీఎస్పీ, రూరల్ సీఐపై సస్పెన్షన్ వేటు వేసింది. మహిళా అధికారిణి చేయి విరిగేలా కర్రలతో దాడి చేసిన ఈ ఘటన కారణంగా కోనేరు కృష్ణ ఇటీవలే వచ్చిన జడ్పీ వైస్ చైర్మన్ పదవి పోగొట్టుకోవాల్సి వచ్చింది. ఈ దాడికి ముఖ్య కారకుడైన కోనేరు కృష్ణతో పాటు 16 మందిపై కేసులు నమోదయ్యాయి.

జరిగింది ఇదీ..

కోనేరు కృష్ణ

కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ రేంజ్ పరిధి కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాలలో.. కాళేశ్వరం ప్రాజెక్టు కింద కోల్పోయిన అటవీ ప్రాంతానికి బదులు ఇక్కడ మొక్కలు నాటాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఎఫ్ఆర్వో అనితతోపాటు సిబ్బంది గ్రామశివారు కంపార్ట్ మెంట్ నంబర్ 138, 139ల్లో 20 ఎకరాలను చదును చేయించేందుకు ఉదయం 8 ప్రాంతంలో 3 ట్రాక్టర్లతో వెళ్లారు. దీంతో అదే స్థలంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న సార్సాల గ్రామస్తులు అక్కడకు చేరుకుని అటవీ అధికారులను అడ్డుకున్నారు. అటవీ అధికారుల సమాచారంతో కాగజ్‌నగర్ రూరల్ సీఐ వెంక టేశ్, టౌన్ సీఐ కిరణ్‌కుమార్, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై రాజేశ్వర్ అక్కడకు చేరుకుని అటవీ అధికారులు చదును చేసేలా చూశారు. ఇది తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు కోనేరు కృష్ణారావు అనుచరులతో కలిసి అక్కడికి వచ్చారు.

ప్రాధేయపడినా కనికరించలేదు

కోనేరు కృష్ణతోపాటు ఆయన అనుచరులు వచ్చిరాగానే కర్రలతో అటవీ అధికారులపై దాడులకు పాల్పడ్డారు. చెప్పేది వినాలని ట్రాక్టర్‌పైకి ఎక్కి వివరించేందుకు ప్రయత్నించిన ఎఫ్ఆర్వో అనితను విచక్షణరహితంగా కొట్టారు. దీంతో ఆమె కుడి చేయి విరిగిపోయింది. చూపుడు వేలు, మధ్య వేలు చిట్లిపోయాయి. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెతో పాటు పలువురు అటవీ సిబ్బంది గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఎఫ్ఆర్వోను కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సనందించారు. కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో రాజరమణారెడ్డి ఫిర్యాదు మేరకు మొత్తం 16 మందిపై కేసులు నమోదు చేశారు. కోనేరు కృష్ణను అరెస్టు చేసి జైనూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

అనితపై దాడి చేస్తున్న కోనేరు కృష్ణ అనుచరులు (ఇన్‌సెట్‌లో) ఏడుస్తున్న అనిత

పోలీసుల ప్రేక్షక పాత్ర

అధికారులపై కోనేరు కృష్ణ, అతని అనుచరులు విచక్షణారహితంగా కర్రలతో దాడులకు పాల్పడుతున్నా అక్కడున్న పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఈ దృశ్యాలు వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో కాగజ్‌నగర్ డీఎస్పీ సాంబయ్య, రూరల్ సీఐ వెంకటేశ్‌లను నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి సస్పెండ్ చేశారు.

అధిష్టానం సీరియస్

అధికారులపై దాడి ఘటనపై టీఆర్ఎస్ అధిష్టానం స్పందించింది. జెడ్పీవైస్‌చైర్మన్‌తోపాటు జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాల్సిందిగా కోనేరు కృష్ణారావును ఆదేశించింది. దీంతో ఆయన రాజీనామాను పార్టీ నేతలతో జెడ్పీ సీఈవో రాజేశ్వరికి పంపారు. అనంతరం కోనేరు కృష్ణ విలేకరులతో మాట్లాడుతూ కావాలనే అటవీ అధికారులు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్పందిస్తూ.. ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న వారిపై అటవీ అధికారులు దాడులకు పాల్పడుతున్నారని, ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్న వారి భూముల్లో మొక్కలు నాటడం దారుణమన్నారు.

అంతా జీ హుజూర్ అనాల్సిందే

సిర్పూర్ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు చెప్పినట్లు నడుచుకోని అధికారులకు ఇలాంటి ఘటనలే ఎదురవుతున్నాయి. గతంలో అక్రమ బెల్లం రవాణా అడ్డుకున్నందుకుగాను ఎమ్మెల్యే తన అనుచరులతో అప్పటి ఎక్సైజ్ అధికారిణి మంగను బహిరంగంగానే బూతులు తిడుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఇక ప్రస్తుత ఎఫ్‌డీవోకు ముందు విధులు నిర్వర్తించిన నర్సింహారెడ్డి అక్రమ కార్యకలాపాలకు అడ్డుపడుతున్నారని మంత్రి స్థాయిలో ఒత్తిడి తెచ్చి మరీ బదిలీ చేయించారు. ఇక అన్నదమ్ములిద్దరూ నియోజకవర్గ పోలీసు వ్యవస్థను మొత్తం గుప్పిట పెట్టుకుని పెత్తనం చెలాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగజ్‌నగర్‌రూరల్ పరిధిలో ఉన్న ఓ బ్రాందీ షాపు ఏజెన్సీ కింద నోటిఫైడ్ కాగా దీన్నుంచి మహారాష్ట్రకు అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ ఈ సోదరుల అనుచరులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇవేకాక అమాయకుల భూములను కబ్జా చేయడం, ప్రతీ పనుల్లో వాటాలు లేకపోతే పోలీసులతో బెదిరించి అట్రాసిటీ కేసులు పెట్టించడం షరామామూలుగా మారింది. ఇక్కడ పత్రికల్లో తనకు వ్యతిరేకంగా వార్తలు రాసిన వారిపైనా కేసులు పెట్టించారు. ఇప్పటికీ పలువురు పట్టణ విలేకరులు కేసులు ఎదుర్కొంటున్నారు. ఎమ్మెల్యే సంబంధీకులే అధికంగా రోడ్డు పనులు, టెండర్లు పొందారు. ఏం జరగాలన్నా వారు చెప్పిందే వేదంగా పరిస్థితి తయారైంది. దీంతో సిర్పూర్‌లో పనిచేయాలంటే లొంగి ఉన్న వారే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఇలాంటి అక్రమ దందాలను అరికట్టేందుకు అప్పటి ఎస్పీ కల్మేశ్వర్ సింగనేవార్ ఓ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసి గుట్కా, మట్కా, పీడీఎస్ బియ్యం, బెల్లం, మద్యం, నకలీ విత్తనాలను అడ్డుకున్నారు. అక్రమ కలప రవాణా చేసేందుకు వీల్లేకుండా చేశారు. దీంతో పూర్తిగా టాస్క్‌ఫోర్స్‌ను ఎత్తేయడమే గాక ఎస్పీని సైతం ఉన్నతాధికారులతో ఒత్తిడి తెచ్చి మరీ బదిలీ చేయించారు.

పోడుతో రాజకీయం

గిరిజనులను ఆసరా చేసుకుని చాలా మంది రాజకీయంగా లబ్ధి పొందుతున్నారు. జిల్లాలో ఆర్ఎఫ్ఆర్ పొందిన గిరిజనులు 12వేల మంది ఉంటే అంతకు రెట్టింపు సంఖ్యలో గిరిజన, గిరిజనేతరులు పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అటవీ అధికారులు ఏటా ఖరీఫ్ సీజన్‌లో అక్రమంగా సాగు చేసిన వారిని గుర్తించి తొలగించే ప్రయత్నం చేస్తే ఇక్కడి ఓ నాయకుడు వచ్చి రాజకీయం చేస్తారు. దీంతో పోడు పూర్తిగా రాజకీయ అస్త్రంగా మారింది. ట్రాక్టర్లు సీజ్ చేసిప్పుడు విడిపించుకోవడంతో పాటు గిరిజనుల ముసుగులో అనేక మంది రాజకీయ నేతలు విచ్చలవిడిగా భూ కబ్జాలకు పాల్పడి అక్రమ పట్టాలూ పొందారు. కాగజ్‌నగర్ డివిజన్ మహారాష్ట్రలోని 'తాడోబా అభయారణ్యం టైగర్ కారిడార్'గా ఉండడంతోపాటు అంతరించిపోతున్న పొడుగు ముక్కు రాబందులు కూడా ఈ డివిజన్‌లో ఉండడంతో అటవీ అధికారులపై మరింత ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రత్యామ్నాయ అటవీ పెంపకం కోసం 120 హెక్టార్లలో అడవులు పెంచాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇదే ప్రాంతంలో అనేక మంది పోడు వ్యవసాయం చేయడం వారికి రాజకీయ నేతల అండ ఉండడంతో మొక్కల పెంపకం క్లిష్టంగా మారుతోంది. కాగా, ఈ ఘటన తర్వాత జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కుమురంభీం జిల్లా పోలీసు శాఖ నిషేధాజ్ఞలు విధించింది.

దాడి చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు

అటవీ అధికారులు, సిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారన్నారు. ఈ విషయం తెలియగానే స్థానిక పోలీసు ఉన్నతాధికారులతో తాను మాట్లాడానని, బాధ్యులెవరైనా సరే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

16 మందిపై కేసు నమోదు

– మల్లారెడ్డి, కుమురంభీం జిల్లా ఎస్పీ

అటవీశాఖ అధికారులపై దాడికి పాల్పడిన 16 మందిపై కేసు నమోదు చేశాం. దాడికి పాల్పడిన కోనేరు కృష్ణతో పాటు ఆయన అనుచరుడు పోశం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నాం. వీరితోపాటు మొత్తం 16 మందిపై కేసు నమోదు చేశాం.

చట్టం ముందు అందరూ సమానమే: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం సారసాల గ్రామంలో ఎఫ్ఆర్వో, ఇతర అటవీ సిబ్బందిపై జరిగిన దాడిని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ఈ విషయంలో కోనేరు కృష్ణ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై దాడి చేయడం సరైనది కాదన్నారు. అతను ఇప్పటికే అరెస్టు అయ్యాడని, చట్టం ముందు అందరూ సమానమే అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

చర్యలు తీసుకుంటాం: ఇంద్రకరణ్

ఎఫ్ఆర్వోపై దాడి ఘటనపై అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ కూడా స్పందించారు. దాడిపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దీనిపై తప్పకుండా విచారణ జరిపించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అటవీ అధికారిణిపై దాడి గర్హనీయం: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని, ఇందుకు మహిళా అటవీ అధికారిణిపై దాడే నిదర్శనమని కాంగ్రెస్ విమర్శించింది. గిరిజన మహిళా అటవీ అధికారిణిపై ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సోదరుడు చేసిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టీఆర్ఎస్ నేతలు కర్రలతో దాడి చేయడాన్ని ప్రజలు గమనించాలన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు.

రాష్ట్రంలో ఆటవిక పాలన

రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని, మహిళా అధికారులకు రక్షణ లేకుండా పోతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి ఆరోపించారు. కోనేరు కృష్ణ అతని అనుచరుల దాడిలో గాయపడిన అటవీ అధికారి అనితతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని అన్నారు.

ప్రభుత్వమే జవాబు చెప్పాలి: జీవన్‌రెడ్డి

అటవీ శాఖ మహిళా అధికారిపై ఎమ్మెల్యే సోదరుడి దాడిని ఖండిస్తున్నట్టు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పోడు భూముల్లో హరిత హారం మొక్కలు నాటాలని ఓవైపు ప్రభుత్వమే ఆదేశించిందని, మరోవైపు ఎమ్మెల్యే అనుచరులే ఇలా దాడులకు పాల్పడటమేంటని, దీనికి ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎల్పీ కార్యాలయం వద్ద ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

దాడి గర్హనీయం: కోదండరామ్

ఫారెస్ట్ అధికారులపై అధికార పార్టీ నేతలు ఆదివారం ఉదయం చేసిన దాడిని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఆచార్య కోదండరాం ఖండించారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాల్సిన నేతలే.. అధికారులపై దాడులకు పాల్పడడం శోచనీయమన్నారు. ప్రభుత్వం అటవీహక్కుల సమస్య పరిష్కారానికి చట్టపరిధిలో చేయాల్సిన ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి పోడు భూములపై ఆదివాసులకు హక్కులను కల్పించాలని అన్నారు.

వీధి రౌడీల్లాగా టీఆర్ఎస్ నాయకులు: మురళీధర్‌రావు

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ నాయకులు వీధి రౌడీల్లాగా రెచ్చిపోతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికారం తమదేనన్న అహంకారంతో టీఆర్ఎస్ నాయకులు కాగజ్‌నగర్‌లో ప్రజలను కాపాడే పోలీసులపైనే దాడులకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. టీఆర్ఎస్ కారణంగా తెలంగాణ రాష్ట్రం దురాగతాలకు నిలయంగా మారుతోందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

హీరో కృష్ణను పరామర్శించిన చంద్రబాబు

హైదరాబాద్: సూపర్‌స్టార్ కృష్ణను ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం చంద్రబాబు పరామర్శించారు. శేరిలింగంపల్లి నానక్‌రాంగూడలోని కృష్ణ నివాసంలో ఆయనను కలిశారు. కృష్ణ, నరేష్, మహేష్ బాబులను పరామర్శించి ఓదార్చారు. విజయనిర్మల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. విజయనిర్మల మృతి వార్త తెలిసి షాక్‌కు గురయ్యానని అన్నారు. విజయనిర్మల విలువలు కలిగిన వ్యక్తి అని, ఆవిడకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. దర్శకురాలిగా గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిందని తెలిపారు. చంద్రబాబుతోపాటు ఎంపీ గల్లా జయదేవ్, హిందూపూర్ ఎమ్మెల్యే, నటుడు బాలకృష్ణ, మాజీ మంత్రి నారా లోకేష్, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఉన్నారు.

అధికారుల దాడిపై వెంటనే చర్యలు చేపట్టాలి: టీజీవో

సాక్షి, హైదరాబాద్: సిర్పూర్ కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిత, ఇతర సిబ్బందిపై దాడి చేసి ఆటవికంగా ప్రవర్తించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.మమత, ఎ.సత్యనారాయణ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా అటవీ అధికారులు సారసాల గ్రామంలో చేపట్టిన పనులను అడ్డుకోవడమే కాకుండా, వారిపై దాడి చేసిన కోనేరు కృష్ణ, ఇతరులను అరెస్ట్ చేయాలని అన్నారు.

దాడిని ఖండించిన టీజేఎఫ్ఓఏ

ఎఫ్ఆర్వో అనిత, ఇతర అటవీ సిబ్బందిపై జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ దాడి చేయడాన్ని తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. దాడులు చేసిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని టీజేఎఫ్ఓఏ సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు, కార్యదర్శి ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు.

బీసీ జాబితా ధర్మసత్రం కాదు: జాజుల

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం బీసీ కమిషన్‌ను అడ్డు పెట్టుకుని రోజుకొక కులాన్ని బీసీల్లో కలుపుతూ బీసీ జాబితాను ధర్మసత్రంగా మారుస్తుందని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లను తగ్గించిన ప్రభుత్వం బీసీ జాబితాలో కొత్త కులాలను కలపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బీసీ భవన్‌లో ఆదివారం జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఏర్పాటు జరిగి రెండేళ్లు అవుతున్నా బీసీల ప్రయోజనాల కోసం పని చేయకపోగా తాజాగా 30 కులాలను బీసీ జాబితాలో కలుపుతామనడం బీసీల ప్రయోజనాలను దెబ్బ తీయడమేనని విమర్శించారు.

కక్ష కాదు.. రక్ష

సాక్షి, అమరావతి: ప్రజాధనం ఆదా చేయడానికే తప్ప ఎవరి మీదో కక్ష, ద్వేషంతోఅవినీతిపై విచారణ చేయడం లేదని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో రాజకీయాలకు తావు లేదని, కేవలం ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, అవినీతి జరక్కుండా సక్రమంగా వాడుకోవడమేనని తెలిపారు. నిపుణుల కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. గత టీడీపీ సర్కారులో జరిగిన అన్ని రకాల అవినీతి, కుంభకోణాలతో పాటు పలు విధానపరమైన నిర్ణయాల్లో వెనుక గల దురుద్దేశాలపై విచారణకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో దిశా నిర్దేశం చేశారు. ఆయా శాఖల్లో జరిగిన తప్పులు, లోపాలను గుర్తించాలన్నారు. ప్రజా ధనం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం, వృథా కాకూడదని సీఎం స్పష్టం చేశారు. ఎక్కడా అవినీతి జరగకూడదని, ప్రతి శాఖలో ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉంటుందని, జరుగుతున్న పనులను పరిశీలించి.. ఏ తప్పు జరిగినా ఆ పనులను వెంటనే ఆపేయాలని సూచించారు. రీ టెండరింగ్ నిర్వహించి ప్రజల డబ్బును ఆదా చేసి చూపగలిగితే.. మొత్తం వ్యవస్థకు చక్కటి సంకేతాన్ని పంపినట్లవుతుందన్నారు.

ప్రజా ధనం కాపాడటానికే అవినీతిపై విచారణ

- మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- గత సర్కారులో కుంభకోణాలపై ఆధారాలు సేకరించండి
- 45 రోజుల్లో పని పూర్తి చేయాలి.. పోలవరం అవినీతిని 15 రోజుల్లో తేల్చండి

ఎవరినైనా వివరణ కోరవచ్చు..

కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు ఎవరినైనా పిలవచ్చని, వివరణ కోరవచ్చని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నుంచి సమాచారం తీసుకోవచ్చని చెప్పారు. గత టీడీపీ సర్కారులో జరిగిన అవినీతి కుంభకోణాలకు సంబంధించి ఆధారాలను సేకరించాలని, వ్యవస్థను క్లీన్ చేయడానికి ఆపరేషన్ ప్రారంభిస్తూ 45 రోజుల్లో పని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పుడు జరుగుతున్న పనులు ఇచ్చిన ధర కన్నా తక్కువకే జరుగుతాయనుకుంటే వెంటనే రివర్స్ టెండరింగ్‌కు వెళ్లాలని సూచించారు.

రివర్స్ టెండరింగ్‌లో ఎక్కువ మంది పాల్గొనాలి

ప్రభుత్వ శాఖల్లో ఎక్కడైనా తప్పు జరిగిందని తేలితే రివర్స్ టెండరింగ్ నిర్వహించవచ్చునని, ఆ తాజా టెండరింగ్‌లో ఇప్పుడు కొనసాగుతున్న కాంట్రాక్టర్ కూడా పాల్గొనవచ్చని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పోలవరం, వెలిగొండ, అర్బన్ హౌసింగ్‌లపై తక్షణం దృష్టి సారించి, వెంటనే రివర్స్ టెండరింగ్‌కు వెళ్లాలని సూచించారు. అర్బన్ హౌసింగ్‌లో యూనిట్ల సైజును తగ్గిస్తే ఎక్కువ మంది పాల్

నేడు బాబ్లీ గేట్లు ఎత్తివేత

- ఆశించిన స్థాయిలో నీరు లేక ప్రాజెక్టు వెలవెల
- మహారాష్ట్రలో వర్షాలు కురిస్తేనే వరద నీరు
- కనిష్ట మట్టానికి చేరిన ఎస్సారెస్పీ

మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

మామడ(నిర్మల్): గత ఏడాది మహారాష్ట్రలో జూన్ ఆరంభంలోనే భారీ వర్షాలు కురవడంతో గోదావరి నదిపై ఉన్న అక్కడి ప్రాజెక్టులు నిండాయి. జూన్ 11, 12 తేదీల్లో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తివేయడంతో 4 టీఎంసీల వరద నీరు ఎస్సారెస్పీలోకి వచ్చి చేరింది. అయితే ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా ఉంది. ఎగువన వర్షాలు లేక అక్కడి ప్రాజెక్టులతో పాటు బాబ్లీలోనూ ఆశించిన స్థాయిలో నీరు చేరలేదు. దీంతో భారీ వర్షాలు వచ్చే వరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రావడం కష్టమే అంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఏటా కేంద్ర జలవనరుల సంఘం నియమించిన పర్యవేక్షక కమిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూలై 1న ఎత్తి వరద నీటిని దిగువన ఉన్న ఎస్సారెస్పీకి వదులుతారు. నాలుగు నెలల అనంతరం అక్టోబర్ 28న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మూసివేస్తారు.

ఎస్సారెస్పీ నీటి మట్టం వివరాలు

పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం: 90 టీఎంసీలు, 1,091 అడుగులు
ప్రస్తుత నీటి నిల్వ: 5.508 టీఎంసీలు, 1,048.70 అడుగులు.
గతేడాది జూన్ 30న నీటి నిల్వ: 10.171టీఎంసీలు, 1,056.20 అడుగులు

గోదావరిలో కనిపించని నీటి ప్రవాహం..

గత ఏడాది జూన్‌లోనే వర్షాలు కురిసి ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరింది. ఈ ఏడాది ఖరీఫ్ పనులు ప్రారంభమై నెల గడుస్తున్నా ఇప్పటికీ ఆశించిన వర్షాలు కురవక పోవడంతో గోదావరిలో నీటి ప్రవాహం కనిపించడం లేదు. నదికి ఇరువైపులా కరువుచాయలు నెలకొన్నాయి. భారీ వర్షాలు లేకపోవడంతో గోదావరిపైన ఉన్న వాగులు, కాలువలు ప్రవహించడం లేదు. నీటి ప్రవాహం లేక గోదావరి ఎండి పోయింది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోనూ నీటి నిల్వ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 90 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.508 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. తాగునీటి అవసరాలకు ప్రతిరోజు 251 క్యూసెక్కుల నీటిని ఈ ప్రాజెక్టు నుంచి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో నీటి మట్టం రోజురోజుకు తగ్గి కనిష్ట స్థాయికి చేరుకుంది.

నీరు లేక ఎండిపోయిన గోదావరి నది

వర్షాలు కురిస్తేనే వరద...

ప్రస్తుతం మహారాష్ట్రలోని బాబ్లీలో నీరు లేక పోవడంతో గేట్లను ఎత్తినా వరద నీరు దిగువకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. మహారాష్ట్రలోని నాందేడ్, పర్బనీ, జాల్నా జిల్లాల్లో వర్షాలు కురిస్తే వరద నీరు గోదావరిలోకి వచ్చి చేరుతుంది. గోదావరిపై మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు నిండిన తర్వాత నీరు వదిలితేనే శ్రీరాంసాగర్‌కు వరద నీరు వస్తుంది. విష్ణుపురి ప్రాజెక్టు దిగువన వచ్చే వరద శ్రీరాంసాగర్‌కు చేరుతుంది. భారీ వర్షాలు కురిస్తేనే ఈ ప్రాజెక్టులోకి నీరు చేరే అవకాశం ఉంటుంది. జూలైలో వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి ఆశించిన స్థాయిలో నీరు చేరితేనే ఖరీఫ్‌లో వరి సాగుకు అనుకూలంగా ఉంటుంది. లేకుంటే సాగునీటికి ఇబ్బందులు తప్పవని అంటున్నారు.

బాబ్లీలో నీరు లేనందున వరద నీరు కష్టమే

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన వర్షాలు కురవక పోవడంతో వరద నీరు ప్రాజెక్టులోకి రావడం లేదు. అలాగే బాబ్లీ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ లేనందున గేట్లు ఎత్తినా వరద నీరు వచ్చే అవకాశాలు తక్కువే. వర్షాలు కురిస్తేనే వరద నీరు వచ్చి చేరుతుంది.
– రామారావు, ఈఈ, ఎస్సారెస్పీ

యాదాద్రి గర్భాలయ ముఖ ద్వారాలకు తలుపులు

యాదగిరికొండ: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ పునర్నిర్మాణ పనుల్లో మరో కీలక ఘట్టం ముగిసింది. గర్భాలయ ద్వారానికి ఆదివారం దేవస్థానం అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించి 13 అడుగుల భారీ తలుపులను అమర్చారు. తిరుపతి నుంచి తీసుకువచ్చిన ఈ తలుపులకు రానున్న రోజుల్లో బంగారు తాపడాలు వస్తాయని దేవస్థానం అధికారులు తెలిపారు. అదే విధంగా గర్భాలయం ముందు భాగంలో గోడలపై ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రహ్లాద చరిత్రను తెలియజేసే చిత్రాలను చెక్కారు. స్వయంభూ మూర్తుల ఆలయం శోభాయమానంగా ఉండేందుకు, చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు వీలుగా నిర్మాణాలు చేస్తున్నారు. గర్భాలయం పక్కన నరసింహస్వామి అవతారాల నిర్మాణం జరుగుతుంది. గర్భాలయం వద్ద ఏర్పాటు చేయనున్న ద్వారపాలకుల విగ్రహాలను రెండు మూడ్రోజుల్లో ప్రతిష్టించనున్నారు. కార్యక్రమంలో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈఓ గీతారెడ్డి, స్థపతులు సుందర్‌రాజన్, వేలు, ఆలయ ప్రధానార్చకులు నల్లందీగళ్ లక్ష్మీ నరసింహాచార్యులు, కారంపూడి నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 25 వేల మంది స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానికి 5 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఈ ఒక్క రోజే ఆలయంలోని వివిధ విభాగాల ద్వారా రూ.27,11,145 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.


ఈటలను సత్కరిస్తున్న చినజీయర్‌స్వామి, కావేరి సీడ్స్ అధినేత భాస్కర్‌రావు. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి

మహిళా సంక్షేమంపై కేంద్రం చిన్నచూపు

మంత్రి ఈటల రాజేందర్

భీమదేవరపల్లి: కేంద్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమంపై చిన్న చూపు చూస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌లో రూ.4 కోట్ల వ్యయంతో కావేరి సీడ్స్ అధినేత గుండవరపు భాస్కర్‌రావు నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, త్రిదండి చినజీయర్‌స్వామితో కలసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. గతంలో మహిళా, శిశు సంక్షేమం కోసం రూ.17,800 కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, ఈ ఏడాది కేవలం రూ.10 వేల కోట్లకే పరిమితమైందన్నారు. కాగా మహిళా, శిశు సంక్షేమం కోసం గతంలో రూ.400 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం దానిని రూ.వెయ్యి కోట్లకు పెంచిందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం మొబైల్ టీంలు ఏర్పాటు చేసి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ఐలు సహకరించాలని పిలుపునిచ్చారు. చినజీయర్‌స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా నర్సింగాపూర్‌లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో గుండవరపు వనజా దేవి–భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మహిళా మెగా వైద్య శిబిరాన్ని చినజీయర్‌స్వామి ప్రారంభించారు.

చింతమడకకు కేసీఆర్!

- జూలై మొదటి వారంలో పర్యటన
- సీఎం పర్యటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సమీక్ష

సాక్షి, సిద్దిపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ వారం రోజుల్లో తన స్వగ్రామమైన చింతమడకకు రానున్నారు. ఈ క్రమంలో గ్రామంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి సీఎం పర్యటనపై సమీక్షించారు. చింతమడకలో పలు అభివృద్ధి అంశాలపై వారు సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. చాలా రోజుల తర్వాత సీఎం స్వగ్రామానికి వస్తున్నందున ఏర్పాట్లు ఘనంగా ఉండాలన్నారు. గ్రామ సమస్యలపై, అధికారులతో, ప్రజలతో సీఎం కేసీఆర్ సమీక్షిస్తారని తెలిపారు. అనంతరం ప్రజలతో సహపంక్తి భోజనం చేస్తారన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. అలాగే భూమి లేని నిరుపేదలను గుర్తించాలని ఈ సందర్భంగా హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. గ్రామంలోని అభివృద్ధిపై, గ్రామ అవసరాలపై రెండ్రోజుల్లోగా నివేదిక తయారు చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చింతమడక గ్రామంలో ఉన్న చెరువులు, కుంటలు, కాలువలు, అనుసంధానం చేసే మ్యాప్‌ను సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. సీఎం కేసీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేసే దిశగా అధికారులు సమాయత్తం కావాలన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న హరీశ్‌రావు

పొండురంగాశ్రమం వరకు రోడ్డు

ములుగు (గజ్వేల్): సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని భవానందపూర్ పాండురంగ ఆశ్రమానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఈ మార్గంలో రోడ్డు రవాణాను అభివృద్ధి పరచడంపై సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వంటిమామిడి మీదుగా భవానంద ఆశ్రమానికి నేరుగా చేరుకునేందుకు రోడ్డు మార్గం కోసం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రోడ్డు మార్గంపై వంటిమామిడికి సమీపంలో ఉన్న క్షీరసాగర్ గ్రామ మాజీ సర్పంచ్ మక్తాల వెంకటేశ్‌గౌడ్‌తో సీఎం కేసీఆర్ శనివారం రాత్రి ఫోన్‌లో చర్చించారు. ములుగు, గౌరారం మీదుగా కాకుండా వంటిమామిడి నుంచి పాండురంగాశ్రమానికి నేరుగా వెళ్లే దగ్గరి మార్గం కోసం ఆయనను అడిగి తెలుసుకున్నారు. ఆ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అంతేకాకుండా వంటిమామిడి నుంచి ఆశ్రమానికి ఎంత దూరమవుతుంది? క్షీరసాగర్ నుంచి పాండరంగాశ్రమానికి నేరుగా పోవాలంటే మధ్యన అటవీ ప్రాంతం ఎంత ఉంటుందన్న విషయమై పూర్తి సమాచారం సేకరించమని సీఎం కేసీఆర్ వెంకటేశ్‌గౌడ్‌కు సూచించారు. కాగా మర్కూక్ పాండురంగాశ్రమానికి హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉండటం, మరోవైపు భక్తులకు రవాణ సౌకర్యం మెరుగుపరిచేందుకు సీఎం కేసీఆర్ ఆలోచిస్తుండటంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెదక్ జిల్లాలో కెమికల్ వ్యర్థాల కలకలం

నర్సాపూర్ రూరల్: కెమికల్ కంపెనీల నుంచి వెలువడే వ్యర్థాలను తెచ్చి నివాస ప్రాంతంలో పడేసి వెళ్లడం కలకలం సృష్టించింది. దీంతో కెమికల్ బ్యాగులు ఒక్కొక్కటీ పేలుతూ పోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం గొల్లపల్లి సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కెమికల్ వ్యర్థాలను ప్లాస్టిక్ బ్యాగుల్లో మూటకట్టి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఓ వాహనంలో వచ్చి గొల్లపల్లి సమీపంలో పడేసి వెళ్లారు. కాసేపటి తర్వాత ఆ బ్యాగులు ఒక్కొక్కటిగా పేలుతూ మంటలు చెలరేగడంతో స్థానికులు భయంతో రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా గడిపారు. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మంటలు ఆరిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం గ్రామ సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూడగా ఆ ప్రాంతంలో దుర్గంధంతోపాటు సమీపంలోని చెట్లు, గడ్డి మాడిపోయి కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారమివ్వగా వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కెమికల్ బ్యాగులు ఎక్కడి నుంచి తెచ్చి పడేశారనే దానిపై దర్యాప్తు జరుపుతామని తెలిపారు.

క్యాట్ ఫిష్ లోడ్ పట్టివేత

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని వీఎం బంజర్ గ్రామంలో క్యాట్ ఫిష్‌ను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు నుంచి వరంగల్‌కు 40 బాక్సుల్లో రూ.90 వేల విలువ చేసే 900 కేజీల క్యాట్ ఫిష్‌ను తరలిస్తున్నారు. తెల్లవారు జామున వీఎం బంజర్‌లోని సాగర్ కాల్వ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తూండగా వ్యాన్‌ను పట్టుకున్నారు.

అద్దె ఇంటి యజమాని అమానుషం

- అప్పుల బాధతో చనిపోయిన నేతకార్మికుడు సదానందం
- భార్యాపిల్లలకు ఆశ్రయం లేక రోడ్డునపడ్డ దైన్యం
- చావు ముట్టుడని ఇంట్లోకి రానివ్వని వైనం
- వారం రోజులుగా జిల్లా ఆస్పత్రిలో బాధిత కుటుంబం
- కేటీఆర్ ఆదేశంతో కమ్యూనిటీ భవనంలో ఆశ్రయం

కమ్యూనిటీ భవనంలో బాధిత కుటుంబం

సిరిసిల్లటౌన్: సాటి మనిషి చనిపోతే.. మృతుని కుటుంబ సభ్యులతో అమానుషంగా ప్రవర్తించాడో అద్దె ఇంటి యజమాని. మృతదేహాన్ని ఇంటికి రానివ్వకపోవడంతోపాటు కుటుంబ సభ్యులు కూడా కర్మకాండలు అయ్యేవరకు ఇంట్లోకి రావద్దని హుకుం జారీచేశాడు. దీంతో బాధిత కుటుంబం రోడ్డున పడింది. ఎక్కడికి వెళ్లాలో తెలియక జిల్లా ఆస్పత్రిలోని రేకుల షెడ్డులో వారం రోజులుగా ఆ కుటుంబం తలదాచుకుంటోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయనడానికి ఉదాహరణగా నిలిచే ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. సిరిసిల్ల పట్టణం శివనగర్‌కు చెందిన వేముల సదానందం (38) కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. సాంచాలు నడుపుతూ.. అద్దె ఇంట్లో నివసిస్తూ.. భార్య కవిత, పిల్లలు లవన్, వైష్ణవిని పోషించుకునేవాడు. వచ్చే కొద్ది పాటి కూలి డబ్బు ఇంటి అవసరాలకు సరిపోక అప్పులు చేశాడు. అప్పులు రూ.2 లక్షలకు చేరడంతో అప్పులు ఇచ్చినవారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో వారంక్రితం ఇంట్లోనే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకుపోగా చికిత్స పొందుతూ.. చనిపోయాడు. అయితే శవాన్ని ఇంటికి తీసుకురావద్దని, 12 రోజులు కర్మకాండలు అయ్యేవరకు కూడా ఇంట్లో ఉండొద్దని ఇంటి యజమాని హుకుం జారీ చేయడంతో సదానందం కుటుంబం జిల్లా ఆస్పత్రిలో ఉన్న షెడ్డులో తలదాచుకుంటోంది.

స్పందించిన కేటీఆర్..

ఈ అమానుష సంఘటన ఆదివారం సిరిసిల్లలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పీఏ గణరాజును ఆ కుటుంబానికి నీడ కల్పించాలని ఆదేశించారు. వెంటనే ఆయన ఆస్పత్రిలో ఉంటున్న కవిత, పిల్లలకు వెంకంపేట కమ్యూనిటీ భవనంలో ఆశ్రయం కల్పించారు. బాధిత కుటుంబానికి వెంటనే సాయం అందిస్తామని, డబుల్‌బెడ్రూం ఇల్లు కూడా ఇప్పిస్తామని కేటీఆర్ నుంచి హామీ రావడంతో ఆ కుటుంబ సభ్యులు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు స్థానికులు కూడా ఆ కుటుంబానికి ఆర్థికంగా సాయం చేయడానికి ముందుకొచ్చారు. 12రోజుల కార్యక్రమాలు జరిగే వరకు భవనంలో ఉండటానికి వసతులతోపాటు భోజనం ఏర్పాట్లు కూడా చేసినట్లు గణరాజు తెలిపారు.

ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచారం

కుమురం భీం జిల్లాలో ఘటన

ఆసిఫాబాద్: ఓ కామాంధుడు ఇద్దరు తొమ్మిదేళ్ల బాలికలపై అత్యాచారం చేసిన సంఘటన కుమురం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటలో ఆదివారం చోటు చేసుకుంది. వీరిలో అత్యాచారం జరిపిన వ్యక్తికి ఒకరు వరుసకు చెల్లెలు, మరొకరు మేన కోడలు కావడం విశేషం. కుమురం భీం జిల్లాలో ఈ సంఘటన సంచలనం రేపింది. ఆసిఫాబాద్ సీఐ రాజు కథనం ప్రకారం.. చిర్రకుంట గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు గ్రామంలోని పాఠశాలలో ఐదో తరగతి చదువుకుంటున్నారు. ఇద్దరి ఇండ్లు పక్కపక్కనే ఉన్నాయి. చిన్నారుల తల్లిదండ్రులు ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్లారు. ఒంటరిగా ఉన్న ఓ చిన్నారి మధ్యాహ్నం ఆడుకునేందుకు పక్కన ఉన్న స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో సమీపంలోని ఇంట్లో ఉంటున్న వరుసకు అన్న అయిన నైతం జ్ఞానేశ్వర్(28) ఇంట్లోకి వచ్చి, టీవీ సౌండ్ పెంచి వరుసగా వారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో బాలిక తండ్రి ఇంటికిరాగా జ్ఞానేశ్వర్ పారిపోయాడు. మరో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నారులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు జరిపించారు. నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

మూడు వాహనాలు దహనం

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దుశ్చర్య

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు పనులకు వినియోగిస్తున్న మూడు వాహనాలను ఆదివారం మావోయిస్టులు దహనం చేశారు. సుకుమా జిల్లా ఎర్రబోరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎర్రబోరు–లెంద్రా గ్రామాల మధ్య మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల అభివృద్ధి నిధులతో రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ పనులు నిలిపివేయాలంటూ గతంలో మావోయిస్టులు హెచ్చరికలు జారీ చేసినా లక్ష్యపెట్టకుండా కాంట్రాక్టర్ పనులు సాగిస్తుండడంతో ఆగ్రహించిన మావోయిస్టులు.. ఆదివారం ఉదయం ఆ ప్రాంతానికి వచ్చి ట్రాక్టర్, మిక్చర్ మిషన్, రోడ్ రోలర్‌లను తగులబెట్టారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు సమీప అటవీ ప్రాంతంలో కూంబింగ్ ముమ్మరం చేశారు. డీఆర్‌జీ, ఎస్టీఎస్, సీఆర్‌పీఎఫ్ బలగాలను ఆ ప్రాంతానికి తరలించి పెద్ద ఎత్తున గాలిస్తున్నారు.

రాంపూర్‌లో మూడో మోటార్ డ్రైరన్ సక్సెస్


మోటార్లను ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మల్యాల/ఇబ్రహీంపట్నం (కోరుట్ల): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్‌లో ఆదివారం మూడో మోటార్ డ్రైరన్ విజయవంతమైంది. మూడో మోటార్‌ను ఇంజనీరింగ్ అధికారులు విజయవంతంగా పరీక్షించారు. మోటారు వేగం, ఉష్ణోగ్రత, విద్యుత్ వినియోగం వంటి అంశాలు సంతృప్తికరంగా ఉన్నాయని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ పంప్‌హౌస్‌లో నీటిని ఎత్తిపోసేందుకు 6.5 మెగావాట్ల సామర్థ్యంతో 8 మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు. సాగునీటిరంగ సలహాదారుడు పెంటారెడ్డి, ప్రాజెక్టు ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ శ్రీకాంత్‌రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్‌రావు, ఈఈ సుధాకిరణ్, నవయుగ డైరెక్టర్ రామారావు, డీఈఈ రాంప్రదీప్, క్వాలిటీ కంట్రోల్ ఈఈ రమేశ్, ఈఈ మధుసూదన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్, ఏఈఈ తిరుపతి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జూలై 15 నాటికి మరో రెండు

వరదకాలువపై 73వ కిలోమీటరు వద్ద నిర్మిస్తున్న రాంపూర్ పంప్‌హౌస్‌లో పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ఖరీఫ్‌లో నీరు ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధం చేస్తున్నారు. మే 30న మొదటి మోటారును, జూన్ 22వ తేదీన రెండో మోటారు డ్రైరన్ విజయవంతంగా నిర్వహించారు. జూన్ 30న మూడో మోటార్ సాంకేతిక సామర్థ్యం, పనితీరు, వేగం తదితర అంశాలను విజయవంతంగా పరీక్షించారు. జూలై 15 నాటికి మరో రెండు మోటార్లను సిద్ధం చేయనున్నారు.

రాజేశ్వర్‌రావుపేట వద్ద మొరాయించిన మోటార్లు

ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జగిత్యాల జిల్లాలోనే ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట వద్ద నిర్మించిన పంపుహౌస్‌లో ఆదివారం చేపట్టిన డ్రైరన్‌లో మోటార్లు మొరాయించాయి. పంపుహౌస్‌లో 65.5 మెగావాట్ల సామర్థ్యంగల 2 మోటార్లను బిగించారు. పూజల అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మోటార్లను ప్రారంభించారు. అయితే మోటార్లు మొరాయించాయి. ఇంజనీర్లు ఎంత ప్రయత్నించినప్పటికీ ట్రిప్ అవుతుండడం.. అటు భారీ వర్షం పడడంతో మరమ్మతులకు అంతరాయం ఏర్పడింది. మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి ఎంపీపీలు భీమేశ్వరి, సాయిరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లు వాయిదా

- జూలై 5 నుంచి ప్రారంభించేలా రివైజ్డ్ షెడ్యూల్ జారీ
- ఏఎఫ్ఆర్‌సీకి 10వ తేదీ వరకు లభించనున్న సమయం

ఫైల్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మరోసారి వాయిదా పడింది. జూలై 5 నుంచి నిర్వహించేలా ప్రవేశాల కమిటీ ఆదివారం రివైజ్డ్ షెడ్యూల్‌ను జారీ చేసింది. ఇంజనీరింగ్ కాలేజీల ఫీజుల వ్యవహారం పూర్తిగా తేలకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. షెడ్యూల్ ప్రకారం జూన్ 27 నుంచి జూలై 4 వరకు ఆప్షన్లకు అవకాశం కల్పించేలా కమిటీ షెడ్యూల్ జారీ చేసింది. అయితే కాలేజీల ఫీజుల వ్యవహారం తేలకపోవడం, యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించడంతో 27 నుంచి ప్రారంభం కావాల్సిన ఆప్షన్లను జూలై 1కి వాయిదా వేసింది. ఆదివారం వరకూ కోర్టును ఆశ్రయించిన కాలేజీల ఫీజుల వ్యవహారం తేలకపోవడంతో సోమవారం నుంచి ప్రారంభం కావాల్సిన ఆప్షన్లను 5 నుంచి ప్రారంభిస్తామని ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ ప్రకటించారు. అంటే 5వ తేదీ నుంచి మరో నాలుగైదు రోజులు వెబ్ ఆప్షన్లకు, చివరి రోజున ఆప్షన్ల ఎడిట్‌కు అవకాశమిస్తారు. ఈ లెక్కన 10వ తేదీ నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేస్తారు.

ఈలోగా ఫీజులు ఖరారు!

సవరించిన షెడ్యూల్ ప్రకారం మొత్తానికి 10 రోజుల సమయం ఉండనుంది. ఈలోగా కోర్టును ఆశ్రయించిన కాలేజీల ఫీజులను ఖరారు చేయాలన్న నిర్ణయానికి ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్ఆర్‌సీ) వచ్చింది. శనివారం కాలేజీ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించిన ఏఎఫ్ఆర్‌సీ.. రూ. 50 వేల లోపు ఫీజు ఉన్న కాలేజీలకు 20%, రూ. 50 వేలకు పైగా ఫీజు ఉన్న కాలేజీలకు 15% ఫీజులను పెంచుతామని ప్రతిపాదించిగా.. మెజారిటీ కాలేజీలు అంగీకరించాయి. కోర్టును ఆశ్రయించిన కాలేజీల్లోనూ చాలావరకు అంగీకారం తెలిపాయి. కోర్టును ఆశ్ర యించిన 81 కాలేజీల్లో ఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదిత ఫీజుకు గరిష్టంగా 20 కాలేజీలు అంగీకరించే పరిస్థితి లేదు. కాబట్టి ఆ 20 కాలేజీలకు నాలుగైదు రోజుల్లో ఫీజులను ఖరారు చేసే అవకాశం ఉంది.

వీలైతే అన్నింటి ఫీజు ఖరారు..

తాజా షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10 వరకు సమయం లభించనుంది. దీంతో కోర్టును ఆశ్రయించినవే కాకుండా వీలైతే మిగతా అన్ని కాలేజీల ఫీజులనూ ఖరారు చేయాలన్న ఆలోచనల్లో ఏఎఫ్ఆర్‌సీ ఉంది. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 12 వరకు పనిచేసేలా షెడ్యూల్ సిద్ధం చేసుకొని ముందుకు సాగుతోంది. ఇప్పటికే అన్ని కాలేజీల రెండేళ్ల ఆదాయ వ్యయాలు, ఇప్పటి నుంచి మూడేళ్లు వసూలు చేయాల్సిన కొత్త ఫీజుల ప్రతిపాదనలు ఏఎఫ్ఆర్‌సీ వద్ద ఉన్నాయి. కాలేజీల వారీగా అన్ని లెక్కలను క్రోడీకరించి ఏఎఫ్ఆర్‌సీ తరఫున ఉన్నత విద్యా మండలి సిద్ధం చేసి

సభ్యత్వ నమోదు 'గుబాళించాలి'

- మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి
- ఎమ్మెల్యేలు, స్థానిక నేతలతో సమన్వయం చేసుకోవాలి
- 20వ తేదీ కన్నా ముందే లక్ష్యాన్ని పూర్తిచేయాలి
- పార్టీ సభ్యుల సమాచారం జిల్లాలవారీగా డిజిటలీకరణ
- నియోజకవర్గ ఇన్‌చార్జీల సమావేశంలో కేటీఆర్ దిశానిర్దేశం

ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన నియోజకవర్గ ఇన్‌చార్జీల సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం కావాలని, త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణభవన్‌లో నియోజకవర్గాలవారీగా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జీలతో ఆయన భేటీ అయ్యారు. పార్టీలో సభ్యత్వ నమోదు, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుపై ఆయన దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం సరైన వ్యూహం, పక్కా ప్రణాళిక ఏర్పర్చుకోవాలని సూచించారు.

119 నియోజకవర్గాలు... 60 లక్షల సభ్యత్వాలు

పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గనిర్దేశం మేరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కేటీఆర్ పార్టీ ఇన్‌చార్జీలను కోరారు. ఇప్పటికే 119 నియోజకవర్గాలకు దాదాపు 60 లక్షల సభ్యత్వ నమోదు పుస్తకాలను పంపిణీ చేశామని, జూలై 20 కన్నా ముందే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కేటీఆర్ కోరారు. మొత్తం పార్టీ సభ్యత్వంలో 35 శాతం క్రియాశీలక సభ్యులను నమోదు చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో కలసి సమన్వయం చేసుకుంటూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని సమన్వయం చేసుకునేందుకు రెండు నియోజకవర్గాలకు ఒకరు చొప్పున ఇన్‌చార్జీలను పార్టీ ప్రకటించింది. దీంతోపాటు హైదరాబాద్ పరిధిలో ప్రతి నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జీని పార్టీ ప్రకటించింది. పార్టీ నియమించిన ఇన్‌చార్జీలు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాబోయే రెండు వారాలపాటు ఆయా నియోజకవర్గాల్లో ఉంటూ పార్టీ సభ్యత్వనమోదులో స్థానిక నాయకులందరినీ భాగస్వాములను చేస్తూ పర్యవేక్షించాలన్నారు. మరో వారంరోజుల్లో ఆన్‌లైన్, మొబైల్ ద్వారా సభ్యత్వాన్ని నమోదు చేసుకునే సౌకర్యాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. సభ్యత్వ నమోదు సందర్భంగా తీసుకోవాల్సిన పలు చర్యలను సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. సభ్యత్వ నమోదు సందర్భంగా కార్యకర్తల పూర్తి సమాచారం సేకరించాలని కోరారు. ముఖ్యంగా కార్యకర్తలకు ప్రమాదబీమా ఉన్నందున, పూర్తి చిరునామా, మొబైల్, ఆధార్ నంబర్, నామినీ వివరాలను సేకరించాలన్నారు. వివరాలుంటే పార్టీ అందిస్తున్న బీమా సౌకర్యానికి ఎలాంటి ఇబ్బందులు భవిష్యత్తులో తలెత్తవని తెలిపారు.

తొలి సభ్యత్వం కేటీఆర్‌దే!

ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు కేటీఆర్‌తోనే ప్రారంభమైంది. సమావేశ ప్రారంభానికి ముందు కేటీఆర్ అందరి కంటే ముందుగా సభ్యత్వం తీసుకున్నారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మన్నె కవిత చేతుల మీదుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తొలి సభ్యత్వం అందజేశారు.

బీసీలకు పెద్దపీట వేయండి

పార్టీ కమిటీల ఏర్పాటులో బీసీల ప్రాధాన్యతకు సంబంధించి కేటీఆర్ పలు ఆదేశాలు జారీ చేశారు. పార్టీ అధ్యక్షుల ఆదేశం మేరకు పార్టీ కమిటీల్లో కనీసం 51 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఉండేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ, మండల కమిటీలను, నగరాలు, పట్టణాల్లో వార్డు, డివిజన్ కమిటీ ఏర్పాట్లను జూలై 20 నాటికి సభ్యత్వ నమోదుతో సమాంతరంగా పూర్తి అయ్యేలా స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకోవాలని ఇన్‌చార్జీలకు కేటీఆర్ సూచించారు. ప్రతి కమిటీలో 15 మందికి తగ్గకుండా చూడాలని, అన్ని కమిటీల్లోనూ పార్టీ క్రియాశీలక సభ్యులకు మాత్రమే అవకాశం ఇవ్వాలని సూచించారు. పార్టీ అనుబంధ సంఘాలైన రైతు, యువజన, కార్మిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళాకమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను తానే స్వయంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు వివరాలను ఎక్కడికక్కడే డిజిటలీకరణ చేస్తున్నామని, ప్రతి జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించే జిల్లా ఇన్‌చార్జీలను కేటీఆర్ ప్రకటించారు.

ప్రజాసేవే నా జీవితాశయం

ఏపీ సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపిన అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న తాను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఏపీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మజ్లిస్ పార్టీ శాసనసభాపక్షనేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా రు. అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్న అనంతరం ఆయన చాంద్రాయణగుట్ట నియోజకవర్గం జమాల్‌కాలనీలో నిర్మించనున్న ఒవైసీ జూనియర్ కాలేజీ భవనానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. మరోసారి చావు దగ్గరకు వెళ్లిన తనను ప్రజల ఆశీస్సులే బతికించాయన్నారు. ప్రజలకు సేవే జీవిత లక్ష్యమని, అందుకే తాను తిరిగి వచ్చానన్నారు. మళ్లీ పునర్జన్మ ప్రసాదించడమంటే ప్రజలకు తాను చేయాల్సింది ఇంకా ఎంతో ఉందన్న మాట అని పేర్కొన్నారు.

వెయ్యిమందికి ఉచితవిద్య

ఏదో ఒకరోజు చావడం ఖాయమని, అప్పటివరకు ప్రజల నడుమ ఉంటూ ప్రజల గుండెల్లో గూడు కట్టుకోవడమే తన కర్తవ్యమని అక్బరుద్దీన్ అన్నారు. ఇప్పటికే వెయ్యిమంది విద్యార్థులకు ఒవైసీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో ఉచితంగా విద్యను అందిస్తున్నామని, ఇంటర్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నానని చెప్పారు. విద్యతోనే మనకు అన్ని రకాల గుర్తింపు లభిస్తుందని, ప్రతి కుటుంబంలోని పిల్లలందరూ ఉన్నత చదువులు చదవాలన్నారు. నియోజకవర్గంలో మరిన్ని ఎడ్యుకేషనల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. తాను ఉన్నా లేకున్నా ఈ విద్యాసంస్థలను తన కుమారుడు, కుమార్తె చూసుకుంటారని స్పష్టం చేశారు. చౌకీదార్, చాయ్‌వాలాలతో దేశానికి ఒరిగేదేమీ లేదని విమర్శించారు.

నేడు కాంగ్రెస్ సచివాలయ సందర్శన

సాక్షి, హైదరాబాద్: కొత్త సచివాలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ బృందం సోమవారం సచివాలయాన్ని సందర్శించనుంది. ఉదయం 11 గంటల నుంచి ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు సచివాలయంలోని అన్ని బ్లాకులను ఓ గంటపాటు పరిశీలించనున్నారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడనున్నారు. అయితే, శనివారం నాగార్జునసాగర్‌లో జరిగిన టీపీసీసీ సమావేశంలో మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి సచివాలయ సందర్శన ప్రతిపాదన చేశారు. వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్న రేవంత్ ప్రతిపాదనకు టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌తో పాటు ఇతర నేతలు కూడా ఏకీభవించడంతో సోమవారమే ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.

కబ్జాలను ప్రభుత్వం పట్టించుకోదా: చాడ

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భూ ఆక్రమణలు, కబ్జాలు పెరిగిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోదా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. 2014లో జరిగిన అఖిల పక్ష సమావేశంలోనూ ఇదే అంశంపై తాను ఆందోళన వ్యక్తం చేశానని గుర్తు చేశారు. 399 చెరువులు, కుంటలను నీటి పారుదల శాఖ మున్సిపల్ శాఖకు బదిలీ చేసిన తరువాత కూడా వీటి పరిరక్షించలేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమార్కులు యథేచ్ఛగా కుంటల్ని, చెరువుల్ని ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. విజయానగర్ కాలనీలోని దేవుని కుంట కబ్జానే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఈ ఆక్రమణలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గిరిజన వర్సిటీ ప్రారంభానికి చర్యలు

కేంద్ర మానవ వనరులశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ములుగు గిరిజన విశ్వ విద్యాలయంలో విద్యా సంవత్సరాన్ని ప్రారంభించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, ఇతర అధికారులను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదరి ఆర్.సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుపై గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ అప్పారావు, ఇతర అధికారులతో ఆదివారం సెంట్రల్ యూనివర్సిటీలో సమీక్షా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టులోగా వర్సిటీకి అవసరమైన భూమిని పూర్తి స్థాయిలో బదిలీ చేయాలని పేర్కొన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక క్యాంపస్, క్లాస్ రూమ్‌లు, డార్మెటరీలను ములుగు సమీపంలోని ట్రైబల్ వెల్ఫేర్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆగస్టులోగా ఆ పనుల ను పూర్తి చేయాలని ఆదేశించారు. వాటికోసం యూజీసీ నుంచి రూ. 3 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ వీసీ అప్పారావు మాట్లాడుతూ, ఇపుడు అకడమిక్ ఇయర్‌ను కొనసాగించడం కష్టమని, అయితే సాధ్యాసాధ్యాలను రెండు రోజుల్లో వివ రంగా కేంద్ర మానవ వనరుల శాఖకు నివేది స్తామని తెలిపారు. మహేశ్‌దత్ ఎక్కా మాట్లాడుతూ, గతంలో తీసుకున్న నిర్ణయం మేరకు స్థానిక గిరిజన విద్యార్థులకు యూనివర్సిటీలో 1/3 సీట్లను కేటాయించాలని కోరారు. దానిపై సుబ్రహ్మణ్యం బదులు ఇస్తూ త్వరలోనే నిర్ణయం తీసుకుని కేంద్ర కేబినెట్ తీర్మానంలో పొందుపరుస్తామన్నారు. రెండు రోజుల్లో నిర్ణయం చెప్పాలని అప్పారావుకు సూచించారు.

సాహిత్యం హృదయాలను తాకాలి

నందిని సిధారెడ్డి

హైదరాబాద్: కవులు, రచయితలు సృష్టించే సాహిత్యం ప్రజల హృదయాలకు తాకేలా ఉండాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం 3వ రాష్ట్ర మహాసభలు ఆదివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. తెరసం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా నందిని సిధారెడ్డి హాజరయ్యారు. 'తెలంగాణ ఉద్యమాలు– సాహిత్య సంస్థలు– సాహిత్యం' అనే అంశంపై పలువురు వక్తలు ప్రసంగించారు. నందిని సిధారెడ్డి ప్రసంగిస్తూ.. తెలంగాణ సాహిత్యంలో కనిపించే జీవన విలువలు గొప్పవన్నారు. రాష్ట్ర సాధన కోసం కలం చేత బట్టి తమ సాహిత్యం ద్వారా ఇక్కడి కవులు ఉద్యమం చేశారని గుర్తు చేశారు. ఈ ఉద్యమంలో తెలంగాణ రచయితల సంఘం పాత్ర ఎంతో ఉందన్నారు. 'సాక్షి' ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి లాంటి సంపాదకులు తెలంగాణ ఉద్యమానికి ఒక దశ– దిశ చూపించారని కొనియాడారు. కవులు తమ సాహిత్యాన్ని కేవలం సామాజిక మాధ్యమాలకే పరిమితం చేయకుండా తమ కవితలను హృదయాలతో వ్యక్తపరచాలని సిధారెడ్డి సూచించారు. వారు సాహిత్యానికి మరింత సాన పెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం గంభీరావు పేట యాదగిరి రచించిన 'గల్మ' కవితా సంపుటిని నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. బైసదేవదాసు సంపాదకత్వం వహించిన 'నీళ్లగోస' కవితా సంపుటిని కె.రామచంద్రమూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.శంకర్ తదితరులు పాల్గొన్నారు. రెండో సమావేశంలో 'తెలంగాణ ఉద్యమాలు– సాహిత్య సంస్థలు' అనే అంశంపై ఆత్మీయ అతిథిగా తెలంగా ణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.చెన్నయ్య, డాక్టర్ జి.బాలశ్రీనివాసమూర్తిలు హాజరై ప్రసంగించారు.కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విభాగాధిపతి డాక్టర్ బన్న ఐలయ్య దీనికి సభాధ్యక్షునిగా వ్యవహరించారు. మూడో సెషన్‌లో 'సామాజిక జీవితం– సాహిత్యం' అనే అంశంపై తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, డాక్టర్ కాశీంలు ప్రసంగించారు. అనంతరం పది విభాగాలుగా తెలంగాణ కవులతో కవి సమ్మేళనం జరిగింది.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి, రామచంద్రమూర్తి తదితరులు

6న శంషాబాద్‌కు అమిత్ షా

- బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించనున్న కేంద్ర హోంమంత్రి
- 12 లక్షల మంది కొత్త సభ్యులను చేర్చడమే లక్ష్యం: లక్ష్మణ్

ఢిల్లీలో జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో అమిత్‌షా, జేపీ నడ్డా, లక్ష్మణ్, మురళీధర్‌రావు తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈనెల 6న తెలంగాణ పర్యటనకు రానున్నారు. శంషాబాద్‌లోని కేఎల్‌సీసీ ఫంక్షన్ హాల్‌లో జరిగే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో జరిగిన రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అమిత్ షా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరరావు, రాష్ట్ర ఇన్‌చార్జ్ కృష్ణదాస్, ఎమ్మెల్యే రాజాసింగ్, సీనియర్ నేతలు బండారు దత్తాత్రేయ, ఇంద్రసేనారెడ్డి, పేరాల శేఖర్, రామచంద్రరావు, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు అంశాలపై ప్రధానంగా చర్చించారు. దేశవ్యాప్తంగా ఈనెల 6 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో వారణాసిలో ప్రధాని మోదీ, తెలంగాణలో అమిత్ షా పాల్గొనాలని నిర్ణయించారు.

దాడులను రాజకీయంగా ఎదుర్కొంటాం: లక్ష్మణ్

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అనూహ్యంగా పుంజుకోవడాన్ని జీర్ణించుకోలేక టీఆర్ఎస్ భౌతిక దాడులకు పాల్పడుతోందని లక్ష్మణ్ విమర్శించారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, టీఆర్ఎస్ చేస్తున్న హత్యారాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కొంటామని ఆయన అన్నారు. తెలంగాణపై పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగానే అమిత్ షా రాష్ట్రానికి రానున్నారని, అగస్టు నుంచి నెలకు ఇద్దరు చొప్పున కేంద్ర మంత్రులు తెలంగాణ పర్యటనకు వస్తారని అన్నారు. తెలంగాణలో కొత్తగా 12 లక్షల మంది సభ్యులను పార్టీలో చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సభ్యత్వ నమోదు, మున్సిపల్ ఎన్నికల్లో సత్తాచాటడం, హుజూర్‌నగర్ ఉప ఎన్నికలపై ప్రధానంగా దృష్టి సారించామని, ఉపఎన్నికకు బీజేపీ ఇన్‌చార్జ్‌గా పేరాల శేఖర్‌ను నియమించినట్టు ఆయన తెలిపారు. ఇక ఆదిలాబాద్ జిల్లాలో మహిళా అధికారిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డ టీఆర్ఎస్ నేతలపై సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలని, లే దంటే ప్రభుత్వ ఉద్యోగులతో కలసి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పంట కొనుగోళ్లకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

- సిద్ధం చేస్తున్న మార్కెటింగ్ శాఖ
- రైతుల వివరాలన్నీ నిక్షిప్తం
- మద్దతు ధర అందేలా ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: పంట ఉత్పత్తుల వారీగా కొనుగోళ్లకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను మార్కెటింగ్ శాఖ సిద్ధం చేస్తోంది. నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సాయంతో ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. రైతుల వివరాలన్నీ ఇందులో పొందుపర్చడంతో పాటు, ఉత్పత్తుల కొనుగోళ్లలో మద్దతు ధర అందించేలా దీనిని తయారు చేస్తున్నారు. ఇందుకోసం ఆధార్ వివరాలను ఆధారం చేసుకోనున్నారు. అలాగే కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాకు నగదు బదిలీ జరిగేలా చర్యలు తీసుకోనున్నారు. ఏ పంట ఎన్ని ఎకరాల్లో, ఎక్కడి రైతులు పండించారు, మద్దతు ధర ఎంత అనే వివరాలతో సాఫ్ట్‌వేర్ పనిచేస్తుంది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ ఎక్కువగా పంట ఉత్పత్తులను ఎంఎస్‌పీకి కొనుగోలు చేస్తోంది. దీంతో ముందుగా మార్క్‌ఫెడ్‌కు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ తయారు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఖరీఫ్ నుంచి అన్ని వ్యవసాయోత్పత్తులను రైతుల వద్ద నుంచి ఎంఎస్‌పీకి పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పలు ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల అధికారులకు వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లలో భాగస్వామ్యం కోసం ప్రత్యేక మార్గదర్శకాలను కూడా రూపొందిస్తున్నారు.

బహిరంగ మార్కెట్లోనూ మంచి ధర...

మద్దతు ధరకు మార్కెటింగ్ శాఖ ద్వారానే కొనుగోళ్లు జరపడం ద్వారా బహిరంగ మార్కెట్‌లోనూ కచ్చితంగా అదే ధర లభిస్తుంది. దీంతో రైతులు ఏ పంట ఉత్పత్తి అమ్ముకున్నా దళారులు, వ్యాపారుల దోపిడీ లేకుండా ఉంటుందని సీఎం ఆలోచనగా ఉంది. కేవలం కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిన పంటలకే కాకుండా, రాష్ట్రంలోనూ ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పెద్ద మొత్తంలో పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వమే మార్కెటింగ్ శాఖకు హామీగా ఉండనుంది. ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకుని ఎప్పటికప్పుడు రైతులకు చెల్లింపులు చేసే విధంగా వ్యవస్థను రూపొందించనున్నారు. పరిమితుల మేర కాకుండా పండిన ఉత్పత్తి మొత్తం మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండేలా బలోపేతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో బహిరంగ మార్కెట్ కూడా అదుపులో ఉంటుంది. మన దగ్గర పండుతున్న ఉత్పత్తులకు ఏయే రాష్ట్రాలలో, దేశాలలో డిమాండ్ ఉందనే దానిపై ఒక మానిటరింగ్ టీమ్ ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు వారితో ఒప్పందాలు కుదుర్చుకుంటూ ప్రభుత్వమే మార్కెటింగ్ శాఖ తరపున ఎగుమతులు చేయనుంది. దీంతో రైతులకు మద్దతు ధర లభించడంతో పాటు ఆ ఉత్పత్తులను కొనుగోలు చేసినందుకు మార్కెటింగ్ శాఖకు కూడా ఎటువంటి నష్టాలు ఉండవు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడుతున్నందున నాణ్యమైన ఆహార ఉత్పత్తులను రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ బ్రాండ్‌తో అందించడం ద్వారా అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించవచ్చుననేది ప్రభుత్వ వ్యూహంగా ఉంది.

14 తర్వాత ఎప్పుడైనా రెడీ!

▶ మొదటి పేజీ తరువాయి

మూడో వారం ఆఖరు కల్లా మునిసిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలుస్తోంది.

సూత్రప్రాయంగా మునిసిపల్ అధికారులు ఖరారు చేసిన షెడ్యూల్ ఇదే:

1. వార్డుల పునర్విభజన:

- జూన్30 నుంచి జూలై1వరకు నిర్దేశిత జనాభా ఆధారంగా వార్డుల పునర్విభజన ప్రతిపాదనలు తయారీ
- జూలై2 నుంచి 5వ తేదీ వరకు ముసాయిదా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ
- జూలై ఆరో తేదీన అభ్యంతరాల పరిష్కారం, 7న ఎన్నికల సంఘం ద్వారా వార్డుల తుది జాబితా ప్రకటన

2. వార్డుల వారీ ఓటరు జాబితాల తయారీ:

- జూలై 8న వార్డుల వారీ ఓటరు జాబితాల తయారీ, 9,10 తేదీల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు గడువు.
- 11వ తేదీన అభ్యంతరాల పరిష్కారం అనంతరం తుది జాబితా తయారీ, 12న తుది జాబితా ప్రచురణ.

3. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు:

- జూలై 8వ తేదీన పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా తయారీ, 9,10 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, రాజకీయ పార్టీలతో సమావేశాలు.
- 11న ముసాయిదా జాబితాలు కలెక్టర్లకు అందజేత, 12న కలెక్టర్ల అనుమతితో తుది జాబితా ప్రచురణ.

4. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల జాబితా తయారీ:

- జూలై 8న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల ముసాయిదా జాబితాల తయారీ, 9,10 తేదీల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ.
- 11న క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, 12న తుది ఓటర్ల జాబితా ప్రచురణ.

(ఈ ప్రక్రియలన్నీ పూర్తయిన తర్వాత రెండ్రోజుల్లో (14వ తేదీ కల్లా) రాష్ట్రంలోని 138 మునిసిపాలిటీలు/కార్పొరేషన్లలోని వార్డు మెంబర్లు, మునిసిపల్ చైర్పర్సన్లు, మేయర్ల రిజర్వేషన్లు ఖరారు చేస్తారు. దీంతో పురపాలక శాఖ పని పూర్తవుతుంది. ఎప్పుడైనా ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చే వెసులుబాటు కలుగుతుంది)

దుమ్ముగూడెం.. పోలవరం టు సాగర్, శ్రీశైలం

- నీటిని తరలించే అంశాలపై అధ్యయనం
- నిర్ణయించిన తెలంగాణ ఇంజనీర్లు
- ఈఎన్‌సీ నేతృత్వంలో పది మంది ఇంజనీర్లతో కమిటీ

సాక్షి, హైదరాబాద్ : గోదావరి నదీ జలాలను కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు తరలించే ప్రతిపాదనల తయారీ ప్రక్రియకు తెలంగాణ నీటి పారుదలశాఖ ఇంజనీర్లు పదునుపెట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల సూచనల మేరకు ఏయే ప్రాంతాల నుంచి గోదావరి నీటిని కృష్ణాలోని నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు తరలించాలన్న అంశాలపై ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దుమ్ముగూడెం, పోలవరంల నుంచి నీటిని ఈ రెండు ప్రాజెక్టులకు తరలించే అంశాలపై అధ్యయనం చేయాలని రాష్ట్ర ఇంజనీర్లు నిర్ణయించినట్లుగా తెలిసింది.

తెరపైకి అయిదురకాల ప్రతిపాదనలు..

ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగానే ఐదు రకాల ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇందులో దుమ్ముగూడెం నుంచి సాగర్‌కు నీటిని తరలించడం ఒకటి కాగా, మరొకటి పోలవరం నుంచి పులిచింతల, సాగర్‌ల మీదుగా శ్రీశైలానికి తరలించడం ప్రధానంగా ఉన్నాయి. ఇందులో ఇప్పటికే దుమ్ముగూడెం నుంచి సాగర్‌కు తరలించేలా ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రతిపాదనలు చేశారు. దుమ్ముగూడెం ప్రాంతం నుంచి 165 టీఎంసీల నీటిని తీసుకుంటూ ఖమ్మం జిల్లా బయ్యారం నుంచి నాగార్జునసాగర్ దిగువన నల్లగొండ జిల్లాలోని హాలియా సమీపంలో ఉన్న టెయిల్‌పాండ్ ప్రాజెక్టులోకి నీటిని తరలించేలా ప్రతిపాదన ఉంది. దీని కోసం 244 కిలోమీటర్ల పొడవున లింక్‌కెనాల్ తవ్వడంతో పాటు, 6 లిఫ్టు వ్యవస్థల నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ నీటిని టెయిల్‌పాండ్‌కు తరలించాక సాగర్ డ్యామ్‌లోని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ స్టేషన్‌లోని 7 రివర్సబుల్ టర్బైన్‌ల ద్వారా నీటిని సాగర్ రిజర్వాయర్‌లోకి తరలించవచ్చని అప్పట్లో నిర్ధారించారు. లింక్‌కెనాల్ తవ్వకంతో ఖమ్మం, నల్లగొండ

మహోద్యమంగా జలసంరక్షణ

దేశప్రజలకు పిలుపునిచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ

- వర్షపు నీటిలో 8 శాతమే సద్వినియోగమవుతోందని ఆవేదన
- ప్రజలంతా నీటి పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి
- రెండో విడత 'మన్‌కీ బాత్'లో మాట్లాడిన మోదీ

న్యూఢిల్లీ: దేశంలో జల సంరక్షణను ఓ మహోద్యమంగా చేపట్టాల్సిన అవసరముందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజలంతా వర్షపునీటిని సంరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా పలు నదులు, జలాశయాలు ఎండిపోయి ప్రజలు నీటికి కటకటలాడుతున్న నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆదివారం నిర్వహించిన తొలి మాసాంతపు మన్‌కీ బాత్(మనసులో మాట) కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. నీటి పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ఒకే విధానం పాటించడం సరైన పద్ధతి కాదని మోదీ అభిప్రాయపడ్డారు. ఒక్కో ప్రాంతంలో అక్కడి స్థానిక పరిస్థితులకు తగ్గట్లు ప్రతీ నీటిచుక్కను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే నీటి వనరుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఎన్జీవోలు, ఇతర సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించాలని, జలసంరక్షణ పద్ధతులను అందరికీ వివరించాలని కోరారు. ప్రస్తుతం భారత్‌లో కురుస్తున్న వర్షంలో కేవలం 8 శాతం నీటిని సద్వినియోగం చేసుకోగలుగుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు జలశక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశామన్నారు. గ్రామసభలను ఏర్పాటుచేసి ప్రజలంతా జల సంరక్షణ విషయంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. జల సంరక్షణ చర్యల్ని ప్రజలంతా 'జన్‌శక్తి4జల్‌శక్తి' అనే హ్యాష్‌ట్యాగ్ ద్వారా పంచుకోవాలని సూచించారు. 2014 అక్టోబర్ 3 నుంచి 2019, ఫిబ్రవరి 24 వరకు 53 సార్లు 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించిన మోదీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిలిపివేశారు.

కేదార్‌నాథ్‌ను అందుకే దర్శించుకున్నా..

సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి తనను గెలిపించిన ప్రజలకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా ధన్యవాదాలు చెప్పారు. 'ఈ ఏడాది ఫిబ్రవరి 24న మన్‌కీబాత్ కార్యక్రమంలో ఓ 3-4 నెలల తర్వాత మళ్లీ కలుసుకుందామని చెప్పాను. ఈ నమ్మకం మోదీది కాదు. ఇది మీరునాపై ఉంచిన నమ్మకం. ఈ నమ్మకానికి మీరే మూలకారణం. నన్ను మళ్లీ గెలిపించి ఇక్కడకు తీసుకొచ్చారు. మరోసారి మీ అందరితో మాట్లాడే అవకాశాన్ని కల్పించారు' అని మోదీ తెలిపారు. 'మన్‌కీ బాత్' ఆగిపోయిన సమయంలో తనకు ప్రజలతో సంభాషించే అవకాశం లేకుండాపోయిందనీ, అసౌకర్యంగా, ఒంటరిగా అనిపించిందని వెల్లడించారు. 'ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నప్పటికీ కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను దర్శించుకున్నాను. ఎన్నికల మధ్యలో ఎందుకు వెళ్లారని నన్ను చాలామంది అడిగారు. రాజకీయ ప్రచారం కోసమే వెళ్లానని కొందరు అనుకున్నారు. కానీ నా అంతరాత్మను కలుసుకోవడానికి, నన్ను నేను సమీక్షించుకోవడానికే కేదార్‌నాథ్, బద్రీనాథ్ వెళ్లాను. అక్కడ ధ్యానం చేయడం మన్‌కీబాత్ కార్యక్రమం లేనిలోటును పూడ్చింది' అన్నారు.

మోదీ నోట 'ఊటకుంట'

అడ్డాకుల (దేవరకద్ర): 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మహబూబ్‌నగర్ జిల్లాలోని తిమ్మాయిపల్లితండా శివారులో నిర్మించిన ఊటకుంటను ప్రస్తావించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన ఈ ఊటకుంట సత్ఫలితాలు ఇస్తోందని వ్యాఖ్యానించారు. వర్షాలు కురిసినప్పుడు నీరు వృథాగా వెళ్లకుండా ఉండేందుకుగాను 4-5 ఏళ్ల క్రితం ఈ కుంటను నిర్మించారు. దీనికి అనుబంధంగా మరో రెండింటిని ఏర్పాటుచేశారు. దీనివల్ల వర్షం కురిసినప్పుడు గుట్టల పైనుంచి వచ్చే వర్షపునీరు కుంటలోనే నిలిచి పరిసరాల్లో ఉండే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతోంది. పెద్దపెద్ద చెరువుల వల్ల కలిగే ప్రయోజనాలు ఉపాధిహామీలో చిన్న కుంటలతోనూ లభిస్తున్నాయని చెబుతూ మోదీ ఈ ఊటకుంటను ప్రస్తావించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రస్తావించిన ఊటకుంట ఇదే

ప్రజాస్వామ్య గొప్పతనం తెలియట్లేదు..

1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'రోజూ సమయానికి భోజనం చేసే వ్యక్తికి ఆకలి కేకలు ఎలా ఉంటాయో తెలియదు. అలాగే ప్రస్తుతం ప్రజాస్వామ్య హక్కులను హాయిగా అనుభవిస్తున్న ప్రజలకు వాటి విలువ పోగొట్టుకుంటే తప్ప బోధపడదు. ఏదైనా మన దగ్గరున్నప్పుడు దాని విలువను అర్థం చేసుకోలేం. ఎమర్జెన్సీ సమయంలో ప్రతీపౌరుడికి తమకు సంబంధించినదేమో లాక్కున్న భావన కలిగింది. దీంతో 1977లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు కేవలం ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటేశారు. అత్యంత గొప్పదైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఉండటం నిజంగా మన అదృష్టమే. కానీ దాన్ని మనం తగినరీతిలో గౌరవించడం లేదు' అని తెలిపారు. ఇటీవలి ఎన్నికల్లో ఏకంగా 61 కోట్ల మంది ప్రజలు ఓటుహక్కు వినియోగించుకున్నారని ప్రధాని వెల్లడించారు. ఈ సంఖ్య అమెరికా జనాభాకు రెట్టింపని తెలిపారు. భారత్‌లోని మొత్తం ఓటర్ల సంఖ్య యూరప్ ఖండం జనాభా కంటే ఎక్కువన్నారు. ఈ ఎన్నికల్లో పురుషులతో సమానంగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారనీ, ప్రస్తుతం పార్లమెంటులో 78 మంది మహిళా ఎంపీలు ఉన్నారని చెప్పారు. ప్రజలంతా గూగుల్ ద్వారా ఎక్కువ పుస్తకాలు చదవాలన్నారు. ఈ సందర్భంగా గూగుల్‌ను 'గూగుల్ గురు'గా ప్రధాని అభివర్ణించారు.

పాక్ భారీకాయుడికి సర్జరీ

లాహోర్: పాకిస్తాన్‌లోకెల్లా అత్యధిక బరువు కలిగిన వ్యక్తికి, బరువు తగ్గేందుకు చేసిన లైపోసక్షన్ సర్జరీ విజయవంతమైంది. దాదాపు 330 కేజీలకు పైగా బరువుతో కదల్లేని పరిస్థితిలో ఉన్న నూరుల్ హసన్ సోషల్‌మీడియా ద్వారా తన గోడును వెల్లబోసుకున్నాడు. దాన్నిగమనించిన పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ ఖమార్ జావెద్ సర్జరీకి ఏర్పాట్లు చేశారు. రెస్క్యూ 1122 దళ సభ్యులు అతడి ఇంటి గోడను కూల్చి మరీ సైనిక వాహనం ద్వారా మిలిటరీ ఆస్పత్రికి తరలించారు. గంటా నలభై నిమిషాలపాటు నిర్వహించిన ఆపరేషన్ కష్టతరమైనదే అయినప్పటికీ, విజయవంతంగా పూర్తయిందని డాక్టర్ మాజ్ అల్ హసన్ తెలిపారు. రానున్న నాలుగు రోజుల పాటు నూరుల్ ఐసీయూలోనే ఉంటాడని అనంతరం ఆరునెలల్లో 200 కేజీల కంటే తక్కువ బరువుకు చేరుకుంటాడని అన్నారు.

బ్యాట్‌తో దాడి కేసులో ఎమ్మెల్యేకు బెయిల్

ఇండోర్: ప్రభుత్వోద్యోగిపై బ్యాటుతో దాడి చేసి జైలుకెళ్లిన బీజేపీ ఎమ్మెల్యే ఆకాశ్ విజయ్‌వర్గియాకు బెయిల్ లభించింది. శనివారం రాత్రి 11 గంటలకు భోపాల్ కోర్టు నుంచి బెయిల్ ఆర్డర్ వచ్చిందని జిల్లా జైల్ సూపరింటెండెంట్ అదితి చతుర్వేది అన్నారు. రూ.50వేల పూచీకత్తుతో ఆయన్ను ఆదివారం విడుదల చేశామని తెలిపారు. ఆకాశ్‌ను జూలై 11 వరకు బెయిల్ ఇవ్వకుండా, జైల్లో ఉంచాల్సిందిగా మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే అతడు ప్రజాప్రతినిధి కావడంతో భోపాల్ ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. జైల్లో గడపడం బాగుందని, ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తానని బయటకు వచ్చిన అనంతరం విజయ్‌వర్గియా అన్నారు. తమ నాయకుడు బయటకు రావడంతో బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

మోదీతో ట్రంప్ చర్చలు ఫలప్రదం: ఇవాంక

ఒసాకా: ప్రధాని నరేంద్ర మోదీతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫలప్రదమైన చర్చలు జరిపారని ట్రంప్ కూతురు, ఆయనకు ఉన్నత సలహాదారు ఇవాంక చెప్పారు. ఇరాన్‌పై ఆంక్షలు, 5జీ, దేశభద్రత తదితర అంశాలపై మోదీ-ట్రంప్‌లు చర్చించారని తెలిపిన ఇవాంక, ఇండియా తమకు కీలక వాణిజ్య, భద్రతా భాగస్వామి, మంచి మిత్రదేశమని పేర్కొన్నారు. జీ-20 దేశాల సదస్సుకు జపాన్‌లోని ఒసాకా వెళ్లినప్పుడు గత శుక్రవారం అక్కడ మోదీ, ట్రంప్ భేటీ అవ్వడం తెలిసిందే. జీ-20 సదస్సు శనివారం ముగిసింది. ఈ సదస్సుపై ఇవాంక మాట్లాడిన ఓ వీడియోను అమెరికా శ్వేతసౌధం శనివారమే ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. మోదీ, ట్రంప్‌ల భేటీ గురించి కూడా ఇవాంక ఆ వీడియోలో ప్రస్తావించారు.

కమలా హ్యారిస్‌పై జాతి విద్వేష వ్యాఖ్యలు

వాషింగ్టన్: అమెరికాలో భారత సంతతికి చెందిన తొలి సెనెటర్, డెమోక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడుతున్న కమలా హ్యారిస్‌పై ఆన్‌లైన్‌లో కొందరు జాతి విద్వేష వ్యాఖ్యలు చేశారు. డెమోక్రటిక్ పార్టీలో అగ్రనాయకురాలైన కమల అమెరికాలోనే జన్మించారు. ఆమె తల్లి భారతీయురాలు కాగా, తండ్రి జమైకాకు చెందిన నల్లజాతీయుడు. అయితే ఆమె అమెరికన్ నల్లజాతీయురాలు కాదంటూ ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో వ్యాఖ్యలు చేశారు. ఆఫ్రికన్-అమెరికన్ అయిన అలీ అక్బర్ అనే వ్యక్తి గత గురువారం ఓ ట్వీట్ చేస్తూ 'కమలా హ్యారిస్ అమెరికా నల్లజాతీయురాలు కాదు. ఆమె సగం భారతీయురాలు, సగం జమైకా వ్యక్తి' అని అన్నారు. ఆ ట్వీట్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొడుకు జూనియర్ ట్రంప్ కూడా రీట్వీట్ చేశారు. తనపై వచ్చిన వ్యాఖ్యలను కమల ఖండించారు.

మంగళూరులో మట్టిలో దిగబడిన విమానం

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలోని మంగళూరు విమానాశ్రయంలో ఆదివారం పెద్ద ప్రమాదం తప్పింది. దుబాయి నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సాయంత్రం విమానాశ్రయంలో రన్‌వే పై దిగాక, ట్యాక్సీ వేపై నుంచి జారి మట్టిలో దిగబడింది. ట్యాక్సీ వే తడిగా ఉండటం, గాలికితోడు బ్రేకులు సరిగ్గా వేయకపోవడంతో ఇలా జరిగిందని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులకు ఎవ్వరికీ ఏ ప్రమాదమూ జరగలేదని చెప్పింది. ఈ ఘటన కారణంగా విమానాశ్రయంలో కార్యకలాపాలకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదని పేర్కొంది.

అఫ్గాన్‌లో తాలిబాన్ల దాడి.. 19 మంది మృతి

కాందహార్: అఫ్గానిస్తాన్‌లోని మరుఫ్ జిల్లా కేంద్రంలో తాలిబాన్ ఉగ్రవాదులు బాంబులతో దాడి చేసి 19 మందిని హతమార్చారు. వారిలో 11 మంది పోలీసు సిబ్బంది, 8 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనలో మరో 27 మంది పోలీసులు గాయపడ్డారు. శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఆయుధాలతో నిండిన నాలుగు వాహనాలతో ఉగ్రవాదులు ఓ ప్రభుత్వ భవనం ప్రహరీ గోడను ఢీకొట్టారని పోలీసులు చెప్పారు.

పెళ్లిళ్ల ఖర్చు రూ. 200 కోట్లు చెత్తకు రూ. 2.5 లక్షల ఫైన్

డెహ్రాడూన్: దక్షిణాఫ్రికాకు చెందిన గుప్తా కుటుంబంపై జోషిమత్ మున్సిపాలిటీ రూ. 2.5 లక్షల జరిమానా విధించింది. పెళ్లి తర్వాత మిగిలిన చెత్తను ఖాళీగా ఉన్న చోట పడేయడంతో జరిమానా విధించినట్లు జోషిమత్ మున్సిపాలిటీ అధికారి సత్యపాల్ నౌతియాల్ తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ఔలి స్కి రిసార్ట్‌లో జూన్ 20, 22న జరిగిన వారి ఇద్దరి కుమారుల పెళ్లిళ్లలో 321 క్వింటాళ్ల చెత్త పోగయింది. ఆ చెత్తను అలాగే వదిలేసినందుకు రూ. 1.5 లక్షలు, ఖాళీ స్థలంలో వేసినందుకు మరో లక్ష జరిమానా విధించింది. ఈ పెళ్లిళ్లకు దాదాపు రూ. 200 కోట్లు ఖర్చు చేశారు. పెళ్లిళ్ల అనంతరం చెత్తను తొలగించేందుకుగాను ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి రూ. 8.14 లక్షల బిల్లును పంపినట్లు అధికారులు తెలిపారు.

ఉత్తర కొరియాలో ట్రంప్

- నిస్సైనిక మండలంలో అధ్యక్షుడు కిమ్ ఉన్‌తో భేటీ
- 'అణు' చర్చల ప్రారంభానికి అంగీకారం
- దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌ను కలిసిన ట్రంప్
- ట్రంప్ పర్యటనపై దక్షిణ కొరియాలో మిశ్రమ స్పందన

కొరియాల సరిహద్దులోని పన్‌మున్‌జోం గ్రామంలో సమావేశమైన కిమ్, ట్రంప్

పన్‌మున్‌జొమ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ఉత్తర కొరియా వచ్చారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జంగ్ ఉన్‌తో సమావేశమయ్యారు. ఉభయ కొరియాల సరిహద్దుల మధ్య ఉన్న నిస్సైనిక మండలం(డీఎంజెడ్)లోని పన్‌మున్‌జొమ్ గ్రామంలో ఇరువురు నేతలు కలుసుకున్నారు. పదవిలో ఉన్న అమెరికా అధ్యక్షుడు ఉత్తర కొరియా రావడం ఇదే మొదటిసారి కావడంతో ట్రంప్ పర్యటన చరిత్రాత్మకమయింది. ఉత్తర కొరియాలో అడుగుపెట్టిన ట్రంప్ ఆ దేశాధ్యక్షుడు కిమ్‌తో కలిసి నిస్సైనిక మండలంలోకి వచ్చారు. అక్కడ కాసేపు మాట్లాడుకున్నారు. ఉత్తర కొరియా అణ్వాయుధ కార్యక్రమంపై చర్చలు మొదలు పెట్టేందుకు ఇద్దరు నేతలు అంగీకరించారు. కాగా ట్రంప్ ఉత్తర కొరియా పర్యటనపై దక్షిణ కొరియాలో భిన్న స్పందనలు వ్యక్తమయ్యాయి. కొందరు దీనిపై ఆశాభావం వ్యక్తం చేయగా, మరికొందరు దీనిని వ్యర్థ ప్రయత్నంగా పేర్కొన్నారు.

కిమ్‌ను అమెరికాకు ఆహ్వానించినట్టు ట్రంప్ తెలిపారు. ఆయన రావాలనుకుంటే ఏప్పుడయినా అధ్యక్ష భవనానికి రావచ్చని కిమ్‌కు చెప్పినట్టు ట్రంప్ వెల్లడించారు. ఉత్తర కొరియా రమ్మనడం నాకు గౌరవకారణం. అలాగే, నేను ఉత్తర కొరియాలో అడుగుపెట్టడం నాకు గర్వకారణం'అని ట్రంప్ ఉత్తర కొరియా అధినేతతో అన్నారు. చర్చలకు కూర్చుంటూ ఇద్దరు నేతలూ కరచాలనం చేసుకున్నారు. ఉత్తర, దక్షిణ కొరియాల విభజనకు గుర్తుగా నిలిచిన ఈ ప్రాంతంలో మేం చేసుకున్న కరచాలనం గతాన్ని మరిచిపోవాలన్న మా ఆకాంక్షకు నిదర్శనం' అని కిమ్ అన్నారు.

ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా ఈ ఇద్దరు నేతలు కలుసుకోవడం జరిగింది. ట్రంప్ శనివారం ట్విట్టర్‌లో ఉత్తర కొరియా అధినేత కిమ్‌కు ఆహ్వానం పంపారు. ఆదివారం వారిద్దరూ సమావేశమయ్యారు.

ఉత్తర కొరియా అణ్వాయుధ కార్యక్రమం అంతర్జాతీయంగా ఆందోళనకు దారి తీస్తున్న నేపథ్యంలో అణ్వాయుధాలకు స్వస్తి చెప్పేలా ఉత్తర కొరియాను ఒప్పించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా గత ఏడాది సింగపూర్‌లో రెండు దేశాల అధినేతలు సమావేశమయ్యారు. అది విఫలమయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రంప్, కిమ్‌లు వియత్నాంలో మళ్లీ చర్చలు జరిపారు. ఆ చర్చలు కూడా ఫలప్రదం కాలేదు. 2017లో ఉత్తర కొరియా ఆరు అణు పరీక్షలను నిర్వహించింది. అమెరికాను చేరుకోగల క్షిపణులను పరీక్షించింది. గత ఏడాది ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జయేల మధ్య నిస్సైనిక మండలంలో మొదటి సారి సమావేశం జరిగింది. ఉత్తర కొరియా, అమెరికాల మధ్య సయోధ్య కుదర్చడానికి మూన్ ప్రయత్నించారు.దానికి కొనసాగింపుగా ట్రంప్ ఇప్పుడు ఉత్తర కొరియాలో అడుగు పెట్టారు. ట్రంప్ కిమ్‌తో పాటు దక్షిణ కొరియా అధ్యక్షుడిని కూడా కలుసుకున్నారు.

అణు చర్చలకు మార్గం సుగమం

ట్రంప్ ఉత్తర కొరియా పర్యటనపై దక్షిణ కొరియాలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఈ పర్యటన వల్ల ఇరు దేశాల మధ్య స్తంభించిపోయిన అణు చర్చలు పునః ప్రారంభమయ్యే అవకాశం ఉందని కొందరంటోంటే, వియత్నాం చర్చల్లాగే ఈ పర్యటన వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని మరి కొందరు పెదవి విరుస్తున్నారు. త్వరలో ఎన్నికలు ఎదుర్కొనున్న ట్రంప్, మూన్‌లు ఇద్దరు రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ పని చేశారని మరి కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

చైనాలో 'స్టార్‌ఫిష్' విమానాశ్రయం

డాక్సింగ్‌లోని స్టార్‌ఫిష్ ఆకారంలో ఉన్న విమానాశ్రయం

రూ. 1.20 లక్షల కోట్లతో నిర్మాణం

బీజింగ్: భారీ స్టార్‌ఫిష్ ఆకారంలో చైనా ప్రభుత్వం నిర్మిస్తున్న బీజింగ్‌లోని డాక్సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడి 70 ఏళ్ల వేడుకల సందర్భంగా ప్రారంభించనున్నారు. పది ఫుట్‌బాల్ మైదానాలకు సమానమైన స్థలంలో కళ్లు చెదిరేలా రూ. 1.20 లక్షల కోట్ల (17.5 బిలియన్ డాలర్ల)తో ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్మిస్తున్నారు. 1949 అక్టోబర్ 1న మావో జెడాంగ్ పీపుల్స్ రిపబ్లిక్‌ను స్థాపించారు. దాన్ని పురస్కరించుకొని సెప్టెంబరు 30న ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. 2025 కల్లా నాలుగు రన్‌వేలతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ విమానాశ్రయం ఏడాదికి 7.2 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేరవేయగలదు. 2040 కల్లా మిలిటరీకి ప్రత్యేక రన్‌వే సహా మొత్తం ఎనిమిది రన్‌వేలతో సిద్ధం కానుందని అధికారులు తెలిపారు. అమెరికాలోని అట్లాంటా విమానాశ్రయం, రెండు టెర్మినల్స్‌తో కలిపి 10కోట్ల మందిని గమ్యస్థానాలకు చేరవేస్తోంది.

రూ. 2,700 కోట్ల విలువైన హెరాయిన్ పట్టివేత

అమృత్‌సర్ (పంజాబ్): పాక్ నుంచి అక్రమంగా వాణిజ్య మార్గం ద్వారా భారత్‌కు తీసుకొస్తున్న 532 కిలోల హెరాయిన్‌ను సరిహద్దులోని అట్టారి చెక్ పోస్టు వద్ద అధికారులు పట్టుకున్నారు. దీని విలువ రూ. 2,700 కోట్లు ఉంటుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ద్వారా పాకిస్తాన్ నుంచి అట్టారి చేరుకున్న ట్రక్కులోని హెరాయిన్, మరో 52 కిలోల అనుమానాస్పద డ్రగ్స్‌ను వందలాది రాతి ఉప్పు బస్తాల కింద దాచి ఉంచినట్లు అధికారులు గుర్తించారు దేశంలోనే కస్టమ్స్ విభాగానికి ఇది భారీ విజయమని వెల్లడించారు. కశ్మీర్‌కు చెందిన హెరాయిన్ స్మగ్లింగ్ సూత్రధారి తారిఖ్ అన్వర్‌ని అరెస్ట్ చేసిన అధికారులు రాతి ఉప్పును దిగుమతి చేసుకుంటున్న అమృత్‌సర్‌కు చెందిన వ్యక్తిని కూడా ప్రశ్నిస్తున్నారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉందని దీపక్‌కుమార్ వెల్లడించారు.

పట్టుబడిన డ్రగ్స్ సంచులు

అమర్‌నాథ్ యాత్రకు భారీ భద్రత

శ్రీనగర్/జమ్మూ: పవిత్ర అమర్‌నాథ్ యాత్రకు వెళ్లేందుకు ఈ ఏడాది తొలి బ్యాచ్‌గా 2,234 మంది భక్తులు ఆదివారం గట్టి భద్రత మధ్య జమ్మూకు చేరుకున్నారు. 2017లో అమర్‌నాథ్ యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసినందువల్ల ఇప్పుడు బహుళ అంచెల భద్రతను అధికారులు ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రానికి వచ్చిన 300 అదనపు కంపెనీల భద్రతా దళాలనే ఇప్పుడు అమర్‌నాథ్ యాత్రకు భద్రత కల్పించేందుకు కూడా వినియోగిస్తున్నారు. ఆధునిక సాంకేతికతను కూడా వాడుకుంటున్నారు. యాత్ర సోమవారం నుంచి మొదలుకానుంది. ఈ యాత్రకు రావడానికి దేశవ్యాప్తంగా ఒకటిన్నర లక్షల మంది భక్తులు నమోదు చేసుకున్నారు. 46 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుంది. అనంత్‌నాగ్ జిల్లాలోని 36 కిలో మీటర్ల పొడవైన పహల్గామ్ మార్గం, గండేర్‌బల్ జిల్లాలోని 14 కిలో మీటర్ల పొడవైన బల్తాల్ మార్గాల్లో యాత్ర సాగుతుంది. 93 వాహనాలతో కూడిన తొలి వాహన శ్రేణిని గవర్నర్ సలహాదారు కేకే శర్మ ఆదివారం జమ్మూలోని భాగవతి నగర్ బేస్ క్యాంపు వద్ద జెండా ఊపి ప్రారంభించారు.

నాన్ సబ్సిడీ సిలిండర్‌పై రూ.100 తగ్గింపు

న్యూఢిల్లీ: సబ్సిడీయేతర ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరను రూ. 100 తగ్గిస్తున్నట్లు ఆదివారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపింది. అంతర్జాతీయ రేట్లు తగ్గినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో రూ. 737.50గా ఉన్న సిలిండర్ ఇప్పుడు రూ. 637కు తగ్గనుంది. ఢిల్లీలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర రూ. 494.35గా ఉంది. ఇలా ఉండగా, జూన్ 22న పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన బీజేపీ మళ్లీ ప్రజలను మోసం చేయడం ప్రారంభించిందని కాంగ్రెస్ ఆరోపించింది.

జీఎస్టీకి నేటితో రెండేళ్లు

న్యూఢిల్లీ: దేశంలో వస్తు సేవల పన్ను(జీఎస్టీ) విధానం అమలుకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉత్సవాలు జరపనుంది. దీంతోపాటు రిటర్నుల దాఖలుకు కొత్త పద్ధతిని, సింగిల్ రీఫండ్ వ్యవస్థ వంటి అదనపు సంస్కరణలు చేపట్టనుంది. జీఎస్టీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ నేతృత్వంలో నేడు జరిగే కార్యక్రమంలో వివిధ శాఖలఉన్నతాధికారులు పాల్గొననున్నారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. చిన్న పన్ను చెల్లింపుదారుల కోసం సహజ్ సులభ్ రిటర్ను దాఖలు విధానం అమలు కానుంది. జూలై ఒకటో తేదీ నుంచి ప్రయోగాత్మకంగా చేపట్టనున్న ఈ విధానం అక్టోబర్ ఒకటి నుంచి పూర్తి స్థాయిలో అమలు కానుందని పేర్కొంది. వస్తు సరఫరాదారులకు ప్రవేశ పరిమితిని రూ.40 లక్షల వరకు ఇచ్చే వెసులుబాటును రాష్ట్రాలకు కల్పిస్తున్నట్లు తెలిపింది. వార్షిక టర్నోవర్ రూ.50 లక్షలున్న స్మాల్ సర్వీస్ ప్రొవైడర్లకు 6 శాతం పన్ను రేటుతో కాంపొజిషన్ స్కీం ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొంది. 2017 జూలై ఒకటో తేదీ నుంచి అమలవుతున్న జీఎస్టీ విధానంలో కేంద్రం గత రెండేళ్లలో పలు మార్పులు చేర్పులు చేపట్టింది.

తోడి పారేస్తున్నాం..!

చెన్నై దుస్థితి మరిన్ని నగరాలకు..

కావాల్సినంత వర్షపాతం నమోదైనా నీటికి వెతలు

నైరుతీ రుతుపవనాలు ఆశించిన వర్షాన్ని ఇవ్వకపోవడంతో దేశంలో నీటి సంక్షోభం నెలకొంది. ఇప్పటికే చెన్నై, బెంగళూరు నగరాలు నీటి కొరతతో అల్లాడుతున్నాయనీ, 2020 నాటికి హైదరాబాద్, విజయవాడ సహా 21 నగరాల్లో తీవ్ర నీటి కొరత ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చెన్నైలో ప్రజలకు అందించే నీటిపై రేషన్ విధించగా, బెంగళూరులో నీటికొరత కారణంగా కొత్త భవన నిర్మాణాలను ఐదేళ్లు నిషేధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. కేంద్రం ఇప్పటికే జలశక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసింది. అవసరాల కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతున్నప్పటికీ నీటి కొరత ఎందుకొచ్చింది? నీటి కోసం భారీ క్యూలైన్లలో నిల్చోవాల్సిన పరిస్థితి ఎందుకు దాపురించింది.

మితిమీరిన వాడకం..

అమెరికా, చైనాలతో పోల్చుకుంటే భారత్‌లో భూగర్భ జలాలను మితిమీరి వాడేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మన అవసరాల్లో సగానికిపైగా భూగర్భ జలాలే తీరుస్తున్నాయి. ఇందులో సాగుకు 89 శాతం, గృహావసరాలకు 9 శాతం, పారిశ్రామిక అవసరాలకు 2 శాతం వాడేస్తున్నాం. అయితే జనాభా పెరుగుదల, పట్టణీకరణ కారణంగా భూగర్భ జలాలు అంతకంతకూ తగ్గిపోతున్నాయి. ప్రజలకు మంచినీటి సరఫరాలోనూ తీవ్రమైన వ్యత్యాసాలు నమోదవుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఓ వ్యక్తికి రోజుకు 150 లీటర్ల నీరు కావాల్సి ఉండగా, దేశంలో 81 శాతం గృహాలకు రోజుకు 40 లీటర్ల నీటిని మాత్రమే ప్రభుత్వం సరఫరా చేయగలుగుతోంది.

వరుణదేవుడు కరుణించినా..

దేశంలో నీటి కటకటకు ఇష్టారాజ్యంగా నీళ్లను వృథా చేయడం కూడా ఓ కారణమేనని సెంట్రల్ వాటర్ కమిషన్ చెబుతోంది. భారత్‌కు ఏటా 3,000 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరం. కానీ ఏటా 4 వేల బిలియన్ క్యూబిక్ మీటర్ల వర్షం కురుస్తోంది. వాన నీటిని నిల్వ చేసుకోలేకపోవడంతో అదంతా వృథా అవుతోంది. వర్షపు నీటి



నల్లగొండ | సోమవారం
జూలై | 1 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com

ఈవారం పుస్తకాలు

మిహయిల్ షోలహోవ్ కథలు

కూర్పు: ఎల్.పొదోల్స్కి; తెలుగు అనువాదం: వుప్పల లక్ష్మణరావు; పేజీలు: 152; వెల: 100; ప్రతులకు: నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎమ్.హెచ్.భవన్, ప్లాట్ నం.21/1, అజామాబాద్, హైదరాబాద్-20. ఫోన్: 040-27665420

కొత్త పండగ (కథలు)

రచన: ఎం.ఎస్.కె.కృష్ణజ్యోతి; పేజీలు: 136; వెల: 125; ప్రచురణ: సిరాముద్ర ప్రచురణలు; ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు. రచయిత్రి ఫోన్: 9110728070

నిఘా (నవల)

రచన: డాక్టర్ ప్రభాకర్ జైని; పేజీలు: 356; వెల: 300; ప్రచురణ: జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్; ప్రతులకు: రచయిత, ఫ్లాట్ నం. 111, సి బ్లాక్, విష్ణు రెసిడెన్సీ, గాంధీనగర్, హైదరాబాద్-80. ఫోన్: 7989825420

అప్పారాయ వంశ వాల్లభ్యము

రచన: ఎఱ్ఱోజు మాధవాచార్యులు; పేజీలు: 200; వెల: 125; ప్రచురణ: డాక్టర్ ఎం.ఆర్. అండ్ ఎం.ఎస్.అప్పారావు మెమోరియల్ ఫౌండేషన్ (హైదరాబాద్-నూజివీడు); ప్రతులకు: ఎం.ఎస్.వి.ఎం. రావు, 202, లేక్ రెసిడెన్సీ, సోమాజిగూడ, హైదరాబాద్-29. ఫోన్:9393322222

పదం పలికింది - పాట నిలిచింది

ప్రేమంటే- ఒకే తార ఉదయించే గగనం

ప్రేమంటే ఏమిటనేది ఎన్ని రకాలుగా చెప్పొచ్చు! 'బాబాయ్ అబ్బాయ్' కోసం వేటూరి ఇలా చెబుతున్నాడు. ఒకే తార ఉదయించే గగనం, ఒకే మనిషి నివసించే భువనం, ఒకే మాట వినిపించే కావ్యం, ఒకే దివ్వె వెలుగొందే కోవెల, ఒకే కెరటం ఉప్పొంగే యమున. అది జీవితంలో ఒక్కసారే, ఒక్కరివల్లే, ఒక్కరికోసమే సంభవించే అద్భుతం అంటున్నాడు. దీనికి సంగీతం చక్రవర్తి. పాడినవారు జానకి, బాలసుబ్రహ్మణ్యం. 1985లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు జంధ్యాల. అనితారెడ్డి, బాలకృష్ణ నటీనటులు.

తెలుసా నీకు తెలుసా
ప్రేమంటే- ఒకే తార ఉదయించే గగనమని
ఒకే మనిషి నివసించే భువనమని
ఒకే మాట వినిపించే కావ్యమని
ఒకే దివ్వె వెలుగొందే కోవెలని
అదే అదే నా హృదయమని ప్రణయమని ప్రాణమని
తెలుసా- ప్రేమంటే- ఒకే మురళి పలికే గోకులమని
ఒకే కెరటం ఉప్పొంగే యమున అని
అదే అదే నా జీవమని గానమని మౌనమని
శీత గాలి వీచినపుడు లేత ఎండలా
ఎండ కన్ను సోకినప్పుడు మంచు కొండలా
ఆదుకునే వెచ్చని మమత ఆవిరయే చల్లని ఎడద
ఒకటే శ్రుతి ఒకటే లయ ఒకటే స్వరమూ
ఉన్న రాగమొకటే అదే అదే అనురాగమని
మౌన యోగమని ప్రేమ దీపమని- తెలుసా
శరత్కాల నదులలోని తేటనీటిలా
పుష్యమాస సుమదళాల తేనెవాకలా
సుప్రసన్న సుందర కవిత
సుప్రభాత మరందగుళిక
ఒక పార్వతి ఒక శ్రీసతి ఒక సరస్వతి
ఉన్న మంత్రమొకటే
అదే అదే మమకారము సృష్టికారణం
బ్రహ్మకు జననం- తెలుసా

అనా ప్రపంచం

ఫేస్‌బుక్‌లోని 'సాహిత్యమూ దాష్ చర్చ' గ్రూపు సభ్యులు ప్రత్యక్షంగా కలుసుకుని జరుపుకున్న రచ్చలో ఎనభై నాలుగు సెల్‌ఫోన్లు, పన్నెండు టాబ్‌లు, మూడు లాప్‌టాప్‌లు, పదమూడు తలలు, కొన్ని మనోభావాలు గాయపడిన అనంతరం సభ విజయవంతంగా ముగిసింది.

కథాసారం

సాహిత్యంలో సతి

''కథ పేరు మారిస్తే బావుంటుందేమో'' అన్నాడు తిరుమలరావు భార్య కొత్తగా రాసిన కథ చదివి.

పెళ్లికి ముందు సత్యవతి రాసిన కథలు అతను చదవలేదు. పెళ్లిచూపులకి వెళ్లినప్పుడు సత్యవతి అన్నగారు- ''మా చెల్లెలు కథలు బాగా రాస్తుందండీ'' అన్నప్పుడు ''ఓహో'' అని నవ్వి ఊరుకున్నాడు. అతనికి కాకమ్మ కబుర్లూ కల్లబొల్లి కథలూ అంటే ఇష్టం లేదు. చుట్టుపక్కల ఏదైనా సంఘటన జరిగితే మాత్రం దాని పూర్వాపరాలు తెలుసుకోవాలని కుతూహలం కనబరచేవాడు. ఈ ప్రవృత్తి అతని పోలీసు ఉద్యోగానికి బాగా పనికొచ్చింది.

సత్యవతి కథలు రాస్తుందని విన్నాక, ''పోనీలే తన కాలక్షేపం తనకుంటుంది నన్ను వేధించకుండా'' అనుకున్నాడు. పెళ్లయ్యాక, తన కథలు- పాతవి చదవమని సత్యవతి ఎప్పుడూ అడగలేదు భర్తని. తీరిక లేని 'డ్యూటీ' అతనిది. ఏ క్షణాన అయినా యూనిఫామ్ తగిలించుకోవడానికి సిద్ధంగా ఉండాల్సివచ్చేది. ఇద్దరూ కలిసి ఉన్నప్పుడు తన కథల గురించి ప్రస్తావించకుండా, అతని ఉద్యోగం కబుర్లు అడిగి తెలుసుకుంటూ ఉండేది. తన కథలకన్నా ఎంతో ఆసక్తికరంగా అనిపించేవి కొన్ని కేసుల వివరాలు.

అతను చెప్పిన ఒక కేసు ఆధారంగా కొంత కల్పన జోడించి ఒక కథ రాసింది. అది మాత్రం చదవమని భర్తని కోరింది. కొత్త పెళ్లాంమీద మోజు కొద్దీనో, కుతూహలం కొద్దీనో ఒప్పుకున్నాడు. బావుందని మెచ్చుకుంటూనే కొన్ని సంభాషణలు సరిదిద్ది, ''పేరు మారిస్తే బావుంటుందేమో'' అన్నాడు.

''ఆ మనిషిలో ఉన్న బలహీనతను కనిపెట్టి దానిమీద దెబ్బకొట్టాడు ప్రత్యర్థి. అదే కదా ముఖ్యాంశం. అందుకే బలహీనత అని పెట్టాను'' అని సమర్థించుకుంది సత్యవతి.

''ఆ పాయింట్ ఒప్పుకుంటాను. కానీ పేలవంగా అనిపిస్తోందా శీర్షిక'' అన్నాడు తిరుమలరావు చేయి తిరిగిన విమర్శకుడిలా.

''మీరు ఏదైనా చెప్పండి ప్లీజ్'' అంది సత్యవతి.

''వీక్ పాయింట్ అని పెట్టు ఆకర్షణీయంగా ఉంటుంది'' అన్నాడు.

''తెలుగు కథకి ఇంగ్లీషు పేరేం బావుంటుందండీ? తెలుగులో మాటలే లేవన్నట్లు?'' అంది.

''తెలుగు మాట లేకనేనా ప్లీజ్ అన్నావ్''అన్నాడతను వేళాకోళంగా.

సత్యవతి మారు వాదించలేక ఒప్పేసుకుంది. ''కానీ ఒక రిక్వెస్ట్. ఈ కథకి ఆధారం మీరు చెప్పిన కేసే. శీర్షిక కూడా మీరే పెట్టారు. సరదాగా మనిద్దరి పేర్లతో పంపిద్దాం'' అంది. ''మీ పేరు కూడా జోడిస్తే నాకెంత గర్వకారణమో తెలుసా? వివాహానికి అంతకన్న సార్థక్యం ఏముంటుంది?''

''ఓ, నో! నేను రాశానంటే నా సంగతి తెలిసిన వాళ్లంతా నవ్వుతారు'' అన్నాడతను.

గత్యంతరం లేక, తన పేరు మీదే పంపించింది. ఒక మాసపత్రిక వాళ్లు ప్రత్యేకంగా ప్రచురించారు. రెండు పేజీల బొమ్మ వేశారు. బోలెడు లేఖలొచ్చాయి. తిరుమలరావుకి సంభ్రమం కలిగింది.

ఈసారి ఏదైనా వస్తువు తీసుకోవాలని సత్యవతి ఆలోచిస్తుంటే తిరుమలరావు- డాక్టర్లకీ, మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కీ, మందులషాపుల వాళ్లకీ, పోలీసులకీ ఉండే అవినీతికర సంబంధం గురించి రాయమని సూచించాడు.

''నాకు వివరంగా తెలియదు, కథ వాస్తవికంగా అనిపించదు'' అని ఇబ్బందిగా పెట్టింది మొహం.

''నువ్వు స్థూలంగా రాయి, తక్కిన వివరాలు నేను చెబుతాను'' అన్నాడు.

అతను చెప్పిన వివరాలూ, సూక్ష్మాంశాలూ రాసుకుని కథ పూర్తి చేసింది. ఈసారి కూడా కథకు పేరు అతనే సూచించాడు. అదీ ఇంగ్లీషులోనే కుదిరింది. ఈసారి సత్యవతి గట్టిగా పట్టుపట్టింది అతని పేరు కూడా ఉండాలని. పైకి వద్దన్నా తిరుమలరావు కొంత మెత్తబడకపోలేదు. క్రిందటిసారి కథకు వచ్చిన ప్రశంసల్లో తనకీ కొంత భాగం లేకపోలేదని పించింది. ఉద్యోగరీత్యా తన పేరుండటం మంచిదికాదేమోనని తటపటాయించాడు. మధ్యేమార్గంగా కలంపేరు పెట్టుకుందామన్నాడు.

తనపేరు ఉండదని బాధ కలిగినా అతని సలహా బావుందనేసింది. పిల్లలకి పేరు పెట్టడానికి చేసినంత యోచన చేశారు. ''సతి'' అని పెట్టుకుందామంది. తన పేరులో మొదటి అక్షరం, అతని పేరులో మొదటి అక్షరం కలిపితే ''సతి''.

సత్యవతి పేరున్న రచయిత్రే కాబట్టి సంపాదకులు వెంటనే ప్రచురించారు. పైగా రచయిత పేరు చెప్పబోవడం లేదంటూ 'సస్పెన్స్'లో పెట్టారు. ఈ సతి ఎవరు? రచయితా, రచయిత్రా? అంత పదునుగా సంభాషణలు రాయడం రచయిత్రికి సాధ్యమా? అంతసున్నితమైన అనుభూతుల్ని రచయిత్రే రాయగలుగుతుందనీ అభినందనలు తెలపండి అంటూ సంపాదకుడికి చాలా ఉత్తరాలొచ్చాయి.

ఆ విజయోత్సాహంలో అయిదారు కథలు రాసి పంపారు. సతి రచనలు విశిష్టంగా ఉంటాయన్న పేరు పడిపోయింది.

పోలీస్ సర్కిల్స్‌లో సాహిత్యాభిరుచి ఉన్నవాళ్లు తన కథల గురించి చర్చించుకుంటూంటే మొదట్లో తిరుమలరావు ముసిముసి నవ్వులు నవ్వుకునేవాడు. క్రమంగా చర్చల్లో పాల్గొనడం మొదలుపెట్టాడు.

''కొంపదీసి మీరే రాయలేదుకదా, అంతగా సమర్థిస్తున్నారు'' అనేశారు ఒకళ్లిద్దరు.

సతి నవల ఒకటి సీరియల్‌గా మొదలయేసరికి ఆ పత్రిక అమ్మకాలు విపరీతంగా పెరిగిపోయాయి. సీరియల్ పూర్తికాకుండానే ఒక ప్రచురణకర్త నవలనీ, మరొకరు కథలనూ అచ్చువేస్తామని ముందుకొచ్చారు. రచయిత గురించి చెబుతామంటూ మూడు సంచికల్లో ఊరించి చివరికి పేర్లు వెల్లడించారు. మరో పత్రిక ఉగాది సంచికలో సతి కథతోబాటుగా సత్యవతి, తిరుమలరావు ఫొటోలు కూడా వేశారు.

కథనంలో ఎవరి వంతు ఎంత అని పాఠకుల్లో చర్చ మొదలైంది. పత్రికలు ముఖాముఖీలు ఏర్పాటు చేశాయి. ఇద్దరూ ఏ విధంగా కథారచన చేస్తుంటారో కొంత గంభీరంగానూ, కొంత చమత్కారంగానూ వివరించారు.

పుస్తకాలు అచ్చయ్యాయి. మంచి సమీక్ష లొచ్చాయి. ఇక సన్మానాల వాళ్లు ముందుకొచ్చారు. వేదిక మీదికి బహిరంగంగా రాక తప్పలేదు.

సత్యవతి గర్భవతి అయింది. కొడుకు పుట్టాడు. తీరిక లేక బొత్తిగా రాయడం తగ్గించేసింది. తిరుమలరావుకి ఉద్యోగంలోనూ, రచనలోనూ అనుభవం పెరగడంతో రాయాలనే తపన ఎక్కువైంది. ఇప్పుడు కథంతా అతనే రాస్తున్నాడు. దస్తూరి మాత్రం బ్రహ్మరాతలా ఉంటుంది. అందుకని సత్యవతిని తిరిగి రాయమనేవాడు. రాసేటప్పుడు అక్కడక్కడ మార్పులూ చేర్పులూ చేసేది.

సత్యవతి మళ్లీ గర్భవతి అయింది. ఈసారి ఆడపిల్ల. ఆ పిల్లే ఇక లోకం అయిపోయింది. కథలు కాపీ చెయ్యడానికి కూడా పగలు తీరిక దొరకడం లేదు. రాత్రిళ్లు నిద్ర ఆపుకుని, పిల్లలు పడుకున్నాక, ఫెయిర్ చేసి పెడుతోంది.

తిరుమలరావు తండ్రి పోయాక, తల్లి కొడుకు దగ్గర ఉండటానికి వచ్చేసింది. ఆవిడకి బి.పి. ఆవిడ ఆలనాపాలనా చూసుకోవలసి వస్తోంది. మీటింగులకీ, సభలకీ వెళ్లడం మానేసింది. ఇద్దరి తరపునా తిరుమలరావే వెళ్లొస్తున్నాడు.

సత్యవతికి మొహమాటంగా ఉంటోంది- తను రాయకుండా తన పేరు పెట్టడం. తను ఎదుర్కొంటున్న సమస్యల ఆధారంగా ఒక కథ రాయాలనిపించింది. ''మరీ సిల్లీగా ఉంటుంది'' అని తిరుమలరావు కొట్టిపారేశాడు. పెళ్లికాకముందు తనకున్న అనుభవంతో చిన్న చిన్న కథలెన్నో రాసింది. అటువంటివి రాయడం తమపేరుకి తగవన్నట్లు మాట్లాడాడు. పెళ్లయాక మొదటిసారి తన స్వేచ్ఛ పోయినట్లనిపించింది.

సత్యవతి అత్తగారు పోయారు. తిరుమలరావుని ప్రమోషన్ మీద రాజధానికి బదిలీ చేసింది ప్రభుత్వం. సంవత్సరం మధ్యలో మారిస్తే పిల్లల చదువు పాడవుతుందని సత్యవతి ఉన్నచోటే ఉండిపోయింది. ఇప్పుడు సత్యవతికి బోలెడంత తీరిక. ఏమీ తోచక పత్రికలన్నీ చదువుతోంది. హఠాత్తుగా తమ కలంపేరు చూసి తెల్లబోయింది. కథ రాస్తున్నట్లు చెప్పలేదు తిరుమలరావు. కాపీ చెయ్యమని ఇవ్వలేదు. ఒకళ్లిద్దరు స్నేహితులు ఫోన్ చేసి మెచ్చుకున్నారు. సత్యవతి మనస్ఫూర్తిగా సంతోషించలేకపోయింది. భర్త ఇక్కడికి వచ్చినప్పుడు నిలదీసి అడగొచ్చునులే అనుకుంది.

తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లయింది. రాజధానిలో మతకలహాలు చెలరేగాయి. తిరుమలరావుకి స్పెషల్ డ్యూటీ వేశారు. బాంబు పేలింది. తిరుమలరావుకీ మరో కానిస్టేబుల్‌కీ తీవ్రగాయాలు తగిలి స్పృహ కోల్పోయారు. హాస్పిటల్‌కు తరలిస్తుంటే దారిలోనే తిరుమలరావు మరణించాడు.

సత్యవతి గుండెలు బ్రద్దలవుతున్నా ఏడుపు బిగపెట్టుకుంది పిల్లలు బెంబేలు పడతారని. చుట్టుపక్కలవాళ్లూ, స్నేహితులూ వచ్చేశారు పరామర్శించడానికి. అప్పుడిక ఆపుకోలేకపోయింది. తలబాదుకుంటూ ఏడ్చింది.

దినపత్రికలన్నిటిలోనూ ''సతి'' అకాల దుర్మరణం గురించిన వార్తతోబాటు ప్రముఖుల సందేశాలు కూడా ప్రచురించటం జరిగింది. పదవరోజున సతి సంతాపసభ ఏర్పాటయింది. సత్యవతిని రమ్మని పిలవలేదు- బొత్తిగా పదవ రోజున బయటికి ఎలా వస్తుందని. సతి హఠాన్మరణం వల్ల సాహితీ లోకానికి ఎంత లోటు కలిగిందన్నది అందరూ ఉద్ఘాటించిన విషయం. అందరూ పట్టించుకోని విషయం ఒక్కటే- సతిలో అర్ధభాగం ఇంకా బ్రతికే ఉన్నదన్న సత్యం. సత్యవతి ఇంకా బ్రతికే ఉన్నది కనుక సతి పేరుతో రచనలు కొనసాగగలవన్న ఆశాభావాన్ని ఎవ్వరూ ప్రస్తావించలేదు.

''సతి'' పేరుతోగానీ, సత్యవతి పేరుతోగానీ మళ్లీ కథ రాలేదు ఇంతవరకు.



''ఈ కథకి ఆధారం మీరు చెప్పిన కేసే. శీర్షిక కూడా మీరే పెట్టారు. సరదాగా మనిద్దరి పేర్లతో పంపిద్దాం'' అని భర్తతో అంది సత్యవతి.

అబ్బూరి ఛాయాదేవి

ఈ వారంలోనే మరణించిన అబ్బూరి ఛాయాదేవి (1933-2019) కథ 'సతి'కి సంక్షిప్త రూపం ఇది. 1993లో ప్రచురితం. స్త్రీవాద ధోరణి తెలుగులో ప్రబలకముందే ఆ ఛాయలో రాసిన రచయిత్రి ఛాయాదేవి. సుఖాంతం, బోన్‌సాయ్ బ్రతుకు, ప్రయాణం, ఉడ్‌రోజ్ లాంటివి ఆమె కథల్లో కొన్ని. రాజమండ్రిలో జన్మించారు. తన మార్గం కథాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందారు. జిడ్డు కృష్ణమూర్తి రచనలనూ, స్టెఫాన్ త్స్వైక్ కథలనూ తెలుగులోకి అనువదించారు. రచయిత అబ్బూరి వరదరాజేశ్వరరావు ఆమె భర్త. పిల్లలు వద్దనుకున్నారు. తన దేహాన్ని దానం చేస్తూ వీలునామా రాశారు.

తల్లి గతాన్ని నిర్మించే కొడుకు

కొత్త బంగారం



తాహర్ బిన్ జెల్లౌన్

లల్లా ఫత్మాకు అల్జీమర్స్. ఆఖరి దశలో ఉంటుంది. 'ఆమె జ్ఞాపకాలు తడినేలపైన వెదజల్లబడి ఉంటాయి.' తాహర్ బిన్ జెల్లౌన్ రాసిన ఫ్రెంచ్ నవలైన, 'ఎబౌట్ మై మదర్'లో- మొరాకోలో, నిరక్షరాస్యురాలైన లల్లా కొడుకైన తాహర్- క్రమం తప్పకుండా తల్లిని చూడ్డానికి వస్తుంటాడు. కథకుడతనే.

పదిహేనేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులు లల్లాకు పెళ్ళి చేస్తారు. పదహారు ఏళ్ళప్పుడు గర్భం ధరిస్తుంది. భర్త టైఫాయిడ్‌తో పోతాడు. కూతురి ప్రసవం తరువాత, తల్లిదండ్రులు ఆమెను ఒక ముసలాడికిచ్చి మళ్లీ పెళ్ళి చేస్తారు. ఒక కొడుకును పుట్టించి అతనూ మరణిస్తాడు. ఆఖరికి, ఆమెకు తాహర్‌కు తండ్రవబోయే వ్యక్తితో వివాహమవుతుంది. వెలిసిపోతున్న జ్ఞాపకాలతో, ఎంతోకాలంగా తన మనస్సులోనే పదిలపరచుకున్న రహస్యాలను తల్లి తునకల్లో చెప్పే వాక్యాలను వింటూ, మొరాకో యుద్ధానంతరపు ఆమె జీవితపు నిజాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాడు కొడుకు. ఆమె తన పెళ్ళిళ్ళ ఏర్పాట్లు, పండుగ భోజనాలు, బంగారపు కుట్టుపనుండే తన జోళ్ళ గురించి మాట్లాడుతుంది. 'తనింకా 1944లో, తను పెరిగిన తంజాలో ఉన్నామనుకుంటోంది. మేమిప్పుడు 2000లో ఫెజ్‌లో ఉన్నాం. అమ్మ కలలు ఆమెపై ధ్వజమెత్తుతున్నాయి. వర్తమానం ఒకవైపు ఒరుగుతోంది... మిణుకు మిణుకుమంటోంది... ఆపై పూర్తిగా మసకబారింది. ఇకపై యీమెకు దీనితో సంబంధం ఉండదు.'

తెలివిలోకి వచ్చినప్పుడు మొరాకో స్వాతంత్ర్య పరివర్తన పర్యంతం- ఆర్థిక కారణాలవల్ల తమ కుటుంబం ఫెజ్‌కు పారిపోయినప్పటి కాలాన్ని తలచుకుంటుంది లల్లా. తిరుగుబాటు జరిగి ఎంతకాలమైందో గుర్తొచ్చినప్పుడు, నమ్మలేకపోతుంది: 'ఇంచుమించు యాభై సంవత్సరాలా! అప్పుడు నేనెక్కడున్నాను?... అత్తరు తీయడానికి డాబామీద పరిచిపెట్టిన గులాబీల సుగంధమింకా నా నాసికాపుటాలకు చేరుతోంది... నేను ఒకే సమయంలో ఫెజ్‌లోనూ, టాంగియర్‌లోనూ కూడా ఎలా ఉన్నాను?' అంటూ, తాహర్‌ను అడుగుతుంది: 'నేను ఎటువంటి జీవితం గడిపాను?' తల్లి ఆలోచనాపరురాలు కాదని తెలిసిన కొడుకు, 'ఆ జీవితాన్ని ఊహించుకోవడం నా పనే' అనుకుంటాడు. స్త్రీలను అణిచివేసే సంస్కృతిలో, తల్లి తన అదృష్టాన్ని విధికెందుకు వదిలేసిందో అర్థం చేసుకుంటాడు. తల్లి కుటుంబం నుండి కోరుకున్న మెప్పు ఆమెకేనాడూ దొరకలేదనీ, ఆమె జీవితం అసంతృప్తికరంగానే గడిచిందనీ గుర్తిస్తాడు.

అనివార్యమైన తల్లి మరణం ముందు అతని అన్న తల్లితో, 'దేవుడు నీకు మంచి ఆరోగ్యం ఇచ్చి సంతోషంగా ఉంచాలి' అంటాడన్న ఒక వినయపూర్వకమైన జ్ఞాపకంతో లల్లా కథను ముగిస్తాడు.

ఆమె మృత్యువు తరువాత కుటుంబాన్ని తలకిందులు చేసే మరణశయ్య రహస్యాలేమీ ఉండవు కథలో. నవల మొరాకో దేశపు సంస్కృతిని వివరిస్తుంది. ఉదా: 'దేవుని పట్ల ప్రేమతో పాటు, తల్లిదండ్రుల మీదుండే మత భక్తంత గౌరవం... ఏదో రోజు వారి ఆశీర్వాదం మనకి ఉండదేమోనన్న భయంతో జీవిస్తాం.'

సొంపైన, కవితాత్మకమైన భాష ఉన్న నవలిది. రాస్ స్కార్జ్, లులూ నార్మాన్ ఇంగ్లిష్‌లోకి అనువదించిన ఈ పుస్తకాన్ని-టెలిగ్రామ్ బుక్స్ 2016లో ప్రచురించింది. తొలి ప్రచురణ 2006లో.

మొరాక్ సాంస్కృతిక రాజధాని అనబడే ఫెజ్‌లో పుట్టిన జిల్లౌన్- వ్యాసకర్త, కవి, విమర్శకుడు. ఫ్రాంకో-అరబిక్ స్కూల్లో అరబిక్‌తో పాటు ఫ్రెంచ్ కూడా నేర్చుకున్నారు. 16 ఏళ్ళ వయస్సులో సొర్బోన్‌లో పైచదువులకని వెళ్ళి, 1973లో 'హార్రుదా' అన్న ఫ్రెంచ్ నవల రాశారు. 'నిజానికి నేను ద్విభాషిని. రాసేందుకు కావాలని ఏ ఎంపికా చేసుకోనప్పటికీ, ఫ్రెంచ్‌లో రాయడం సంతోషం కలిగించింది. మాతృభాషైన అరబిక్‌ను ఎలాగూ కోల్పోలేను కనుక ఒక విదేశీ భాషపైన శక్తి వెచ్చించాను' అని చెప్పే జెల్లౌన్ రచనలన్నీ ఫ్రెంచులో ఉన్నవే. ఆయన 'నోబెల్ ప్రైజ్' కోసం అనేకసార్లు షార్ట్ లిస్ట్ అయ్యారు.

◆ కృష్ణ వేణి

సాహిత్య మరమరాలు

చేత్తో చేసిన యుద్ధం

పెళ్లి మాత్రమే మానసిక, నైతిక స్థిరత్వం ఇవ్వగలదని నమ్మకం కుదిరేనాటికి టాల్‌స్టాయ్ వయసు 34 ఏళ్లు. అప్పుడు తనకంటే చాలా పెద్దవాడైన టాల్‌స్టాయ్ జీవితంలోకి పద్దెనిమిదేళ్ల సోఫియా ప్రవేశించింది. శిఖరాలకే శిఖరంలాంటి రచయితైన భర్తకు తొలి పాఠకురాలిగా, కార్యదర్శిగా, కాపీ ఎడిటర్‌గా, ఆర్థిక వ్యవహారాలు చూసే దక్షురాలిగా సోఫియా పని చేసింది.

వారి పెళ్లి జరిగింది 1862లో. వాళ్లకు పదముగ్గురు సంతానం కలిగారు. అందులో నలుగురు పుట్టుకలోనో, శిశువులుగానో చనిపోయారు.

వారి పెళ్లయిన మరుసటి ఏడాదే టాల్‌స్టాయ్ ప్రపంచంలోనే బృహత్తర నవలల్లో ఒకటైన 'యుద్ధము-శాంతి'కి శ్రీకారం చుట్టాడు. 1869లో పూర్తయింది. ఇందులో 559 పాత్రలు ఉన్నాయని ఒక లెక్క. పేజీల సంఖ్య సుమారు 1300. పదాల సంఖ్య సుమారు 6 లక్షలు. టాల్‌స్టాయ్ దీన్ని మళ్లీ మళ్లీ తిరగరాసేవాడు. పేజీలకు పేజీలు రాసినవి చించేసేవాడు. ఈ నవలను ఒకసారి చదవడానికే చాలా మంది పాఠకులు చేతులెత్తేస్తారు. అట్లాంటిది పిల్లలను చూసుకుంటూ, భర్త గందరగోళపు రాతను అర్థం చేసుకుంటూ, ప్రచురణకర్తకు పంపేవీలుగా ఈ నవలను అక్షరాలా తొమ్మిదిసార్లు పూర్తిగా తన చేతుల్తో కాపీ చేసింది సోఫియా, ఈ మధ్యలో ఒకసారి బాలింత జ్వరం వచ్చి మృత్యువాత పడినంత పనైనప్పటికీ.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు. జ్యేష్ఠ మాసం. తిథి బ.చతుర్దశి రా.2.23 వరకు, తదుపరి అమావాస్య. నక్షత్రం రోహిణి ఉ.8.50 వరకు, తదుపరి మృగశిర. వర్జ్యం ప.2.20 నుంచి 3.55 వరకు. దుర్ముహూర్తం ప.12.27 నుంచి 1.20 వరకు, తదుపరి ప.3.03 నుంచి 3.55 వరకు. అమృత ఘడియలు ఉ.5.34 నుంచి 7.12 వరకు, తిరిగి రా.11.49 నుంచి 12.34 వరకు.

సూర్యోదయం : 5.32 సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 4.24 అసర్ : 4.56
జొహర్ : 12.20 మగ్రీబ్ : 6.54
ఇషా : 8.16

మహాస్వప్నతో కాసేపు

నివాళి మహాస్వప్న (1940-2019)

కందుకూరు (ప్రకాశం జిల్లా) దరినే ఉన్న లింగసముద్రంలో మహాస్వప్న మకాం అని తెలిసింది. బియ్యీడీ కాలేజీ ప్రాక్టికల్ పరీక్షల ఎగ్జామినర్‌గా కందుకూరు వెళ్లే అవకాశం వచ్చింది. ఆ నెపాన మాలకొండ వెళ్లి లక్ష్మీనరసింహస్వామితోనూ, లింగసముద్రం వెళ్లి మహాస్వప్నతోనూ పరిచయం కలిగించుకున్నాను.

లింగసముద్రం మొదట్లోనే ఒక టీకొట్టు కనబడింది. ''మహాస్వప్న గారుండేది ఎక్కడా?'' అని అడిగాను. ఆ పేరు నోరు తిరగలేదు ఆయనకు. ''మఆ... సపనా... ఏం జేస్తుంటా''డని ఆరా అడిగాడు. ''ఆయన పెద్దకవి'' అని సమాధానమిచ్చాను. ''అట్టజెప్పు, కవిగారా? రోజూ యీడేగా టీ తాగేది, కాసేపట్లో వొత్తాడు. యీడే ఉండండి.''

చెక్కబెంచీ మీద కూలబడ్డాను. నిమిషం గడిచిందో లేదో సన్నగా, సుమారుపాటు ఎత్తుతో, పళ్లు రెండు మూడు ఊడిపోయినా ముఖం కళగా ఉన్న, ఊగుతూ నడుస్తున్న ఒకాయన వచ్చి నా పక్కన ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. రెండు, మూడు నిమిషాలు గడిచాక, మహాస్వప్నతో నాకు పరిచయం లేదన్న సంగతి, టీకొట్టు మనిషి అర్థం చేసుకున్నట్టు ఉన్నాడు. 'అడుగో నువ్వడిగిన కవిగారు, మాట్టాడకుండా కూచున్నావే?' అని హుషారు చేశాడు. అప్పుడు సుమారు రెండు గంటలపాటు ఆయనతో మాట్లాడిన పిచ్చాపాటి ఇది. అన్నీ ఆయన మాటలే. ఇది జరిగింది 8.11.2008 నాడు.

''దిగంబర కవిత్వానికి ముందే చాలా కవిత్వం రాశాను. అచ్చు పడింది తక్కువ. చించెయ్యలేదు గానీ పారేసింది, ఎక్కడ పెట్టానో మరిచిపోయింది ఎక్కువ. మహాస్వప్న పేరుతో కాకుండా చాలాపేర్లతో రాశాను. నగ్నముని 'సహస్ర నామధేయుడు' అని హాస్యంగా అంటూండేవాడు.

దిగంబర సాహిత్యం మూడు సంకలనాలు బయటపడ్డ తరువాత మా మధ్య సైద్ధాంతిక విభేదాలు బయటపడ్డాయి. విడిపోయాం. అయినా నాకు ఎవరితో వ్యక్తిగత వైరుధ్యం లేదు.

భైరవయ్య మొదటినుండీ ఒక బెట్టుగా ఉండేవాడు. దిగంబర కవిత్వం ఆవిష్కరణకు కూడా పెద్ద నిలువుబొట్టు పెట్టుకొని వచ్చాడు. ఏమిటిదీ అంటే అది అదే, ఇది యిదే అన్నాడు. జ్వాలాముఖి అంత పసిబిడ్డ మనస్తత్వం కలిగిన అగ్నిపర్వతాన్ని నేను ఇంకొకరిని చూడలేదు.

జ్వాలాముఖి అన్న పేరు అసలుకైతే చెరబండరాజుకు ఇంకా బాగా అతుకుతుంది.

హైదరాబాదులో నాలుగేళ్లు నిరుద్యోగిగా గడిపాను. తెలుగు నుండి ఇంగ్లీషులోకీ, హిందీలోకి అనువాదాలు చేశాను. చాలా కొద్ది డబ్బు వచ్చేది. దానితోనే గడిపాను. నాకు మూడు భాషలు బాగానే వచ్చు. ఫ్రెంచి నేర్చుకోవడానికి ప్రయత్నించాను. పురుట్లోనే సంధి కొట్టింది. సంస్కృతం కూడా ట్రై చేశాను. కుదరలేదు.

నాకు శ్రీశ్రీ అన్నా, శ్రీశ్రీకి నేనన్నా చాలా అభిమానం. నా పుస్తకం ఒకదానిని అచ్చువేస్తానన్నాడు. నేనే నిరాకరించాను. 'పుస్తకం రాసేనాటికీ యిప్పటికీ నా అభిరుచులు, భావజాలం మారిపోయాయి. పుస్తకం ప్రచురించే నాటికి పుస్తకంలో కంటెంట్, రచయిత ఐడియాలజీ ఒకటిగా ఉండాలి. లేకపోతే వేయకూడదు అన్నది నా సిద్ధాంతం' అని చెప్పాను.

1964లో మొదటిసారి, 1977లో రెండవసారి పుట్టపర్తి వెళ్లాను. బాబా దర్శనంతో నాలో మార్పు వచ్చింది. ఆధ్యాత్మిక ప్రపంచంలోకి అడుగుపెట్టాను. మనసుకు కాస్త శాంతి చిక్కినట్లు అనిపించింది. అయితే అన్యాయం పట్లా, అసమానతల పట్లా, సమాజంలో ఒకరినొకరు చేసుకునే మోసాల పట్ల నా భావాలు దిగంబర కవిత్వం నాడు ఎలా ఉన్నాయో యిప్పటికీ అలానే ఉన్నాయి.

1977లో బాబాను దర్శించుకున్న తరువాత నాకు స

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
1-7-2019

వైద్య నాడీమణి
లోపలి పేజీలో

దోస్త్ మేరా దోస్త్
- సినిమా పేజీలో

నిర్ణయం నాదే

చెయ్‌రా ఛాలెంజ్

ఐస్‌ని నెత్తిమీద వేసుకోగలవా? (ఐస్ బకెట్)
డ్రైవ్ చేస్తూ డ్యాన్స్ చేయగలవా? (కీకీ)
నీ ఫొటో చూపించగలవా? (అప్పుడు-ఇప్పుడు)
సవాల్‌ని స్వీకరిస్తాం. నెట్‌లో పెట్టేస్తాం.
అయితే లైఫ్‌లో తీసుకోవలసిన చాలెంజెస్..
వేరే ఉన్నాయని యూత్ అంటోంది.
ఆడవాళ్లకు గౌరవం ఇవ్వగలవా? చాలెంజ్!
లైంగిక దాడుల్ని నిరోధించగలవా? చాలెంజ్!
నెట్‌లో పోర్నోగ్రఫీని ఆపగలవా? చాలెంజ్!
ఇలాంటి చాలెంజ్‌లు మొదలవ్వాలి.
సమాజానికి పట్టిన చీడపీడల్ని వదిలించాలి.

ప్రతీకాత్మక చిత్రం

జస్సికాలాల్.. గుర్తుండే ఉంటుంది. మోడల్. ఢిల్లీలో.. ఒక సోషలైట్స్ పార్టీలో బార్‌మెయిడ్‌గా డ్రింక్ సర్వ్ చేస్తూ టైమ్ అయిపోయిందని.. డ్రింక్స్ క్లోజ్ చేయసాగింది. అప్పటికి టైమ్ రాత్రి.. రెండు గంటలు. హర్యానా ఎంపీ (అప్పటి) వినోద్ శర్మ కొడుకు సిద్ధార్థ వశిష్ట్ ఉరఫ్ మనూ శర్మ వచ్చి ఒక డ్రింక్ ఇవ్వమని అడిగాడు ఆమెను. ''సారీ.. టైమ్ అయిపోయింది'' అని చాలా పొలైట్‌గా ఆన్సర్ చేసింది. ఆ సమాధానాన్ని లెక్క చేయకుండా డ్రింక్ కోసం పట్టుబట్టాడు. జెస్సికా చాలా మర్యాదగా కుదరదని చెప్పింది. అతని అహం దెబ్బతిన్నది.. తుపాకీ తీసి పేల్చాడు. ఆమె చనిపోయింది. 1999 నాటి సంగతి ఇది. మనుశర్మ కోరుకున్న మద్యం ఖరీదు.. జెస్సికా ప్రాణం!

అందుకే 'నో వన్ కిల్డ్ జెస్సికా' సినిమాలో జెస్సికా అక్క సబ్రీనా పాత్రధారణి అంటుంది ''ఈ దేశంలో ఆడపిల్ల ప్రాణం లిక్కర్ కంటే చీప్'' అని. ఒక్క మద్యానికే కాదు.. ఈ దేశంలో ఆడపిల్లలు చదువుకోవాలనుకున్నా చావును ఆహ్వానించాల్సిందే. కనీసం సదుపాయాలు కావాలనుకున్నా అమ్మాయిలు తమ మానప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సిందే! దీనికి ఉదాహరణ.. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలంలోని హాజీపూర్ గ్రామంలో ముగ్గురు అమ్మాయిల మీద జరిగిన లైంగిక దాడి, హత్యలే! బస్సు సౌకర్యలేమికి వాళ్ల జీవితాలు బలి!

ఇలాంటివి జరిగినప్పుడే గజిని సినిమాలోని.. ''ఒరేయ్ ఇప్పుడిప్పుడే మేం గడపదాటి బయటకు వస్తున్నాం రా.. ఇలాంటి వాటితో మళ్లీ మమ్మల్ని వంటిళ్లకే పరిమితం చేయకండిరా'' అనే డైలాగ్ గుర్తొస్తుంటుంది.

అంతేనా? దేశంలో ఏ మూలన పురుషాహంకారం దాడికి తెగబడినా అమ్మాయిలు వేసుకుంటున్న ఆధునిక దుస్తులను, నడతను తప్పుబడుతున్న 'సంస్కృతి- సంప్రదాయం- సంస్కారం' కాలర్ పుచ్చుకొని నిలదీయాలని పిస్తుంది.. వరంగల్‌లో జరిగిన తొమ్మిది నెలల పసి బిడ్డ రేప్, హత్య గురించి!

దేశంలో మంచినీళ్లుండవ్.. మద్యానికి మాత్రం భరోసా! కనీస సౌకర్యాలుండవ్.. ఫ్రీగా వైపై దొరుకుతుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కన్నా.. సారా దుకాణాలు ఎక్కువ. అంబులెన్స్‌ల కన్నా ఫ్రీ ఇంటర్నెట్ సెంటర్స్ అందుబాటులో ఉంటాయి. రిటైర్డ్ పర్సన్స్ మొదలు.. ఏడో తరగతి చదివే పిల్లల దాకా.. అందరికీ పోర్న్ కనిపిస్తుంది. వీటన్నిటి ప్రభావం ఎవరి మీద? పిల్లల మీద.. ఆడవాళ్ల మీద! వంద శాతం అక్షరాస్యత, సెక్స్ ఎడ్యుకేషన్, చైతన్యం ఉన్న దేశాలే సోషల్ మీడియా మీద ఆంక్షలు విధించాయి. ఫిల్టర్స్ పెట్టాయి. అవేవీ లేని మనం మాత్రం బార్లా తలుపులు తెరిచాం. పర్యవసానాలను అనుభవిస్తున్నాం.

''వయసులో ఉన్నప్పుడూ కుదురుగా పనిచేసి.. ఇంటి బాధ్యతలు తీసుకున్నది ఎన్నడూ లేదు. ఇప్పుడైతే పని ఊసే లేదు. తాగడం.. నన్ను ఇబ్బంది పెట్టడ్డం. ఈ మధ్య ఫోన్‌లో ఏవేవో రోత వీడియోలు ఆయన చూడ్డమే కాక.. నాకూ చూపిస్తున్నాడు. అలా చేయమని బలవంతపెడ్తున్నాడు. చేయకపోతే కొడ్తున్నాడు మేడం'' అంటూ తను డొమెస్టిక్ హెల్పర్‌గా ఉన్న యజమానికి చెప్పి ఏడ్చింది యాభై రెండేళ్ల సావిత్రి. పోర్న్ చూస్తున్నాడని అర్థమైంది ఆ యజమానికి. ఆ రోజే సాయంకాలం ఈ యజమానికి ఆ సర్వెంట్ మెయిడ్ ఆదరాబాదరాగా ఫోన్ చేసింది..''మేడం.. మా ఆయన... మా పక్కింటోళ్ల పదేళ్ల పిల్ల మీద చెయ్యేశాడట మేడం. పంచాయితీ పెట్టారు వాళ్లు. మా ఆయన మీద నేనే పోలీస్ కంప్లయింట్ ఇద్దామనుకుంటున్నా. సాయం చేయండి మేడం'' రిక్వెస్ట్ చేసింది ఏడుస్తూనే!

ఇంకోచోట..!

బాగా సంపన్నుల కుటుంబం. వాళ్లకు ముగ్గురు పిల్లలు. తల్లిదండ్రులిద్దరూ బిజీ. పిల్లలకు అన్ని సౌకర్యాలూ ఇచ్చారు.. స్మార్ట్ ఫోన్స్, ట్యాబ్స్ సహా. ఆఖరి పిల్లాడు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వాడికి వాట్సాప్‌కు రోజూ రేప్ వీడియోలు వస్తున్నాయి. వాటిని చూడ్డం వాడికి అలవాటుగా మారింది. ఒకరోజు స్కూల్లో మ్యాథ్స్ టీచర్‌ను ఎక్కడో టచ్ చేశాడట. పెద్ద గొడవ.

హైదరాబాద్‌లోనే.. బాగా చదువుకున్న ఉమ్మడి కుటుంబంలోనే..

మంచి ఉద్యోగంలో ఉన్న నడివయసు వ్యక్తి.. తన తమ్ముడి ఏడేళ్ల కొడుకును ప్రతిరోజూ అబ్యూజ్ చేస్తున్నాడు. ఆ వ్యక్తిని చూస్తూనే ఆ పిల్లాడు భయంతో వణికిపోయే పరిస్థితి. పరేషాన్ అయిన తల్లి... అనునయించి అడిగితే పిల్లాడు ఆ తల్లి గుండె పగిలే నిజం చెప్పాడు.

ఒక ఊళ్లో..!

చదువుకున్న యువకుడే. పద్నాలుగేళ్ల పిల్లను వేధించడం మొదలుపెట్టాడు. పెద్దవాళ్లకు చెబితే తననే తప్పుపడ్తారేమో.. స్కూల్ మాన్పించి ఇంట్లో కూర్చో పెడ్తారేమోనని ఎవరికీ చెప్పకుండా మౌనంగా సహించసాగింది. ఆ వేధింపులు బ్లాక్‌మెయిల్‌గా కూడా మారేసరికి తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.

పైన ఉదాహరణలన్నీ వాస్తవాలే. చదువు.. చదువులేకపోవడం, ఉన్నత కుటుంబం, దిగువ తరగతి, పల్లె, పట్నం.. తేడా లేకుండా! ఒకవైపు సెక్స్ అనే పదాన్ని వినడం..ఉచ్చరించడమే పాపంగా పరిగణిస్తూ.. ఇంకోవైపు పోర్న్‌ను ఫోన్ దగ్గర్లో పెట్టే హిపొక్రసీ కల్చర్ వల్లే ఇలాంటి విపరీతాలు.. హాజీపూర్, వరంగల్ వంటి నేరాలు అంటున్నారు మానసిక, సామాజిక విశ్లేషకులు. ఈ ఘోరాలు జరిగినప్పుడల్లా క్యాండిల్‌లైట్ మార్చ్‌లు, సదస్సులు, రేపిస్ట్‌లను ఉరితీయాలనే సోషల్ మీడియా ప్రచారాలు సర్వసాధారణం. ఉరితో సమస్యకు పరిష్కారం దొరుకుతుందా? మూలాన్ని వదిలి పైపైన పూత పూస్తే రోగం తగ్గదు. హిపోక్రసీ వదలాలి. ఆడ, మగ అనాటమీ గురించి తెలియాలి ఇద్దరికీ. సెక్స్ ఎడ్యుకేషన్ కావాలి.

చాలెంజ్‌లు

ఐస్ బకెట్, కీకీ, పదేళ్ల కిందట.. ఇప్పుడు అంటూ పాత, లేటెస్ట్ ఫొటోల పోస్టింగ్ వంటి చాలెంజ్‌లు ప్రపంచంలో ఏ కొసన స్టార్ట్ అయినా.. క్షణాల్లో వాటిని ఓన్ చేసుకొని ఎంతో భక్తితో ఆ చాలెంజెస్‌లో భాగమయ్యే సోషల్ మీడియా పార్టిసిపేంట్స్, ఎక్కడ ఏ చిన్న క్లూ దొరికినా ట్వంటీ ఫోర్ ఇంటూ సెవెన్ పదేపదే టెలికాస్ట్ చేస్తూ సెన్సేషన్‌ను క్రియేట్ చేసే మీడియా, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు యూత్.. జెండర్ సెన్సిటివిటీ మీద చాలెంజ్ ఎందుకు స్టార్ట్ చేయకూడదు? ప్రతి ఇంట్లో.. ప్రతి ఆర్గనైజేషన్, ఇన్‌స్టిట్యూషన్, ప్రతి ఊరు.. ప్రతి పట్టణంలో ఆడవాళ్ల పట్ల గౌరవంగా, పిల్లల హక్కుల పట్ల ఎరుకతో ఉండే చాలెంజ్‌ను ఎందుకు స్వీకరించకూడదు? ఇలాంటి కదలిక వస్తే బాగుంటుంది కదా.. అనేది యూత్ అభిప్రాయం. మొక్కుబడిగా చట్టాలు చేసి చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవడానికి ఇలాంటి చాలెంజెసే కరెక్ట్ అంటున్నారు పెద్దవాళ్లు.

ఎమర్జెన్సీ ప్రకటించాలి

రోజురోజుకి ఈ ఘోరాలు పెరిగిపోతున్నాయి. తొమ్మిదినెలల పాపను కూడా వదిలిపెట్టలేదంటే.. చైల్డ్ అండ్ విమెన్ సేఫ్టీ ఎమర్జెన్సీ ప్రకటించాలి. దీన్నొక మూవ్‌మెంట్‌గా మొదలుపెట్టాలి. అయితే ఈ చాలెంజ్‌లో ముందు గవర్నమెంట్‌నే ఇన్‌వాల్వ్ చేయాలి. అది లిక్కర్, పోర్న్ బ్యాన్‌తోనే స్టార్ట్ అవ్వాలి.

– సి. ప్రియాంక,
ఉద్యోగిని, హైదరాబాద్

అనాటమీ తెలియదు

మన దగ్గర చాలా మందికి.. అంతెందుకు మా సర్కిల్లోనే చాలా మందికి బాయ్ అండ్ గర్ల్ అనాటమీ తెలియని వాళ్లు బోలెడు. ఇప్పుడు జరుగుతున్న చాలా రేప్‌లకు ఇదీ ఒక కారణం. అంటే సెక్స్ ఎడ్యుకేషన్ లేకపోవడం. అఫ్‌కోర్స్ లిక్కర్, పోర్న్ నెక్స్ట్ ప్లేస్‌లో ఉంటాయి. అర్జెంట్‌గా జెండర్ సెన్సిటివిటీని చాలెంజ్‌గా స్టార్ట్ చేయాలి.

– ఎస్. కౌశిక్, స్టూడెంట్, బోధన్
చైల్డ్ అండ్ విమెన్ సేఫ్టీ ఎమర్జెన్సీ

చెట్టు నీడ

కోపానికి మందు

లియో టాల్‌స్టాయ్ ఓ సుప్రసిద్ధ రచయిత మాత్రమే కాదు ఉన్నతమైన మానవతావాది కూడా. ఆయన ప్రతి ఒక్కరితోనూ ఎంతో ప్రశాంతంగా సహనంతో నడచుకుంటూ ఉండేవారు. తన పట్ల దురుసుగా ప్రవర్తించేవారిని సైతం మన్నించేవారు. ఎవరి గురించీ చెడుగా ఆలోచించే వారు కాదు. ఈ వైఖరినే ఆయన తన కుమార్తెకు కూడా నేర్పించారు. అందుకు ఈ సంఘటన ఓ ఉదాహరణ. ఓరోజు ఆయన తన గదిలో కూర్చుని ఏదో రాసుకుంటుండగా తన కుమార్తె ఏడుపు వినిపించింది. ఆయన వెంటనే గదిలోంచి బయటకు వచ్చి కుమార్తెను ఎత్తుకున్నారు. ఆమె కళ్లు తుడుస్తూ ''ఎందుకు ఏడుస్తున్నావు?'' అని అడిగారు. అప్పటికీ ఆమె ఏడుపు ఆపలేదు. పక్కింటి అబ్బాయితో ఆడుకుంటుండగా ఉన్నట్లుండి గొడవొచ్చి అతను తనను కొట్టాడని చెప్పింది. కనుక ఆ అబ్బాయిని కొట్టమని తండ్రితో చెప్పింది. కూతురు చెప్పిన మాటలన్నీ విన్న లియో టాల్‌స్టాయ్.. ''అమ్మాయ్ జరిగినదంతా సరేగానీ ముందు ఈ గ్లాసు పాలు తీసుకెళ్లి ఆ అబ్బాయికి ఇచ్చిరా'' అన్నారు. అబ్బాయిని కొట్టమంటే పాలు ఇవ్వమంటా డేంటీ తన తండ్రి అని మనసులో అనుకున్నా తండ్రి చెప్పినట్లే చేసింది ఆ అమ్మాయి. ఆమె ఇచ్చిన పాల గ్లాసు అందుకున్న అబ్బాయి ఆశ్చర్యపోయాడు. అప్పటివరకూ ఆమె మీద కోపంతో ఉన్న అబ్బాయి మనసు మార్చుకుని చిరునవ్వు నవ్వాడు. అలాగే కృతజ్ఞతలు కూడా చెప్పాడు. ఆ క్షణం నుంచి వారిద్దరూ మంచి మిత్రులయ్యారు.

> మన్నించడమనే గుణం ఎప్పుడూ మంచి ఫలితాలతో మంచి ముగింపు పలుకుతుందని లియో టాల్‌స్టాయ్ తన కూతురికి చెప్పారు.



లియో టాల్‌స్టాయ్

కోపం కన్నా మన్నించడమనే గుణం ఎప్పుడూ మంచి ఫలితాలతో మంచి ముగింపు పలుకుతుందని లియో టాల్‌స్టాయ్ తన కూతురికి చెప్పారు. అంతేతప్ప మనల్ని గాయపరిచారని ప్రతీకారంతో రగిలిపోవడం వల్ల సమస్య తీరకపోగా మరింత ఎక్కువవుతుందన్నారు. మన సద్గుణం ఎదుటివారిని ఎంతగానో ఆకట్టుకుంటుందని, మనపై ఏదైనా తగని తలంపు ఉన్నా దాన్ని రూపుమాపి మనతో మంచిగా మెలగడానికి పూనుకుంటారని చెప్పారు.

– యామిజాల జగదీశ్

సినిమా నాటి సంగతి

బొద్దుగా ఉన్నానని వద్దన్నారు!

రాధికా ఆప్టే

సినిమాలోనే కాదు సినిమా పూర్తయి బయటకు రావడం వెనుక కూడా ఓ పెద్ద కథే ఉంటుంది. స్క్రిప్ట్ స్టేజ్‌లో అనుకున్న వాళ్లు స్క్రీన్ మీదకు వచ్చే సమయానికి ఉండకపోవచ్చు. అస్సలు అనుకోని వాళ్లు కూడా అనుకోకుండా ప్రాజెక్ట్‌లో భాగమవచ్చు. ఇదంతా ఎందుకంటే బాలీవుడ్ సూపర్ హిట్ సినిమా 'విక్కీ డోనర్' సినిమాలో విచిత్రంగా అవకాశం కోల్పోయారట రాధికా ఆప్టే. ఈ విచిత్రమేంటో రాధికా ఆప్టే వివరిస్తూ – ''విక్కీ డోనార్' సినిమాలో హీరోయిన్‌గా ముందు నా పేరే అనుకున్నారు. ఆ సినిమా స్టార్ట్ అయ్యే కొన్ని రోజుల ముందు ఫారిన్‌కు హాలిడేకు వెళ్లాను. ఆ ట్రిప్‌లో నచ్చిన ఫుడ్‌ను కొంచెం ఇష్టాంగా తిన్నాను. దాంతో కాస్త బొద్దుగా అయ్యాను. లావయ్యానని మా టీమ్ కొంచెం అప్‌సెట్ అయ్యారు. తిరిగి వచ్చాక తగ్గిపోతాను అని చెప్పినా కూడా రిస్క్ చేయదలుచుకోలేదు. అలా ఆ సినిమా ఛాన్స్ మిస్ అయింది'' అని చెప్పారు ఆప్టే. ఈ సినిమాలో హీరోయిన్‌గా యామీ గౌతమ్ నటించిన సంగతి తెలిసిందే.

అజ్ఞాతం

నోటి మాటే నినాదం అయింది!

'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదం భగత్‌సింగ్‌ది.
'ఆకాశంలో సగం' అనే నినాదం విప్లవనేత మావోది.
'డూ ఆర్ డై' అనే నినాదం గాంధీజీది.
'మహిళల హక్కులూ మానవహక్కులే' అనే నినాదం.. ఎవరిది?
ఆ అజ్ఞాత నినాదకర్త గురించి చదవండి.

1984. జెనీవాలో యు.ఎన్. కాన్ఫరెన్స్ జరుగుతోంది. మానవ హక్కుల మీద చర్చ. ఇండియా నుంచి మాట్లాడ్డానికి మాలా పాల్ అనే ఆవిడ వెళ్లారు. ముగ్గురు పిల్లల తల్లి. ఆమె వంతు వచ్చింది. ''ఇండియాలో, ఇంకా అనేక ప్రపంచ దేశాల్లో మహిళలు కనీస హక్కులకు కూడా నోచుకోకుండా దుర్భరమైన జీవితం సాగిస్తున్నారు. మనం మానవ హక్కుల గురించి మాట్లాడుకుంటున్నాం. మహిళల హక్కులూ మానవ హక్కులేనని ఎందుకు గుర్తించలేకపోతున్నాం! ఉమెన్ రైట్స్ ఆర్ హ్యూమన్ రైట్స్ కాదా?!'' అన్నారు మాలా. ఆ మాటకు మాలా పక్కన ఉన్నావిడ గట్టిగా బల్లను చరిచి మాలాను సమర్థించారు. మరుక్షణం హాలంతా హర్షధ్వానాలు. మాలా పాల్ 'ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్' ప్రతినిధిగా ఆ సదస్సుకు హాజరు అయ్యారు. ఆ బల్లగుద్దిన ఆవిడ సెనెగల్ రాయబారి. కొన్ని వారాల తర్వాత ఐక్యరాజ్యసమితి.. మాలా అన్న మాటను తన అధికారిక నినాదంగా స్వీకరించింది. 'ఉమెన్ రైట్స్ ఆర్ హ్యూమన్ రైట్స్' అనే ఆ మాట అప్పట్నుంచి వాడుకలోకి వచ్చింది. ఏమిటి అంత పవర్ ఆ మాటలో! మహిళ కూడా మనిషేనని గుర్తు చేయడం. గుర్తు చేయవలసినంతగా మహిళల హక్కుల గురించి పట్టించుకోవడం మానేశాం అని చెప్పడం. 1995లో ఐక్యరాజ్యసమితి చైనా రాజధాని బీజింగ్‌లో నిర్వహించిన నాల్గవ ప్రపంచ మహిళా సదస్సులో ప్రసంగిస్తూ అప్పటి అమెరికా ప్రథమ మహిళ హిల్లరీ క్లింటన్ 'ఉమెన్ రైట్స్ ఆర్ హ్యూమన్ రైట్స్' అని అనడంతో అప్పట్నుంచీ అదొక పొలిటికల్-ఫెమినిస్ట్ నినాదం కూడా అయింది.

1984 అంటే ఇంటర్నెట్‌కు ముందు కాలం. అందుకే మాలా పాల్ అజ్ఞాతంగా ఉండిపోయారు. ఆమె నినాదానికి లభించిన ప్రాధాన్యం నినాదకర్తగా ఆమెకు గుర్తింపు లభించలేదు. అయితే గుర్తింపు కోసం మాలా నినదించలేదు. మహిళల హక్కులను మానవహక్కులుగా గుర్తించమని మాత్రమే అడిగారు. ప్రస్తుతం మాలా వయసు 87 సంవత్సరాలు. యాభైఏళ్ల పాటు విదేశాల్లో గడిపాక, భర్త మరణానంతరం జన్మభూమి జ్ఞాపకాలతో తిరిగి ఇండియా చేరుకుని ఢిల్లీలో ఉండిపోయారు. మాలా 1932లో లాహోర్‌లో జన్మించారు. ఆరుగురు తోబుట్టువులలో ఆఖరి బిడ్డ. తండ్రి ఇండియన్ సివిల్ సర్వీస్‌లో పనిచేసేవారు. అంత గొప్ప హోదా పిల్లలకీ గొప్ప జీవితాన్ని ఇచ్చింది. క్రమశిక్షణతో పెరిగారు. సిటీలోని టాప్ స్కూళ్లలో చదివారు. అయితే దేశ విభజనతో ఆ కుటుంబ పరిస్థితి తలకిందులయింది. 18వ ఏట మాలా పెళ్లయే వరకు వారు ఢిల్లీలోని బరోడా హౌస్‌కి అనుబంధంగా ఉన్న ఒక ఇంట్లో ఉన్నారు. మాలా భర్త డాక్టర్ రాజేందర్ పాల్ ఆమె కన్నా 13 ఏళ్లు పెద్ద. మలేరియాలజిస్టు. ఆయన వృత్తి జీవితమంతా పూర్తిగా విదేశాల్లోనే గడిచింది. భార్యాభర్తలు కెనడాలో ఉన్నారు. యు.ఎస్.లో ఉన్నారు. చివరికి స్విట్జర్లాండ్‌లో ఉండిపోయారు. అక్కడి ప్రపంచ ఆరోగ్య సంస్థ కార్యాలయంలో భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ తరపున మాలా భర్త వివిధ రకాలైన ప్రాజెక్టులలో తలమునకలై ఉండేవారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో ఉన్నప్పుడు మాలా 'ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్' (ఎ.ఐ.డబ్ల్యు.సి) వలంటీర్‌గా పని చేశారు. తర్వాత ఆ సంస్థకు ఐక్యరాజ్యసమితి గుర్తింపు రావడంతో సమితిలోని 'ఎకోసాక్' (ఎకనమిక్ అండ్ సోషల్ కమిషన్)లో శాశ్వత సభ్యురాలయ్యారు. ఎ.ఐ.డబ్ల్యు.సి. కి సమితి గుర్తింపు లభించడం అన్నది అప్పట్లో భారత్‌కు గర్వకారణమైన విషయం అయింది. అక్కడి నుంచి మాలా 'కాంగ్రెస్ ఆఫ్ నాన్ గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్' సంస్థకు వైస్-ప్రెసిడెంట్ అయ్యారు. ఆ హోదాలో మాలా అనేక సమస్యలపై ఐక్యరాజ్యసమితిలో పోరాటం జరిపారు. బాలికల హక్కుల పరిరక్షణ, పర్యావరణం, గృహ వసతి, వృద్ధాప్యం, ఆధ్యాత్మిక జీవనం వంటి అనేక ముఖ్యమైన అంశాలపై ఆమె ప్రభుత్వాల ఉదాసీనత్వాన్ని వేలెత్తి చూపేవారు. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన సూచనలు చేసేవారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఇంటర్నేషనల్ అలయెన్స్ ఆఫ్ ఉమెన్'లో కూడా మాలా సభ్యురాలు. సొంత ఖర్చుతో వెళ్లి అంతర్జాతీయ వేదికలపై ఆమె ప్రసంగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ కూడా ఇంటిని నడుపుతూనే. పిల్లల ఆలనా పాలనా చూస్తూనే. ఎప్పుడూ బిజీగా, అందుబాటులో లేకుండా ఉండే భర్తతో సర్దుకు వస్తూనే!

ప్రస్తుతం మాలా తన కుమార్తె దగ్గర ఉంటున్నారు. పిల్లల పిల్లలతో ఉల్లాసంగా గడుపుతున్నారు. వంట మనిషి కూతుర్ని మంచి స్కూల్లో చదివిస్తున్నారు. తనే స్వయంగా ఆ అమ్మాయికి పాఠాలు చెబుతుంటారు. 'ఆడపిల్లకు చదువే రక్షణ. చదువే భద్రత' అంటారు మాలా పాల్.

భర్త డాక్టర్ రాజేందర్ పాల్‌తో మాలా

ఢిల్లీలోని తన నివాస గృహంలో మాలా పాల్ (87)

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
1-7-2019

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేను టీచర్‌ని. సోస్టూడెంట్స్‌తో ఫ్రెండ్లీగా ఉంటాను. ట్యూషన్స్ కూడా చెబుతాను. నా ట్యూషన్‌లో ఓ అబ్బాయి జాయిన్ అయ్యాడు. అందరిలానే తనతో మాట్లాడే దాన్ని. తనకి తల్లి లేదు. ఈ ఫిబ్రవరి 14కి ఆ అబ్బాయి ఓ మాట చెప్పాడు. ''మీరు నా ఏజ్‌లో ఉంటే.. ప్రపోజ్ చేసేవాడ్ని'' అని. 'ఫీలింగ్స్ ఉన్నా.. అలా జరగదుగా.. నేను నీ మేడమ్‌ని కదా! ఫీలింగ్స్ కంట్రోల్ చేసుకో' అని చెప్పాను. కానీ తను మాత్రం ''నా వల్ల కావట్లేదు.. మీరే నా జీవిత భాగస్వామి కావాలని కోరుకుంటున్నాను.. మీ లైఫ్‌లోకి ఎవరు వచ్చినా నేను భరించలేను. వేరే వాడు మిమ్మల్ని తాకితే తట్టుకోలేను'' అన్నాడు. 'ఎందుకు ఇలా చేస్తున్నావ్? నన్ను పరీక్షిస్తున్నావా? ఎందుకు అబద్ధాలు చెబుతున్నావ్'అని కూడా అడిగాను. ''ఫిజికల్‌గా మీరు నాకు ముఖ్యం కాదు.. జస్ట్ నా లైఫ్‌లాంగ్ నాతో మీరు ఉండాలి'' అంటూ చాలా చెప్పాడు. అయినా నేను పట్టించుకోలేదు. 'డైలీ ఫోన్ మాట్లాడటం కుదరదు' అని చెప్పేశాను. ''నా ఫొటోస్ డిలీట్ చేసెయ్.. నా నంబర్ బ్లాక్ చెయ్యి'' అని చెప్పడానికి ఫోన్ చేస్తుంటే.. త్రీ మంత్స్ రివర్స్‌లో.. లిఫ్ట్ చేసి మాట్లాడకపోవడం, స్విచ్ ఆఫ్ చెయ్యడం, మెసేజ్‌కి రిప్లై ఇవ్వకపోవడం.. ఇలా చేశాడు. త్రీ మంత్స్ తర్వాత ఫోన్ లిఫ్ట్ చేసి.. ''నా మీద మీకు ఎలాంటి ఫీలింగ్ ఉందో తెలుసుకుందామని ఇలా చేశాను.. మీరు అంతకు ముందులా నాతో మాట్లాడటం కావాలి నాకు'' అన్నాడు. పైగా తనకి రెండు సార్లు నాతో ఫస్ట్‌నైట్ అవుతున్నట్లుగా కలలు కూడా వచ్చాయట. అసలు ఆ అబ్బాయి ఫీలింగ్స్ ఏంటి అన్నయ్యా?

– జోయా

నీలూ.. నేను ఉద్యోగం మానేస్తా! అమ్మో.. ఇలాంటి క్వశ్చన్‌కి చదువుతుంటేనే లబడబా.. డబలబా.. లబడబా.. డబలబదబదబా.. ఇక్కడ్నుంచి పారిపోవాలని ఉంది నీలూ..!

'సార్ మీరు ఏం టెన్షన్ పడొద్దు. వాడు మేడమ్‌ని పడేద్దామనుకుంటున్నాడు. వాడికి ప్రేమా దోమా ఏం లేదు. వాడు మేడమ్‌ని ఫిజికల్‌గా వాడుకుందామనుకుంటున్నాడు. మైండ్ గేమ్ ఆడి ఊబిలోకి దించుదామనుకున్నాడు.. ఉత్తి మెంటల్ కేసు సార్.. జోయా ఆ దరిద్రుడి నుంచి దూరం ఉండటమే క్షేమం. మళ్లీ డర్టీ వేషాలు వేస్తే వాళ్ల పేరెంట్స్‌కి చెబితే బెస్ట్. అయినా జోయా ప్రవర్తన కూడా కరెక్ట్ కాదు సార్.. వాడికి అనవసరంగా స్పేస్ ఇస్తుంది. ఇన్నాళ్లు దీన్ని సాగదీయడం జోయా తప్పు కూడా.. మీరేమి వర్రీ కావద్దు సార్.. మీ సిస్టర్ జోయా సేఫ్‌గా ఉంటుంది!'

అయినా నేను పోతున్నా..! పడలేను ఈ యాతన..!!

'సార్..! మార్కెట్‌లో మళ్లీ అరటిపండ్లు వచ్చాయి సార్.. ఇంకెక్కడికిపోతారు సార్??' అని నవ్వింది నీలాంబరి.

lovedoctorram@sakshi.com

ఈ పాటకు ట్యూన్ తెలుసా?

కుర్రవేయ్...దాచేయ్...

సాకీ :

నన్ను ప్రేమించే మగవాడివి నువ్వేనని
చెయ్యి కలిపే ఆ చెలికాడివి నువ్వేనని
నాకు అనిపించింది నమ్మకం కుదిరింది
అన్ని కలిసొచ్చి ఈ పిచ్చి మొదలయ్యింది

పల్లవి :

పడ్డానండి ప్రేమలో మరి
విడ్డూరంగా ఉందిలే ఇది
(2)

నిజంగా... నిజంగా...
ఇలా ఈరోజే తొలిసారిగా
॥పడ్డానండి॥

చరణం : 1

ఈ కాంతలోన దాగి ఉంది అయస్కాంతము
తన వైపు నన్ను లాగుతోంది
వయస్కాంతము
నీ చేతిలోన దాగి ఉంది మంత్రదండము
నువు తాకగానే చెంగుమంది
మగువ దేహము
ఇద్దరిదీ ఒకే స్థితి ఏమిటి ఈ పరిస్థితి
(2)
వలపు గుర్రమెక్కి వనిత చేయమంది స్వారీ
॥పడ్డానండి॥

చరణం : 2

నా ఈడు నేడు పాడుతోంది భామదండకం
నా ఒంటినిండ నిండి ఉంది ఉష్ణమండలం
నా పాత పెదవి కోరుతోంది కొత్తపానకం
నా అందమంత చూపమంది హస్తలాఘవం
కలిసుంటే ఏకాదశి కలబడితే ఒకే ఖుషి
(2)
వయసులోన ఉన్నోళ్ళకు
తప్పదీ స్వయంకృషి
॥పడ్డానండి॥

చిత్రం : స్టూడెంట్ నెం:1 (2001)
రచన : చంద్రబోస్
సంగీతం : ఎమ్.ఎమ్.కీరవాణి
గానం : ఉదిత్ నారాయణ్, చిత్ర

గోపీ, కిశోర్, శర్వానంద్, రామ్

సంక్రాంతికి శ్రీకారం

వచ్చే ఏడాది సంక్రాంతికి తన సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే కార్యక్రమాలకు హీరో శర్వానంద్ 'శ్రీకారం' చుట్టారు. ఆయన హీరోగా నటించనున్న కొత్త చిత్రం 'శ్రీకారం'. ఈ సినిమాతో కిశోర్ రెడ్డి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. 14రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుకుమార్ క్లాప్ ఇవ్వగా, ఎన్నారై శశికాంత్ వల్లూరి కెమెరా స్విచ్చాన్ చేశారు. రచయిత సాయిమాధవ్ బుర్రా స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్టు మొదటివారంలో ప్రారంభం కానుంది. మిక్కి జె. మేయర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు యువరాజ్ కెమెరామెన్. 'శ్రీకారం' చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... శర్వానంద్ కెరీర్‌లో హిట్ చిత్రాలుగా నిలిచిన 'ఎక్స్‌ప్రెస్‌రాజా'(2016), 'శతమానం భవతి' (2017) చిత్రాలు సంక్రాంతికి రిలీజైన విషయం తెలిసిందే. ప్రస్తుతం 'రణరంగం', '96' తెలుగు రీమేక్ సినిమాలతో బిజీగా ఉన్నారు శర్వానంద్.

నిర్ణయం నాదే

తాప్సీ

వరుస అవకాశాలతో బాలీవుడ్‌లో ఫుల్ బిజీగా ఉంటున్నారు హీరోయిన్ తాప్సీ. అయినప్పటికీ ఏడాదికి సౌత్‌లో కనీసం ఒక్క సినిమా అయినా చేస్తున్నారు. ఇటీవల ఆమె నటించిన 'గేమ్ ఓవర్' చిత్రం నటిగా మరింత పేరు తెచ్చిపెట్టింది. ఆమె క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సినిమా హిందీ వెర్షన్‌ని కూడా రిలీజ్ చేశారు. సౌత్‌లో సినిమాలు చేయడం గురించి తాప్సీ మాట్లాడుతూ –''ప్రస్తుతం హిందీ సినిమాలతో కాస్త బిజీగా ఉన్నా ఏడాదికి సౌత్‌లో ఓ చిత్రంలో నటించేలా ప్లాన్ చేసుకుంటున్నాను. మొదట్లో 'ఓ పెద్ద హీరో డేట్స్ మా దగ్గర ఉన్నాయి.. మీటు మంత్స్ డేట్స్ మాకు కావాలి' అని నిర్మాతలు అడిగేవారు. కానీ, హిందీ సినిమాల కోసం ఆరు నెలల ముందే నా డేట్స్ బుక్కైపోయి ఉంటాయి. కానీ, ఇప్పుడు నేను నటిస్తున్న సౌత్ సినిమాల్లో నేనే ప్రధానపాత్ర ధారిగా ఉంటున్నాను. స్క్రిప్ట్ నచ్చితే నా నిర్ణయం ప్రకారం డేట్స్‌ని బట్టి సినిమాలు ప్లాన్ చేసుకుంటున్నాను'' అని తాప్సీ అన్నారు.

అమలాపాల్

కామిని పోరాటం

అమలాపాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఆడై' (తెలుగులో 'ఆమె'). 'మేయాదమాన్' ఫేమ్ రత్నకుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆర్జే రమ్య, వివేక్ ప్రసన్న ముఖ్య పాత్రధారులు. విజ్జి సుబ్రమణియన్ నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అమలాపాల్ బోల్డ్ క్యారెక్టర్ చేశారు. ఆమె పాత్ర పేరు కామిని అని తెలిసింది. తాజాగా 'అడై' సినిమాను జూలై 19న విడుదల చేయనున్నట్లు అమలాపాల్ వెల్లడించారు. ''నేను పోరాడతాను. జీవిస్తాను. వచ్చిన అడ్డంకులు చిన్నవైనా, పెద్దవైనా ఎదుర్కొంటాను. నీ సంకల్ప బలం బలీయమైనది అయినప్పుడు నువ్వు విఫలమయ్యే అవకాశమే లేదు'' అని సినిమాలోని తన క్యారెక్టర్ ఎలా ఉండబోతోందో హింట్ ఇచ్చారు అమలాపాల్.

మా ఇద్దరి ఒప్పందం అదే

నందినీ రెడ్డి

''సాధారణంగా అందరం మన అమ్మలను టేకిట్ ఫర్ గ్రాంటెడ్‌గా తీసుకుంటాం. కసురుతాం.. విసుక్కుంటాం. అయినా అమ్మ మనకు చాలా ప్రేమను పంచుతారు. మన మందరం తల్లులకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదేమో? 'ఓ బేబీ' సినిమాలో ఈ పాయింట్‌ని చూపించాం. ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతారనే నమ్మకం ఉంది'' అని దర్శకురాలు నందినీ రెడ్డి అన్నారు. సమంత లీడ్ రోల్‌లో నాగశౌర్య, లక్ష్మీ, రాజేంద్రప్రసాద్, రావు రమేశ్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ బేబీ'. సునీత తాటి, వివేక్ కూచిభొట్ల నిర్మించారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తున్న ఈ సినిమా ఈ నెల 5న విడుదలకానుంది. నందినీ రెడ్డి పలు విశేషాలు పంచుకున్నారు.

● కొరియన్ చిత్రం 'మిస్. గ్రానీ' చూస్తున్నంత సేపు నేను చాలా కనెక్ట్ అయ్యాను. మదర్ సెంటిమెంట్ ఉంటుంది. అందరూ కనెక్ట్ అయ్యే కథ ఇది. కథలో క్వాలిటీ ఉంది. బెస్ట్ యాక్టర్స్ ఈ సినిమాలో పని చేశారు. లక్ష్మిగారు, రాజేంద్ర ప్రసాద్, రావు రమేశ్‌గారు, సమంత అందరూ తమ బెస్ట్ ఇచ్చారు. డైరెక్షన్‌లో నేను చేసిన చిన్నచిన్న తప్పులు కూడా వాళ్ల అద్భుతమైన యాక్టింగ్‌తో కవర్ చేసేశారు.

● ఆర్టిస్ట్‌కి కథ ప్లస్ అయ్యే సినిమాలు కొన్ని.. కథకు ఆర్టిస్ట్ ప్లస్ అయ్యే సినిమాలు మరికొన్ని. 'ఓ బేబీ' రెండు విభాగాల్లోకి వస్తుంది. ఈ సినిమాలో ఉన్న యాక్టర్స్ అందరూ విందు భోజనంలా ఉంటారు. సినిమాలో బేబక్క పాత్ర చాలా కీలకం. లక్ష్మీగారు అద్భుతంగా చేశారు. ఆమె ఒప్పుకోకపోయి ఉంటే ఈ సినిమాను చేసే వాళ్లం కాదేమో? ఈ పాత్రకు ఆప్యాయత, వెటకారం అన్నీ ఉండాలి. లక్ష్మీగారే కరెక్ట్ అని భావించాం.

● రీమేక్‌తో వచ్చిన చిక్కేంటంటే సినిమా సరిగ్గా రాకపోతే పాడు చేశారు అంటారు. హిట్ అయితే అలానే తీశారు.. హిట్ అయిపోయింది అంటారు. రీమేక్స్‌తో ఎక్కువ పేరు సంపాదించడం కొంచెం కష్టం. నా సినిమాలన్నీ 50 రోజుల్లోనే పూర్తి చేస్తాను. కానీ సినిమా సినిమాకు మధ్య గ్యాప్ ఎందుకొస్తుంది? అని అడుగుతుంటారు. ఒక్కోసారి ఐడియా స్టేజిలో బావుంటుంది. కథ రాశాక నచ్చకపోవచ్చు. అలా లేట్ అవుతూ సినిమా సినిమాకు గ్యాప్ వస్తుంది. ఈసారి నుంచి అలా జరగకుండా చూసుకుంటాను.

● ఈ సినిమాకు సమంత కేవలం యాక్టర్ గానే కాకుండా అన్ని బాధ్యతలూ చూసుకున్నారు. 'నువ్వేదైనా తప్పు చేస్తుంటే నేను చెబుతా.. నేనేదైనా తప్పు చేస్తే నువ్వు చెప్పు.. మన మధ్య ఈగో అనేది అడ్డురాకూడదు అని సినిమా స్టార్ట్ అవ్వక ముందే సమంత–నేను ఒప్పందం చేసుకున్నాం(నవ్వుతూ).

● దర్శకురాలిగా అన్ని రకాల సినిమాలు చేయాలనుంది. యాక్షన్ కామెడీ, స్పోర్ట్స్ సినిమాలు చేస్తాను. ప్రస్తుతం వైజయంతీ బ్యానర్‌లో ఓ సినిమా చేయాలి. రెండు కథలున్నాయి. అందులో మల్టీస్టారర్ సినిమా ఒకటి. వెబ్ సిరీస్‌ల ట్రెండ్ కూడా బాగా పెరుగుతోంది. ఇంకా స్టార్టింగ్ స్టేజిలోనే ఉంది. వెబ్ థియేటర్‌కి హాని చేస్తుందా? అంటే చెప్పలేం.

● 'ఓ బేబీ' సినిమా పూర్తయ్యాక అమ్మ మీద కసురుకోవడం కొంచెం తగ్గింది. ఒకవేళ బేబీలా నేను మళ్లీ వయసులో వెనక్కి వెళితే సినిమాలు కాకుండా వేరే ప్రొఫెషన్‌ని కూడా ట్రై చేస్తానేమో?

దోస్త్ మేరా దోస్త్

జాన్వీ కపూర్

బాలీవుడ్‌లో కొత్త దోస్తీ కహానీ త్వరలో షురూ కానుంది. కార్తీక్ ఆర్యన్, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా 'దోస్తానా 2' అనే చిత్రం తెరకెక్కనుంది. అభిషేక్ బచ్చన్, జాన్ అబ్రహాం, ప్రియాంకా చోప్రా ముఖ్య తారలుగా 2008లో వచ్చిన 'దోస్తానా' చిత్రానికి ఇది సీక్వెల్. కోలిన్ డుకున్హా దర్శకత్వం వహించనున్నారు. కరణ్ జోహార్ నిర్మించనున్నారు. త్వరలో చిత్రీకరణ మొదలు కానుంది. ఈ సినిమాలో జాన్వీ, కార్తీక్‌లతో పాటు మరో కొత్త హీరో నటించనున్నారు. అతను ఎవరు? అనే విషయాన్ని త్వరలో వెల్లడించనున్నారు. ప్రస్తుతం 'రుహ్ అఫ్జా, 'కార్గిల్ గాళ్' (వీరవనిత గుంజన్ సక్సెనా బయోపిక్) సినిమాలతో బిజీగా ఉన్నారు జాన్వీ కపూర్.

కార్తీక్ రాజు, సందీప్ కిషన్, అనన్య సింగ్, అనిల్ సుంకర, పి.కిరణ్, దయా పన్నెం

నా పని అయిపోయిందన్నారు

''అందరూ నన్ను నిర్మాత అంటుంటే కొత్తగా ఉంది. నన్ను నేను వెండితెరపై చూసుకుని రెండేళ్లు అవుతోంది. ఒక నటుడికి అది నరకం. సినిమా తప్ప ఇంకేదీ తెలియని నాలాంటి వాడికి పెద్ద నరకం'' అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'నిను వీడని నీడను నేనే'. అన్యా సింగ్ కథానాయిక. కార్తీక్ రాజు దర్శకుడు. దయా పన్నెం, సందీప్ కిషన్, విజి సుబ్రహ్మణ్యన్ నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై నిర్మాత అనిల్ సుంకర ఈ చిత్రాన్ని ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాతలు కిరణ్, అనిల్ సుంకర విడుదల చేశారు. సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''బ్రెయిన్ రీ ఫ్రెష్ కోసం విదేశాలకు వెళ్లి వచ్చా. ఇక్కడికొచ్చేటైమ్‌కి బాగా లావయ్యాను. బరువు తగ్గి సినిమాలు చేద్దామనుకునేటప్పటికి... మాకు బాగా కావలసిన ఇండస్ట్రీ వ్యక్తి కలిశారు. మాటల మధ్యలో మేనేజర్లు నా గురించి చెప్పబోతే... 'ఇంకెక్కడి సందీప్.. అయిపోయాడు. కొత్త హీరోలు వచ్చారు కదా. వాళ్ల గురించి చెప్పు' అన్నారట. ఆ మాట చెప్పిన వ్యక్తికి థ్యాంక్స్.. ఆయనపై నాకు ఎలాంటి కోపం లేదు. ఆయన అలా అనడం వల్లే ఎప్పటికీ గుర్తుండిపోయేలా, ఓ కసితో 'నిను వీడని నీడని నేనే' సినిమా చేశా. ఈ సినిమా బాగా ఆడితే కొత్తవాళ్లతో కూడా సినిమాలు తీస్తాం'' అన్నారు. ''కథ విని, నేనే ప్రొడ్యూస్ చేస్తానని సందీప్ చెప్పడం నాకు సర్‌ప్రైజ్'' అన్నారు కార్తీక్ రాజు. దయా పన్నెం. సహనిర్మాత సుప్రియ, అన్య సింగ్, మాటల రచయిత సాయ్రమాట్, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు శివ చెర్రీ, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలకు గుడ్‌బై

జైరా వసీమ్

కెరీర్ ఎంత వీలుంటే అంత లాంగ్‌గా ఉండాలని కోరుకుంటారు ఆర్టిస్టులు. కానీ పది సినిమాలు కూడా చేయని జైరా వసీమ్ సినిమాల నుంచి తప్పుకుంటున్నాను అని సంచలన స్టేట్‌మెంట్ ఇచ్చారు. 'దంగల్' సినిమాలో ఆమిర్ ఖాన్ కుమార్తె పాత్రలో హిందీ సినిమాలో కనిపించారు జైరా. ఆ తర్వాత 'సీక్రెట్ సూపర్‌స్టార్' సినిమాలో నటించారు. ''ఐదేళ్ల క్రితం నేను తీసుకున్న నిర్ణయం (యాక్టర్‌గా మారాలని) నా జీవితాన్ని మార్చేసింది. ఎంతో ప్రేమను, అభిమానాన్ని ఇచ్చింది. ఈ ఇండస్ట్రీకి నేను తగినదాన్ని అయినా ఇండస్ట్రీ నాకు తగదనిపిస్తోంది.. నా ప్రశాంతతను కోల్పోయే పని చేయదలుచుకోలేదు.. అందుకే ఇండస్ట్రీ నుంచి వైదొలగాలనుకుంటున్నాను'' అని తెలిపారు. ఇది వరకూ జైరా వసీమ్ పలుమార్లు బెదిరింపులకు గురయ్యారు. దీంతో ఈ నిర్ణయం తీసుకుని ఉంటారని ఇండస్ట్రీ టాక్.

నా స్టైల్ ఏంటో తెలియదు

ప్రశాంత్ వర్మ

''ఏ కథ తీసుకున్నా ముందు క్లైమాక్స్ రాసుకుంటాను. ముగింపు పూర్తయితే మిగతా కథను ఈజీగా రాసుకోవచ్చని నమ్ముతాను. కథ తయారవుతూ క్లైమాక్స్ కోసం ఎదురుచూస్తే ఆలస్యం అవుతుందనుకుంటాను. ముగింపు ఎలా ఉంటుందో తెలిస్తే కథను ఎలా అయినా అక్కడి వరకూ తీసుకెళ్లొచ్చు''అని ప్రశాంత్ వర్మ అన్నారు. రాజశేఖర్ హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి'. ఆదాశర్మ, నందితా శ్వేత, రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలు పోషించారు. సి. కల్యాణ్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం రిలీజైంది. ఈ సందర్భంగా ప్రశాంత్ వర్మ పంచుకున్న విశేషాలు...

● 'అ!, కల్కి' సినిమాలకు క్లైమాక్స్‌లో వచ్చే సన్నివేశాలే బలం. అలాగని అన్ని సినిమాల్లో క్లైమాక్స్ ట్విస్ట్ ఉండేలా ప్లాన్ చేయలేము. నెక్స్ట్ అనుకున్న కథలో ఇంటర్వెల్ బ్యాంగ్ సూపర్‌గా ఉండొచ్చు? అలాగే నా సినిమాలు ఇలానే ఉంటాయి అని ఆడియన్స్ కూడా ఓ ముద్ర వేయకూడదు. ప్రస్తుతానికి నా జానర్ ఏంటి? నా స్టైల్ ఏంటో నాకే తెలియదు. మెల్లిగా తెలుసుకుంటున్నాను.

● 'అ!' సినిమాకు మంచి అప్లాజ్ వచ్చింది కానీ పెద్ద ఆఫర్స్ రాలేదు. పెద్ద హీరోల సినిమాల్లో ఆఫర్ రావాలంటే చాలా విషయాలను పరిగణించాలి. వాళ్లను హ్యాండిల్ చేయగలనా? కమర్షియల్ ఎలిమెంట్స్ డీల్ చేస్తానా?అనేవి చూస్తారు. ఆ ఉద్దేశంతోనే 'కల్కి' లాంటి కమర్షియల్ సబ్జెక్ట్ టేకప్ చేశాను.

● 'కల్కి' కథను ముందు నేను డైరెక్ట్ చేయాలనుకోలేదు. స్క్రిప్ట్ పూర్తి స్థాయిలో తయారయ్యేసరికి నాకే మంచి ఎగ్జైటింగ్‌గా అనిపించింది. అలాగే స్క్రిప్ట్‌ను ఎలా డైరెక్ట్ చేయాలనుకున్నప్పుడు కొన్ని కమర్షియల్ సినిమాలు రిఫరెన్స్ కోసం చూశా. 'కేజీఎఫ్' లాంటి ట్రీట్‌మెంట్ అయితే బావుంటుందని స్టైలిష్‌గా తీశాం.

● నేను ఐటమ్ సాంగ్స్‌కు వ్యతిరేకిని. కానీ ఇలాంటి సినిమాలో ఉండాలి. అందుకే పెట్టడం జరిగింది. అన్ని సినిమాలు రివ్యూవర్స్‌కి నచ్చాలని లేదు. 'అ!' సినిమాకు బాగా రాశారు. ఈ సినిమా ఎవరి కోసం తీశామో వాళ్లు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఒకవేళ ఈ సినిమాకు నన్నే రివ్యూ రాయమన్నా తప్పులు బడతానేమో?

● రాజశేఖర్‌గారు షూటింగ్ స్పాట్‌కి లేట్‌గా వస్తారని విన్నాను. కానీ వాళ్ల ఫ్యామిలీతో వర్క్ చేయడం నాకు సౌకర్యంగానే అనిపించింది. సినిమా స్టార్ట్ అవ్వకముందు కొన్నిరోజులు వాళ్లతో ట్రావెల్ అయ్యాను. చాలా స్మూత్‌గా జర్నీ నడిచింది. వీళ్లను భరించొచ్చు అని ముందుకెళ్లిపోయా(నవ్వుతూ).

● శ్రావణ్ భరద్వాజ్ నాకు కాలేజ్ టైమ్ నుంచి ఫ్రెండ్. నేను తీసిన యావరేజ్ షార్ట్ ఫిల్మ్‌కి కూడా మంచి మ్యూజిక్ ఇచ్చేవాడు. ఇప్పుడు మా అందరి కంటే తనకే మంచి పేరొస్తుంది.

● 'దటీజ్ మహాలక్ష్మీ' సినిమా దర్శకుడు తప్పుకోవడంతో నేను జాయిన్ అయ్యాను. 31రోజుల్లో మొత్తం రీషూట్ చేశాను. దర్శకుడిగా క్రెడిట్ ఉండకూడదనేది అగ్రిమెంట్. 'కల్కి' స్టార్ట్ అవ్వడానికి టైమ్ ఉందనడంతో ఆ సినిమా పూర్తి చేశాను. రీమేక్ సినిమా చేయడం కూడా ఓ ఎక్స్‌పీరియన్స్.

● ప్రస్తుతానికి కథలైతే సిద్ధంగానే ఉన్నాయి. 'కల్కి' సినిమా థియేట్రికల్ రన్ పూర్తయ్యాక కలెక్షన్స్ అన్నీ చూసి నెక్స్ట్ సినిమా ఏంటో అనౌన్స్ చేస్తా. హాట్‌స్టార్ వాళ్లకి ఓ వెబ్ సిరీస్ డైరెక్ట్ చేస్తున్నాను. ఫ్యామిలీ థ్రిల్లర్. ఇప్పటి వరకు అలాంటి కథ రాలేదు.

నేలపై నిద్ర

ఎమ్మా స్టోన్

హాలీవుడ్ సూపర్ నటి ఎమ్మా స్టోన్ నేలపై నిద్రపోతున్నారట. రెండేళ్ల క్రితం ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం తీసుకున్న నటిగా గుర్తింపు పొందిన ఈ హీరోయిన్‌కు ఎందుకు ఇంత కష్టం వచ్చిందంటే... అక్కడికే వస్తున్నాం. ఇటీవల ఆమె భుజానికి పెద్ద దెబ్బ తగిలిందని హాలీవుడ్ టాక్. దీంతో డాక్టర్ ఆమెకు దాదాపు రెండు నెలలు రెస్ట్ తీసుకోమని చెప్పారట. అలాగే నేలపై నిద్రపొమ్మని చెప్పారట. స్టార్ నటిగా ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న ఎమ్మాకు ఎంత కష్టం వచ్చిందని ఆమె ఫ్యాన్స్ బాధపడిపోతున్నారు. ప్రస్తుతం 'క్రూయెల్లా' అనే హాలీవుడ్ మూవీ కమిట్ అయ్యారు ఎమ్మా. అయితే ఇంకా ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌లో ఉండటంతో ఎమ్మా గాయం ఈ సినిమాపై పడే ప్రభావం లేదంటున్నారు ఆమె సన్నిహితులు. ఇంతకీ ఎమ్మా భుజానికి ఎలా గాయం అయిందీ అంటే.. కొందరేమో షూటింగ్ లొకేషన్లో అని, కొందరేమో ఇంట్లో జారిపడ్డారని అంటున్నారు.

ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సి.కల్యాణ్

సి.కల్యాణ్

'తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్' అధ్యక్షుడిగా నిర్మాత సి.కల్యాణ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో 'మన కౌన్సిల్–మన ప్యానెల్' విజయం సాధించింది. నూతన అధ్యక్షుడు సి.కల్యాణ్ మాట్లాడుతూ– ''ఈ ఎన్నికలు సజావుగా జరగడానికి సహకరించిన వారికి, గెలిపించిన ప్రతి ఒక్కరికీ మా మన ప్యానెల్ తరపున ధన్యవాదాలు. మా మీద ఈర్ష్యతోనే, బాధతోనో, కోపంతో, మరేదో ఇబ్బందుల్లో ఉండటం వల్లో ఈరోజు ఓటింగ్‌కి రాలేకపోయిన వారికి కూడా థ్యాంక్స్. ఎలాంటి ఎన్నికలు లేకుండా ఆర్గనైజేషన్ విడిపోయింది. దాన్ని ఒకటిగా కలుపుదామనే సదుద్దేశంతో నేను, ప్రసన్నకుమార్, ఆది శేషగిరిరావు, మల్టీడైమన్షన్ రామ్మోహన్‌రావు గారు, చదలవాడ శ్రీనివాసరావుగారితో చర్చించి అందరం ఒక తాటిపై ఉండాలని నిర్ణయించుకున్నాం. పదవీ వ్యామోహమో ఏమో కానీ.. ఓ ఆర్గనైజేషన్ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి కనీసం డిపాజిట్లు కూడా రాబట్టుకోలేకపోయాడు'' అన్నారు.

కొత్త కమిటీ ఇదే...

సి.కల్యాణ్ అధ్యక్షుడిగా ఎన్నికవగా, ఉపాధ్యక్షులుగా కె.అశోక్‌కుమార్, వై.వి.ఎస్.చౌదరి, కార్యదర్శిగా టి.ప్రసన్నకుమార్, జాయింట్ సెక్రటరీగా మోహన్ వడ్లపట్ల, ట్రెజరర్‌గా చదలవాడ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా కె.అమ్మిరాజు, అశోక్‌కుమార్ వల్లభనేని, బండ్ల గణేశ్, ఆచంట గోపీనాథ్, పల్లి కేశవరావు, శివలెంక కృష్ణప్రసాద్, జి.వి.నరసింహారావు, ఎస్.కె.నయీమ్ అహ్మద్, పరుచూరి ప్రసాద్, టి.రామసత్యనారాయణ, వి.సాగర్, వజ్జా శ్రీనివాసరావు, పి.సునీల్‌కుమార్ రెడ్డి, కామిని వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు గెలుపొందారు.

చిన్ని అపోహ

మేఘనా చౌదరి

''ఈ విశ్వంలో మానవ సృష్టి అత్యంత కీలకమైనది. ప్రేమ, పెళ్లి, శోభనం.. అన్నీ విజయవంతంగా జరగాలి. పెళ్లి తర్వాత ఓ చిన్న అపోహతో భార్యాభర్త మధ్య ఎలాంటి ఎడబాటు ఎదురవుతుంది? అది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుంది?'' అన్నది మా 'అపోహ' సినిమా కథాంశం అని దర్శక–నిర్మాత కులదీప్ అన్నారు. కులదీప్, స్వాతినాయుడు, మేఘనాచౌదరి ముఖ్య పాత్రల్లో కళాదీపిక సినీ క్రియేషన్స్ పతాకంపై కులదీప్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. కులదీప్ మాట్లాడుతూ– ''గొప్ప ఎమోషనల్ ఫీలింగ్స్‌తో రూపుదిద్దుకున్న చిత్రమిది. ప్రతి యువతీ, యువకులు మా సినిమా చూసి, అపోహలను పూర్తిగా తొలగించుకునేలా ఉంటుంది. త్వరలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మల్లి, సంగీతం: అర్జున్.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
1-7-2019

పరిచయం డాక్టర్ అనగాని మంజుల

వైద్యనాడీమణి

రోగికి మందులు ఎంత ముఖ్యమో, మందులు రాసే డాక్టర్ మాటలు అంతకన్నా ముఖ్యం. మాటలతోనే సగం అనారోగ్యాన్ని తగ్గించవచ్చు.. డాక్టర్‌కి ఓపిక ఉంటే! అయితే "ఓపిక... ఉండటం కాదు.. ఉండాలి" అంటారు డాక్టర్ అనగాని మంజుల. నాడిని చూసి డాక్టర్ ఏం తెలుసుకున్నారో.. దానిని రోగికి తెలియజెప్పాల్సిన బాధ్యత ఉందని కూడా అంటున్న డాక్టర్ మంజుల వైద్య ప్రస్థానం.. ఆమె మాటల్లోనే..!

నేను ఈ ప్రొఫెషన్‌లోకి రావడానికి నా డ్రాయింగ్ స్కిల్ కూడా ఒక కారణమే. బొమ్మలు బాగా వేసే దాన్ని. దాంతో నా సైన్స్ బుక్ చాలా చక్కగా ఉండేది. ఆ కారణంగానే ఆ టీచర్ నన్ను పాంపర్ చేసేవాళ్లు. ఫోర్త్ క్లాస్ వయసులో ఏ టీచర్ మనల్ని బాగా దగ్గరకు తీస్తుంటే ఆ టీచర్ మీద ఇష్టం ఏర్పడుతుంది. ఆ ఇష్టం ఆ సబ్జెక్ట్ మీదకు కూడా మళ్లుతుంది. అలా సైన్స్ బొమ్మలు నన్ను జీవితకాలం మానవదేహానికి సేవ చేసే భాగ్యాన్ని కలిగించాయి.

నేను పుట్టింది పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట వేమవరం. అది మా అమ్మమ్మ గారి ఊరు. బాల్యం విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే. విజయనగర్ కాలనీ సెయింట్ ఆన్స్ స్కూల్, కాలేజ్ సెయింట్ ఫ్రాన్సిస్, మెడిసిన్ గాంధీ మెడికల్ కాలేజ్, పీజీ ఉస్మానియాలో. నాకు ఒక అన్నయ్య, ఒక తమ్ముడు, ఒక చెల్లి ఉన్నారు. చెల్లి కూడా డాక్టరే.

అమ్మాయంటే డాక్టర్ లేదా టీచర్

ఎనభైల తొలినాళ్లలో అమ్మాయిలకు సమాజం ఆమోదించిన ప్రొఫెషన్‌లు రెండే రెండు... డాక్టర్ లేదా టీచర్. నాకు మెడిసిన్ మీద ఇష్టం కలిగింది. అయితే అప్పట్లో మెడిసిన్ ఆప్షన్ తీసుకున్న అమ్మాయిలకు మరొక ఆంక్ష కూడా ఉండేది. మెడిసిన్‌లో సీటు తెచ్చుకోకపోతే ఇక చదివించడం ఉండదు, పెళ్లి చేసేయడమే. మా నాన్న హెచ్చరిక కూడా అదే. అలా భయపెట్టి వదల్లేదాయన. ఫిజిక్స్ కోసం ట్యూషన్ పెట్టించారు. అప్పట్లో మాకు 'సొంతంగా చదువుకోలేని మొద్దులే ట్యూషన్‌కెళ్తారని' ట్యూషన్‌కెళ్లే స్టూడెంట్స్ మీద చిన్న చూపుండేది. అది తప్పని, వజ్రం అయినా సరే సానబెడితేనే మెరుస్తుందని వాళ్ల ఫ్రెండ్ చేత నాకు నచ్చ చెప్పించారాయన. కొంత మొండిగా ఉండే వయసు కదా అది. ఇంట్లో వాళ్లు చెప్పిన మాట నచ్చదు. ట్యూషన్‌కెళ్లమని నన్ను మందలించకుండా.. ఆ స్థితిని ఆయన అంత సున్నితంగా డీల్ చేశారు. ఆ తరవాత నాకు ఎగ్జామ్ ప్రిపరేషన్, ఎంట్రన్స్ ప్రిపరేషన్, ఇంటర్వ్యూకి ప్రిపరేషన్, వైవాకి ప్రిపేర్ కావడంలో తేడా అర్థమైంది. ఆ తేడా తెలిస్తే లైఫ్‌లో ఇక వెనుకడుగు వేయాల్సిన అవసరమే రాదు.

డాక్టర్ డిసిప్లిన్

డాక్టర్‌కి డిసిప్లిన్ చాలా ముఖ్యం... అని నాన్న ఫ్రెండ్ డాక్టర్ పిఎస్ మూర్తి గారు చెప్పారు. నేను రోజూ ఈవెనింగ్ ఆయన క్లినిక్‌లో కూర్చునేదాన్ని. 'డాక్టర్ కన్సల్టేషన్ టైమ్ సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది అని బోర్డు మీద రాస్తే ఆ టైమ్‌లో డాక్టర్ క్లినిక్‌లో ఉండి తీరాల్సిందే, పేషెంట్‌లు వచ్చినా రాకపోయినా డాక్టర్ మాత్రం సీట్‌లో ఉండాలి' అని చెప్పారాయన. నేను ఇప్పటికీ పాటిస్తున్న నియమం, నా స్టూడెంట్స్‌కి ఇచ్చే సూచన కూడా అదే.

ప్రయోగాలు చేయాల్సిందే

ఓ ముప్పయ్ ఏళ్ల కిందట కూడా లేడీ డాక్టర్ అంటే డెలివరీలు చేయడానికే, సర్జరీ అవసరమైతే మగడాక్టర్ల దగ్గరకు వెళ్లాల్సిందే అనే ధోరణి ఉండేది. ఆ పాత్‌ను మా తరం సమర్థవంతంగానే బ్రేక్ చేసింది. అనాటమీ మీద ఆసక్తి ఉండే వాళ్లు సర్జరీ వైపే మొగ్గుచూపుతారు. అలా నేను సర్జన్‌ని అయ్యాను. అయితే వైద్య రంగంలో ప్రయోగాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలి. వైద్య రంగం విస్తృతమైన పరిశోధనలతో రోగాలను తగ్గించడానికి రకరకాల సొల్యూషన్స్‌ను చెప్పింది, చెప్తూనే ఉంటుంది. అయితే ఇప్పటి వరకు మన దగ్గర ఉన్న సొల్యూషన్ ఫ్రేమ్‌లో ఇమడని సమస్యలు కూడా వస్తుంటాయి. అలాంటప్పుడు ఆ పేషెంట్ కోసం... అందుబాటులో ఉన్న టెక్నాలజీని ఉపయోగించి కొత్త పరిష్కారాన్ని ఆలోచించాలి. అంతే తప్ప అప్పటి వరకు వాడుకలో ఉన్న ఏదో ఒక సొల్యూషన్ ఫ్రేమ్‌లో ఇమిడ్చేసే ప్రయత్నం చేయకూడదు. గతంలో చాలా మంది డాక్టర్లు గర్భాశయ సమస్యలు వచ్చిన మహిళలకు గర్భాశయాన్ని తొలగించడమే పరిష్కారం అన్నట్లు వైద్యం చేసేవాళ్లు. కొన్ని ఊర్లలో అయితే గర్భకోశం ఉన్న మహిళల కంటే యూటిరస్ తీసేసిన వాళ్లే ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనాల్లో తెలిసింది. అలాంటి పరిస్థితిని విజయవంతంగా బ్రేక్ చేయగలిగాను. గర్భసంచిని తొలగించకుండా సమస్యకు వైద్యం చేయడంతోపాటు, ఆ విషయంలో సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో కూడా సఫలం అయ్యాను.

సర్జరీలన్నీ లాప్రోస్కోపీతోనే

లాప్రోస్కోపీ విధానం అందుబాటులోకి వచ్చిన తర్వాత చాలాకాలం వరకు ఆ టెక్నాలజీని ట్యూబెక్టమీకి మాత్రమే వాడేవారు. గర్భాశయంలో ఎడరయ్యే సమస్యలతోపాటు మరికొన్ని ఇతర సమస్యలకు కూడా లాప్రోస్కోపీలోనే సర్జరీ చేయడాన్ని ప్రోత్సహించాను. ముఖ్యంగా ఆడవాళ్లు ఇంట్లో అందరి గురించి పట్టించుకుంటారు కానీ తమ ఆరోగ్యాన్ని పట్టించుకోరు. అలాంటి వాళ్లకు ఓపెన్‌సర్జరీలు చేస్తే తగినంత రెస్ట్ తీసుకోకుండా ఇంటి పనులు చేసి ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకుంటుంటారు. బయట పనులకు వెళ్లే వాళ్లు కూడా నెలల పాటు విశ్రాంతి తీసుకుంటే ఆర్థికంగా కుటుంబం గడవక పనులకు పోయేవాళ్లు. అలాంటి వాళ్లందరికీ లాప్రోస్కోపీ మంచి పరిష్కారం అయింది. అంతే కాకుండా మనదేశంలో మహిళల్లో రక్తహీనత ఎక్కువ. ఓపెన్ సర్జరీల్లో రక్తం ఎక్కువ పోతుంది. దానిని అరికట్టడానికి కూడా లాప్రోస్కోపీ మెథడ్ బాగా ఉపయోగపడింది. ఫైబ్రాయిడ్స్ ఉంటే గర్భాశయాన్ని తొలగిస్తున్న దశ నుంచి లాప్రోస్కోపీ ద్వారా కణుతులను మాత్రమే తొలగించే విధానాన్ని డెవలప్ చేయగలిగాం. ఫైబ్రాయిడ్స్ కారణంగా యుటిరస్ రప్చర్ అయిన కేసుల్లో కూడా ఫైబ్రాయిడ్‌ను మాత్రమే తొలగించి యుటిరస్‌ను గర్భధారణకు అనుగుణంగా పరిరక్షించిన సందర్భాలున్నాయి.

నేడు డాక్టర్స్ డే

జ్ఞాపకశక్తి నాకు దేవుడిచ్చిన వరం

ఇరవై ఏళ్ల నాడు నా దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకున్న పేషెంట్ ఈ రోజు వచ్చినా సరే... ఆమె పేరు తోపాటు ఆమె కేస్ మొత్తం గుర్తుకు వస్తుంది. అంతటి జ్ఞాపకశక్తి దేవుడిచ్చిన వరం మాత్రమే. నా ప్రొఫెషన్, నా ప్యాషన్ రెండూ వైద్యమే. దాంతో పర్సనల్ స్పేస్ అంటూ మరొకటి లేదు నాకు. ఎంత మంది పేషెంట్‌లను చూసినా విసుగు రాదు, ఓపిక తగ్గదు. అంత సేపూ ఎనర్జిటిక్‌గానే ఉంటాను, కానీ ఇంటికి వెళ్లీ వెళ్లగానే... అలా పడిపోతాను.

డాక్టర్ పేషెంట్ కావాలి

ప్రతి డాక్టర్ కూడా తన జీవితంలో కనీసం ఒక్కసారైనా జబ్బు పడి తీరాలంటాను(నవ్వుతూ). పేషెంట్‌గా మరొక డాక్టర్ దగ్గరకు వెళ్లి తన వంతు వచ్చే వరకు ఎదురు చూడడం అనుభవంలోకి రావాలి. ఎదురు చూసేటప్పుడు పేషెంట్‌కు కోపం రావడం కూడా సహజమే. అది కూడా తెలిసి రావాలి. అప్పుడు తన దగ్గరకు వచ్చిన పేషెంట్‌ల ఎదురు చూపును గౌరవించడం అలవడుతుంది. తన దగ్గరకు వచ్చిన పేషెంట్‌లలో అత్యవసర స్థితిని గమనించి వారిని ముందుగా పరీక్షించడం అలవాటవుతుంది. అలాగే కొత్త టెక్నాలజీ వస్తే దానిని గుడ్డిగా వ్యతిరేకించకూడదు, అలాగని ముందు వెనుక ఆలోచించకుండా దానిని వాడుకలో పెట్టేయాలనీ చూడకూడదు. పాశ్చాత్యదేశాల్లో పరిస్థితులకు అనుగుణంగా రూపొందిన యంత్ర పరికరాలను మన వాతావరణానికి, జీవనశైలికి తగినట్లు అన్వయించుకుని పరీక్షించుకోవాలి. నా పేషెంట్‌లకు ఇది పనికొస్తుందా లేదా అని విశ్లేషించుకోవాల్సింది డాక్టరే.

మాట కూడా మందే

డాక్టర్ మాట బాగుంటే పేషెంట్‌ల అనారోగ్యం సగం తగ్గిపోతుంది. పేషెంట్‌కి వాళ్ల హెల్త్ కండిషన్ గురించి పూసగుచ్చినట్లు వివరించాలి. అందుకు చేయాల్సిన వైద్యం ఏమిటో చెప్పాలి. ఏదీ దాచకూడదు. ఒకవేళ కొత్త టెక్నిక్‌ని అమలు చేయాల్సి వస్తే దాని గురించి కూడా చెప్పి తీరాలి. అప్పుడే డాక్టర్ మీద నమ్మకం కలుగుతుంది. ఒక్కో పేషెంట్‌కీ అంతంత సమయం కేటాయించలేనప్పుడు డాక్టర్స్ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి. నేను పాటిస్తున్న విధానమూ అదే. ప్రాథమికంగా నేను కొంత వివరించిన తర్వాత మా టీమ్‌లో మరో డాక్టర్ దగ్గరకు పంపిస్తాను. వాళ్లు పేషెంట్ సందేహాలన్నింటినీ తీరుస్తారు. చివరగా నా దగ్గరకు పిలిచి ఇంకేమైనా సందేహాలున్నాయా అని అడుగుతాను. అలా పేషెంట్‌కు సంతృప్తి కలిగే వరకు మాట్లాడాలి.

అమ్మాయి వద్దంది

మా అమ్మాయి మెడిసిన్ అంటే పదకొండేళ్లు చదువుతూనే ఉండాలి, నాకిష్టం లేదు... అన్నది. నిజానికి పాపాయికి తెలియని సంగతేమిటంటే డాక్టర్ అయ్యే వరకు చదివే చదువు మాత్రమే సరిపోదు. డాక్టర్ తన జీవితమంతా చదువుతూనే ఉండాలి. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ తనను తాను ట్రైనప్ చేసుకుంటూ ఉండాలి. అందుకే ఇష్టం లేని వాళ్లను ఈ పట్టాలెక్కించకూడదు. మెడిసిన్ బలవంతంగా చదివిస్తే ఒంటపట్టేది కాదు. తాని ప్పుడు యుఎస్‌లో ఫైనాన్స్, ఫైనాన్షియల్ అడ్వైజర్ కోర్సు చదువుతోంది. ఆమె పుట్టినప్పటి నుంచి ఆమె స్కూలు, కాలేజీలకు అనుగుణంగా నేను హాస్పిటళ్లు మారుతూ వచ్చాను. ఇప్పుడామె యుఎస్ వెళ్లిన తర్వాత ఆ వెలితిని నా పెయింటింగ్ హాబీతో భర్తీ చేసుకుంటున్నాను. దశాబ్దాల విరామం తర్వాత బ్రష్ పట్టుకున్నాను. మా హజ్బెండ్ ఫార్మాసుటికల్ కంపెనీలో క్వాలిటీ ఎనలిస్ట్. మా ఇద్దరి ప్రపంచాలు దగ్గరగా అనిపిస్తాయి, కానీ రెండింటి మధ్య స్పష్టమైన విభజన రేఖ కూడా ఉంటుంది. డాక్టర్‌గా జీవించడంలో ఉన్న సంతృప్తిని క్షణక్షణం ఎంజాయ్ చేస్తున్నానని మరోసారి చెప్తున్నాను.

ఇంటర్వ్యూ: **వాకా మంజులారెడ్డి**

ఫొటోలు: **జి. బాలస్వామి**

గిన్నిస్ కు ఎక్కిన సర్జరీ

బీదర్ నుంచి ఒకమ్మాయి వచ్చింది. ఆమెకింకా పెళ్లి కాలేదు. మనిషిని చూస్తే నిండు గర్భిణిలా ఉంది. పదడుగులు నడిస్తే ఆయాసం, సరిగ్గా కూర్చోవడమూ కష్టమే. ఆఖరుకు పడుకున్నా కూడా ఊపిరాడని స్థితికి వచ్చేసింది. అప్పుడు ఎవరో తెలిసిన వాళ్లు చెప్పడంతో ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఆమెకు గర్భాశయంలో కణితులున్నాయి. గర్భసంచి తొలగించడం ఒక్కటే మార్గం అని చెప్పార్ట అప్పటి వరకు ఆమెను పరీక్షించిన డాక్టర్లందరూ. ఆమె గర్భాశయంలో 84 కణితులున్నాయి. గర్భాశయానికి ఎటువంటి ఇబ్బంది కలగనివ్వకుండా, ఒకే సర్జరీలో అన్ని కణుతులను తొలగించగలిగాను. ఈ సర్జరీ గిన్నిస్ బుక్‌లో రికార్డ్ అయింది. ఆ తరవాత ఆ అమ్మాయి పెళ్లి చేసుకుంది. మామూలుగానే గర్భం దాల్చింది. పిల్లల్ని కని సంతోషంగా ఉంది.

సంతృప్తినిచ్చిన మరొక సందర్భం పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక కావడం. నాకు పద్మశ్రీ వచ్చినప్పుడు కేర్ హాస్పిటల్‌లో ఉన్న తోటి డాక్టర్లందరూ తమకే వచ్చినంతగా సంతోషపడ్డారు. 'యూ ట్రూలీ డిజర్వ్‌డ్' అన్నారు. ఆ మాట పద్మశ్రీ పురస్కారం కంటే పెద్ద ప్రశంస. మా పేషెంట్‌లు కూడా సంతోషించారు. వాళ్ల మనసుల్లో నాకు అంతటి స్థానం లభించడమే అత్యంత విశిష్టమైన పురస్కారం.

- డాక్టర్ అనగాని మంజుల,
పద్మశ్రీ అవార్డు గ్రహీత

పరి పరిశోధన

ఈ బూజు మహా గట్టిది!

భూమికి సుమారు 400 కిలోమీటర్ల ఎత్తులో ఎగురుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో పెరుగుతున్న బూజు రేడియోధార్మికతను బాగా తట్టుకోగలదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది ఎంత శక్తిమంతమైందంటే.. మనిషిని చంపేసే స్థాయి ఎక్స్ రే కిరణాల కంటే 200 రెట్లు ఎక్కువ రేడియోధార్మికతను తట్టుకునేంత! జర్మనీలోని కొలోన్‌కు చెందిన జర్మన్ ఏరోస్పేస్ సెంటర్ శాస్త్రవేత్తలు ప్రయోగపూర్వకంగా ఈ విషయాన్ని నిర్ధారించారు.

భవిష్యత్తులో గ్రహాంతర ప్రయాణాలకు ఉపయోగించే అంతరిక్ష నౌకలను శుద్ధి చేయడం చాలా కష్టం కానుందని అంచనా. సినిమాల్లో మాదిరిగా అంతరిక్ష నౌకలు అంత స్వచ్ఛంగా ఏమీ ఉండవని.. సీల్ చేసిన గదుల్లో పనిచేస్తూండటం వల్ల అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో చెమటతో తడిచిపోయిన వ్యోమగాముల వల్ల బూజులాంటివి ఏర్పడుతూంటాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్ర

వేత్త కోర్టెసో తెలిపారు. ఇలా ఏర్పడిన బూజులో రెండు రకాలైన అస్పెర్‌గిలస్, పెన్సిలియంలపై తాము పరిశోధనలు చేశామని ఎక్స్‌రే కిరణాలను ప్రయోగించినా.. శక్తిమంతమైన అతినీలలోహిత కిరణాలను వాడినా ఈ ఫంగస్ నశించిపోలేదని తెలిపారు. వెయ్యి గ్రేల ఎక్స్ రే కిరణాలు, 500 గ్రేల యూవీ కిరణాలను కూడా ఈ ఫంగస్ తట్టుకుందని చెప్పారు. ఎక్స్ రే కిరణాల మోతాదు 5 మోతాదు దాటితే మనిషి మరణిస్తాడని చెప్పారు. ఇక అంగారక యాత్ర సమయంలో వ్యోమగాములు ఎదుర్కొనే ఎక్స్ రే కిరణాల తీవ్రత 0.7 గ్రే గా ఉంటుందని వివరించారు. ఇంత బలంగా ఉండే ఫంగస్‌ను అంతరిక్ష నౌకల్లో ఇతర ప్రయోజనాల కోసం పెంచుకోవచ్చునని. యాంటీబయాటిక్స్, విటమిన్లను తయారు చేసుకునేందుకు వాడుకోవచ్చునని కొర్టెసో తెలిపారు.

కాస్మటాలజి కౌన్సెలింగ్

ఈ వయసులో మళ్లీ మొటిమలు... పరిష్కారం సూచించండి

నా వయసు 28 ఏళ్లు. కొద్ది నెలలుగా తరచూ మొటిమలు వస్తున్నాయి. వాటి కారణంగా ఏర్పడ్డ మచ్చలతో ముఖం చూడ్డానికి బాగాలేదు. కాంతి విహీనంగా కూడా మారింది. అప్పట్లో ఇంటర్మీడియట్ చదివేటప్పుడు నాకు మొటిమలు విపరీతంగా వచ్చేవి. ఆ తర్వాత ఆ సమస్య తొలగిపోయింది. కానీ ఇప్పుడు టీనేజ్‌లోలాగా మళ్లీ మొటిమలు రావడం ప్రారంభమైంది. నా సమస్యకు పరిష్కారాన్ని సూచించండి.

- డి. నిర్మల, సిద్ధిపేట

యుక్తవయసులోకి ప్రవేశించేటప్పుడు యువతీ యువకుల్లో సాధారణంగా ఈ మొటిమల సమస్య బాధిస్తుంటుంది. మొటిమలు మళ్లీ మళ్లీ రావడానికి అనేక కారణాలుంటాయి. ఉదాహరణకు మహిళల్లో హార్మోన్‌ల ప్రభావం, ప్రీ-మెనుస్ట్రువల్ సిండ్రోమ్ వంటి కారణాల వల్ల మొటిమలు వస్తుంటాయి. అంతేగాక... ఆహారపు అలవాట్లు కూడా ఈ సమస్యకు ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అంటే మనం తీసుకునే ఆహారంలో నూనెలు, కొవ్వుల పాళ్లు ఎక్కువగా ఉండటం వంటివి అన్నమాట. మీకు ఏర్పడ్డ మచ్చలు కూడా మీకు వచ్చిన మొటిమల తీవ్రతను బట్టి కొన్ని నెలల పాటు ఉండిపోతాయి. అయితే మీ విషయంలో మీకు ఏ కారణంగా మొటిమలు వచ్చాయన్న అంశంతో పాటు మరికొన్ని వ్యక్తిగత అంశాలను పరిగణనలోకి తీసుకొని, దానికి అనుగుణంగా చికిత్స సూచించాల్సి/చేయాల్సి ఉంటుంది. ఒకసారి మీకు దగ్గర్లో ఉన్న కాస్మటాలజిస్ట్‌ను సంప్రదించండి.

హెయిర్‌స్ట్రెయిటెనింగ్‌తో జుట్టు రాలుతుందా?

నా వయసు 25 ఏళ్లు. రెండు నెలలుగా జుట్టు విపరీతంగా రాలుతోంది. స్మూత్ హెయిర్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేయించుకున్నాను. ఇప్పటికి రెండుసార్లు హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేయించుకున్నాను. అందువల్లనే జుట్టు రాలుతోందా? ఇలా రాలిన జుట్టు మళ్లీ వస్తుందా?

- సునీత, నిజామాబాద్

హెయిర్ స్ట్రెయిటెనింగ్ ప్రక్రియలో వాడే రసాయనాలు తలపై ఉన్న చర్మం అంటే మాడును (స్కాల్ప్‌ను) తాకితే... వాటి ప్రభావం వల్ల జుట్టు రాలే అవకాశం లేకపోలేదు. అయితే మీ సమస్యకు అదొక్కటే కారణం కాకపోవచ్చు. ఉదాహరణకు... మీలో రక్తహీనత ఉన్నా లేదా మీలో హార్మోన్ల అసమతౌల్యతలు ఉన్నా కూడా జుట్టు రాలిపోయే అవకాశం ఉంది. మీరు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించండి. మీ జుట్టు రాలడానికి గల కారణాన్ని నిర్దిష్టంగా తెలుసుకుంటే, దానికి అనుగుణంగా మీకు చికిత్స చేయడం కూడా సులువవుతుంది.

డాక్టర్ సుభాషిణి జయం, చీఫ్ కాస్మటాలజిస్ట్,
ఎన్‌ఛాంట్ మెడికల్ కాస్మటాలజీ క్లినిక్, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్

డాక్టర్స్ డే స్పెషల్

మంచి డాక్టర్‌ను ఎంచుకోవడం ఎలా?

మీకేదో ఆరోగ్య సమస్య వచ్చి డాక్టర్‌కు చూపించుకోవాలనుకుంటారు. ఒకే విద్యార్హతలతో, ఒకే రకమైన అనుభవంతో ఇద్దరు డాక్టర్లు మీకు అందుబాటులో ఉన్నారనుకుందాం. ఇద్దరూ మంచి సమర్థులే. కానీ డాక్టర్ అంటే కేవలం సామర్థ్యం, అనుభవం మాత్రమే కాదు. ఇంకా కొన్ని అదనంగా ఉండాలి. డాక్టర్‌కు ఉండాల్సింది మంచి కమ్యూనికేషన్ స్కిల్స్. తాను అనుకున్నదీ, రోగికి స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పగలిగే మంచి గుణం. ఇద్దరూ ఒకేలాంటి అర్హతలున్న డాక్టర్లు ఎదురైనప్పుడు ఎంచుకోవాల్సింది మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలున్న వైద్యనిపుణుడిని.

అతడో ఉపాధ్యాయుడు కూడా!

పైన చెప్పిన అంశానికి ఒక కారణముంది. 'డాక్టర్' అనే పదం లాటిన్ నుంచి వచ్చింది. దానికి 'టీచర్' అనే మరో అర్థం కూడా ఉంది. ఒక రోగికి ఏమైందో, తాను ఏం చేయబోతున్నానో, దాంతో వ్యాధి ఎలా నయం కాబోతోందో అన్న అంశాలను రోగికి అర్థమయ్యేలా, అతడి సామాన్యభాషలోనే వివరించి చెప్పడం కూడా డాక్టర్ బాధ్యతే. అంతే గానీ 'నేను మందిచ్చాను. నువ్వు వేసుకొని తీరాల్సిందే. నువ్వు నన్నడగడానికి ఏమీ లేదు' అనే ధోరణి డాక్టర్‌కు సరికాదు. మనం చెప్పుకున్నట్లు డాక్టర్ అనే మాటకు మంచి ఉపాధ్యాయుడు అనే అర్థం కూడా ఉంది కాబట్టి విడమరచి చెప్పడం అన్నది డాక్టర్ విద్యుక్త ధర్మం.

కమ్యూనికేషన్ నైపుణ్యాలే కీలకం

డాక్టర్ అనే వారికి నైతికత ఉండాలి. హేతుబద్ధత ఉండాలి. అంటే వారు ఎథికల్‌గానూ, రేషనల్‌గానూ కూడా ఉండాలన్నమాట. రోగిని హడలగొట్టడం, బెదరగొట్టడం వంటి పనులు ఎంతమాత్రమూ చేయకూడదు. రోగికి ఉన్నది ప్రమాదకరమైన జబ్బే కావచ్చు. కానీ దాని తీవ్రతను సరిగ్గా వివరిస్తూనే రోగి ఆందోళన చెందని విధంగా చెప్పాలి. ఇక్కడే డాక్టర్ తాలూకు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా మళ్లీ పరిగణనలోకి వస్తాయి. ఆపరేషన్ లాంటి సంక్లిష్టమైన సంగతులను రోగి భయపడకుండానూ, అతడికి అర్థమయ్యేలానూ చెప్పగలగడంలోనే డాక్టర్ ప్రజ్ఞ ఉంది. అలాంటి డాక్టర్‌ను ఎంచుకోవడం ఎప్పుడూ మంచిది. అయితే ఇంతగా విడమరచి చెప్పేందుకు డాక్టర్లు కౌన్సెలర్స్‌ను కూడా ఏర్పాటు చేసుకుంటున్న తరుణంలో ఇటీవల డాక్టర్ల మీద దాడులు పెరగడం దురదృష్టకరం. ఇక వాళ్లపై కన్స్యూమర్ కోర్టుల్లో కేసులు నిత్యకృత్యం. దాంతో ఇటీవల డాక్టర్లు ఆ చికిత్స ప్రక్రియల్లో ఎదురయ్యే ముప్పుల వంటి వాటిని నిర్మొహమాటంగా చెబుతున్నారు. దానికి బదులుగా... జబ్బు గురించి వీలైనంతగా ధైర్యం కలిగించేలా చెబుతూనే, తమ పరిమితులనూ చెబుతున్న డాక్టర్లను నమ్మడం మంచిది. రోగి ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా చికిత్సలో ఉన్న ముప్పును, పరిమితులనూ చెప్పగలిగేవారే మంచి డాక్టర్లు. మళ్లీ ఇక్కడ కూడా కమ్యూనికేషన్ స్కిల్స్ బాగా ఉపయోగపడతాయి.

సహానుభూతే ముఖ్యం!

తమ జబ్బు కారణంగా తాము బాధపడుతూ ఉంటే.. 'ఇలాంటి వారిని రోజూ చూస్తూనే ఉంటాం కదా' అనుకునే డాక్టర్లు కొందరుంటారు. ఇక కొంత మందికి రోగుల పట్ల సానుభూతి మాత్రం ఉంటుంది. అయితే అటు రోగి బాధను పూర్తిగా విస్మరించేవారూ, ఇటు రోగి పట్ల సానుభూతి కలిగినవారూ కంటే... రోగి బాధల పట్ల సహానుభూతి (ఎంపథీ)తో ఉండే డాక్టర్లను ఎంపిక చేసుకోవడం ముఖ్యం. ఎందుకంటే... వారు రోగి పడుతున్న బాధను తామూ అనుభూతి చెందగలరు. దాంతో రోగి బాధను వీలైనంతగానూ, వీలైనంత త్వరగానూ తొలగించాలనుకుంటారు. మరీ చెప్పాలంటే ఒక డాక్టర్ నైతికతతోనూ (ఎథికల్‌గా), హేతుబద్ధంగానూ (రేషనల్‌గా), సహానుభూతితో (ఎంపథీతో) ఉన్నప్పుడు అతడు రోగికి అనవసరమైన ఒక్క అదనపు వైద్య పరీక్షనైనా రాయడు. ఇటీవల రోగుల్లో డబ్బు ఖర్చు చేయగల సామర్థ్యం (స్పెండింగ్ ఎబిలిటీ) పెరగడంతో... ''మాకు ఆ పరీక్ష రాయండీ... ఈ పరీక్ష రాయండి. ఒకసారి చేయించుకుని ఏమీ లేదనిపించుకుంటే మంచిదే గా'' అని స్వయంగా కొంతమంది రోగులే డాక్టర్లను కోరుతున్నారు. ఒక డాక్టర్ నిజంగా మంచివాడే అయితే... తనకు స్వలాభం ఉన్నప్పటికీ రోగులు కోరే అలాంటి అనుచితమైన కోర్కెలను తానే మొగ్గలోనే తుంచేస్తాడు. ''అవి అనవసరమండీ... అవసరమైతే నేనే రాయనా'' అంటాడు. అలా అనే డాక్టర్ దగ్గరికి నిరభ్యంతరంగా వెళ్లవచ్చు. ఆయనను పూర్తిగా నమ్మవచ్చు.

మీ కుటుంబ ఫిజీషియన్‌ను ఎంచుకోండి, నమ్మండి!

ఇటీవల సూపర్ స్పెషాలిటీస్ పెరిగాక ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కాస్తంత వెనకబడింది. కానీ మీరు ఎప్పుడూ చూపించుకునే మీ ఫ్యామిలీ ఫిజీషియన్‌కు చాలా విషయాలు తెలిసి ఉంటాయి. మీ ఫ్యామిలీ హిస్టరీ, వంశపారంపర్యంగా వస్తున్న జబ్బులు, మీకు ఏయే మందుల పట్ల అలర్జీ ఉంది, ఏవి మీకు సరిపడవు అన్న అంశాలన్నీ ఎలాంటి వైద్యపరీక్షలూ లేకుండానే చెప్పగలరు. ఆ అంశాలన్నీ ఆయన గమనంలోనూ, మననంలోనూ ఉంటాయి. కాబట్టి ఇలాంటి గుణగణాలున్న ఒక ఫిజీషియన్‌ను ఎంచుకుని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అతడికి చూపించుకుంటూ... ఆయన సూచించేవరకు ఒక సూపర్‌స్పెషలిస్ట్ దగ్గరికి వెళ్లకపోవడమే మేలు. దీని వల్ల మీ ఒంటికే కాదు... మీ జేబుకూ ఆరోగ్యం.

ఇక చివరగా ఒక్క మాట. ఇక్కడే డాక్టర్‌కూ, జనానికీ, సమాజానికీ ఒక ఘర్షణ వచ్చేస్తుంది. 'అప్పిచ్చువాడూ... వైద్యుడూ' లేని ఊళ్లో ఎప్పుడూ ఉండకూడదన్న కవివర్గానికి చెందిన మరో కవి ఎన్నో ఏళ్ల కిందటే ఇలా శ్లోకం రాశాడు.

''వైద్యరాజ నమస్తుభ్యం
యమరాజ సహోదరా!
యమస్తు హరతి ప్రాణాన్
వైద్యః ప్రాణాన్ ధనానివ!!''

అంటే... ''ప్రాణాలు తీసుకోవడం అనే సారూప్యతను బట్టి చూస్తే... నువ్వు యముడికి సోదరుడివి. అయినా యముడి కంటే నువ్వే గ్రేటు! ఎందుకంటే... యమరాజు కేవలం ప్రాణాలను మాత్రమే తీసుకుంటాడు. కానీ వైద్యరాజు మాత్రం అటు ప్రాణాలనూ, ఇటు డబ్బునూ... రెండింటినీ తీసేసుకుంటాడు. అలాంటి వైద్యుడా నీకు నా నమస్కారం'' అంటూ హాస్యభరితంగా, వ్యంగ్యంగా ఓ శ్లోకం రాశాడు. బహుశా తన డాక్టర్‌ను చూసీ, చూసీ విసిగిపోయాక ఇక చివరకు ఆ ఫ్రస్ట్రేషన్‌తో సంస్కృత కవి ఈ శ్లోకం రాసుంటాడు.

ఇక్కడ ఓ డాక్టర్‌గా నిర్మొహమాటంగా నేనో మాట చెప్పాల్సి ఉంది. డబ్బు అవసరమే. కానీ దాని పరిమితి ఏమిటి? ఈ అంశం దగ్గరికి రాగానే వారి వారి ప్రాధాన్యాలూ, ప్రాథమ్యాలూ తమకు తగినట్లుగా మారిపోతాయి. అన్ని రకాల అవగాహనలతో పాటు ఈ విషయంలోనూ డాక్టర్‌కూ, రోగికీ మధ్య కూడా, అవగాహన, సమన్వయం ఉంటే ఇక అలాంటి మంచి డాక్టర్‌ను మనస్ఫూర్తిగా నమ్మండి. అలాంటి వారిని ఎప్పుడూ వదులుకోకండి.

**డాక్టర్ బి

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

సోమవారం
1-7-2019

ఎంసెట్ కౌన్సెలింగ్‌కు వేళాయే..!

తెలంగాణలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. బీఈ/బీటెక్, ఫార్మసీల్లో ప్రవేశాలకు సంబంధించిన టీఎస్ ఎంసెట్-2019 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. జూన్ 24వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్, ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ మొదలైంది. అయితే జూన్ 27 నుంచి జరగాల్సిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ.. ఫీజుల అంశంపై తలెత్తిన గందరగోళం కారణంగా రెండు సార్లు వాయిదా పడింది. జూలై 5 నుంచి వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ జరుగనుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎంసెట్ 2019 కౌన్సెలింగ్ వివరాలు..

- రిజిస్ట్రేషన్‌లో భాగంగా ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం పొందుపరచడం, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధృవపత్రాల పరిశీలనకు అనువైన స్లాట్ బుకింగ్ చేసుకోవడం వంటి వివరాలు పొందుపరచాలి.

ఎంసెట్ కౌన్సెలింగ్ విధానం

- టీఎస్ ఎంసెట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవసరమైన ప్రాసెసింగ్ ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఇందుకోసం **https://tseamcet.nic.in** వెబ్‌సైట్ ఓపెన్ చేసి 'పే ప్రాసెసింగ్ ఫీజు'పై క్లిక్ చేసి ఎంసెట్ హాల్‌టిక్కెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేది ఎంటర్ చేసి 'పే ఫీ ఆన్‌లైన్' బటన్‌పై క్లిక్ ఇవ్వాలి.
- ఒకవేళ విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రాలు వర్తిస్తే వాటి అప్లికేషన్ల నంబర్లు నమోదు చేయాలి. అలానే అన్నింటి కంటే ముఖ్యంగా పనిచేస్తున్న మొబైల్ నంబర్ ఇవ్వాలి. కౌన్సెలింగ్ పూర్తయ్యే వరకు ఈ నంబరుకే సమాచారం అందుతూ ఉంటుంది. అలానే విద్యార్థి ఇ-మెయిల్ ఐడీ, ఆధార్ కార్డు నంబర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం చివర్లో ఉండే డిక్లరేషన్ చెక్ బాక్స్‌పై క్లిక్ ఇచ్చి సబ్మిట్ బటన్‌పై క్లిక్ ఇవ్వాలి. అప్పుడు ఒక పాప్-అప్ వస్తుంది. అక్కడ ఉన్న ఓకే బటన్‌పై క్లిక్ ఇస్తే సబ్మిట్ అవుతుంది. తర్వాత మరోసారి హాల్‌టిక్కెట్ నంబర్, ర్యాంకు సరిచూసుకొని పే ప్రాసెసింగ్ ఫీ ఆన్‌లైన్‌పై క్లిక్ ఇవ్వాలి. మరోసారి వచ్చే పాప్-అప్ మెసెజ్‌ను ఒకే చేసి మీ దగ్గర ఉన్న క్రెడిట్ కార్డు/డెబిట్ కార్డు/నెట్ బ్యాంకింగ్/యూపీఐ ద్వారా ఫీజు చెల్లించవచ్చు. ఎస్‌సీ, ఎస్‌టీ విద్యార్థులకు రూ.600, ఇతర విద్యార్థులు రూ.1200 చెల్లించాలి.
- ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన తర్వాత ధృవపత్రాల పరిశీలనకు ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్ బుకింగ్ అంటే... విద్యార్థులు తమకు సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం తేదీ, సమయం కోరడమే. ఇందుకోసం విద్యార్థి మరోసారి తన టీఎస్ఎంసెట్ హాల్‌టిక్కెట్ నంబర్, టీఎస్ ఎంసెట్ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేది ఎంటర్ చేసి 'షో అవైలబుల్ స్లాట్స్'పై క్లిక్ ఇస్తే స్లాట్ బుకింగ్ తేదీలు కనిపిస్తాయి. అక్కడ కేటగిరి ఆఫ్ స్టూడెంట్ ఆప్షన్ దగ్గర ఓసీ,బీసీ,ఎస్సీ,ఎస్టీ కేటగిరీల విద్యార్థులు 'ఆల్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్ కేటగిరి విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మాసబ్ ట్యాంకులో మాత్రమే వెరిఫికేషన్ ఉంటుంది.
- అనువైన హెల్ప్ లైన్ సెంటర్‌ను కూడా ఎంపిక చేసుకోవాలి. అక్కడే కింద కనిపించే తేదీలో మీకు అనువైన స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. తేదీ ఎంచుకున్న తర్వాత సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కోసం సమయం కూడా ఎంచుకోవాల్సి ఉంటుంది. బుకింగ్ చేసుకున్న తర్వాత విద్యార్థుల మొబైల్‌కు హెల్ప్ లైన్ సెంటర్ వివరాలతో కూడిన మెసెజ్ అందుతుంది.
- విద్యార్థి ఎంపిక చేసుకున్న సెంటర్‌కు పది నిమిషాల ముందే చేరుకొని తన మొబైల్‌కు వచ్చిన మెసెజ్‌ను అధికారులకు చూపించి ధృవపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవచ్చు. టీఎస్ ఎంసెట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకెళ్లాలి. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో బయోమెట్రిక్ విధానంలో వీటిని సరిచూస్తారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్.. అవసరమైన పత్రాలు

- ఎంసెట్ ర్యాంక్ కార్డ్.
- ఎంసెట్ హాల్‌టికెట్.
- ఆధార్ కార్డ్.
- పదో తరగతి తత్సమాన కోర్సు మార్కుల మెమో.
- ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు మెమో కమ్ పాస్ సర్టిఫికెట్.
- ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు స్టడీ సర్టిఫికెట్స్.
- ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ).
- 2019, జనవరి 1 తర్వాత జారీచేసిన ఆదాయ ధ్రువీకరణపత్రం.
- కుల ధృవీకరణ పత్రం.
- నాన్‌లోకల్ విద్యార్థి స్థానికతకు సంబంధించిన సర్టిఫికెట్స్.
- ఇతరత్రా స్పెషలైజ్డ్ సర్టిఫికెట్లు.

వెబ్ ఆప్షన్లు ఇవ్వండిలా..

- సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే.. వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవసరమైన లాగిన్ ఐడీని అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా వారి మొబైల్ నెంబర్లకు పంపుతారు. ఈ లాగిన్ ఐడీని ఉపయోగించి వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలి. ముందు వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి 'క్యాండిడేట్స్ రిజిస్ట్రేషన్'పై క్లిక్ చేస్తే కొత్త పాస్‌వర్డ్ విద్యార్థి మొబైల్ నంబర్‌కు వస్తుంది. ఆ తర్వాత వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలి. జూలై 5వ తేదీ నుంచి వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు.
- విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంట్రీ చేయడానికి ముందు కొంత కసరత్తు చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో కాలేజీలు, వాటిల్లో కన్వీనర్ సీట్లు, వాటి ఫీజుల వివరాలు ముందుగానే పొందుపరుస్తారు. వీటిని ప్రింటౌట్ తీసుకొని మ్యానువల్ వెబ్ ఎంట్రీ ఆప్షన్ల క్రమాన్ని నోట్ చేసుకోవాలి. ఆయా కాలేజీ కోడ్, బ్రాంచ్ కోడ్, జిల్లా కోడ్ నోట్ చేసుకోవాలి. కాలేజీ, బ్రాంచ్ ప్రాధాన్యత క్రమం గురించి ముందే తల్లిదండ్రులతో, స్నేహితులతో చర్చించి ఒక అంచనాకు రావాలి. తద్వారా గందరగోళం లేకుండా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. కాబట్టి ప్రాథమ్యాలపై ముందే మ్యానువల్‌గా కసరత్తు చేసుకోవాలి. అదేవిధంగా సాధ్యమైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవడం మేలన్నది నిపుణుల సలహా.

సీట్ అలాట్‌మెంట్

- వెబ్ ఆప్షన్స్ ఎంట్రీ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. విద్యార్థులకు వారికి వచ్చిన ర్యాంకు, పేర్కొన్న ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకొని సీట్ అలాట్‌మెంట్ చేస్తారు. సీటు పొందిన విద్యార్థులు ప్రొవిషనల్ సీటు అలాట్‌మెంట్ ఆర్డర్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు వెబ్‌సైట్‌లో టీఎస్ఎంసెట్ హాల్‌టికెట్ నంబరు, రిజిస్ట్రేషన్ నంబర్, పాస్‌వర్డ్, పుట్టిన తేదీని ఎంటర్ చేయాలి.
- అలాట్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొన్న విధంగా విద్యార్థులు ఆన్‌లైన్(క్రెడిట్ కార్డ్/ డెబిట్ ఆర్డ్/నెట్ బ్యాంకింగ్ విధానంలో..) లో ట్యూషన్ ఫీజును నిర్దేశిత గడువులోగా చెల్లించాలి. అభ్యర్థి లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి.. కేటాయించిన సీటుకు సంబంధించి అడ్మిషన్ నెంబర్ తీసుకోవాలి. దాని ప్రింట్ అవుట్‌ను దగ్గరుంచుకోవాలి.
- విద్యార్థులు నిర్దేశిత గడువులోపు ఫీజు చెల్లించకుంటే... కేటాయించిన సీటు రద్దు అవుతుంది.

కౌన్సెలింగ్.. షెడ్యూల్

- ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం పూర్తిచేయడం, ప్రాసెసింగ్ రుసుం చెల్లింపు, ధృవపత్రాల పరిశీలనకు తేదీ, సమయం, హెల్ప్‌లైన్ సెంటర్ ఎంపిక చేసుకోవడానికి ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవడం: ఈనెల 24 నుంచి జులై 1 వరకు.
- స్లాట్ బుక్ చేసుకున్న వారికి ధృవపత్రాల పరిశీలన: జూన్ 27 నుంచి జులై 3 వరకు.
- **వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం:** జూలై 5 నుంచి ప్రారంభం.
- **వెబ్‌సైట్: https://tseamcet.nic.in**

ఉద్యోగ సమాచారం

వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్‌లో 99 ఖాళీలు

నాగపూర్‌లోని వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ 99 స్టాఫ్ నర్స్ (ట్రైనీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఇంటర్మీడియట్/10+2, నర్సింగ్ డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయసు:** 2019, జూన్ 27 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** 100 మార్కులకు జరిగే రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 17, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.westerncoal.in**

ఎస్‌పీఎంసీఐఎల్‌లో 23 ఖాళీలు

భారత ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఐఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 23 టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** టెక్నికల్ ఆపరేషన్స్-18, టెక్నికల్ సపోర్ట్-1, టెక్నికల్ కంట్రోల్-4.
- **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయసు:** 2019, జులై 31 నాటికి 30 ఏళ్లకు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మిగిలిన వారికి రూ.100.
- **దరఖాస్తులు ప్రారంభం:** జూలై 2, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 31, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://spmcil.com**

ఎయిమ్స్-రాయ్‌పూర్‌లో 200 ఖాళీలు

ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)-రాయ్‌పూర్ రెగ్యులర్ విధానంలో 200 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** పోస్టులను బట్టి బీఎస్సీ ఆనర్స్ నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్ట్ సర్టిఫికెట్)/పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంలో డిప్లొమా ఉత్తీర్ణత. నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టరై ఉండాలి.
- **వయసు:** 2019, జూలై 21 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ/ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీలకు రూ.800. దివ్యాంగులకు ఫీజు లేదు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 21, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.aiimsraipur.edu.in**

సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్లో..

- ఎస్‌జీఐ క్లరికల్, పీవో మెటీరియల్
- జనరల్ స్టడీస్ మోడల్ పేపర్లు
- ఎంసెట్ కాలేజ్ ప్రెడిక్టర్ (ఆంధ్రప్రదేశ్/తెలంగాణ).
- స్టడీ అబ్రాడ్ సమాచారం

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి.. ఎంతో దార్శనికతతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన మేలిమి పథకాలు.. "నవరత్నాలు". వీటిని అవినీతికి తావులేకుండా, వివక్ష ఊసేలేకుండా లబ్ధిదారులకు చేరువచేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ/వార్డు వలంటీర్ల నియామకాలకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో తాజాగా జిల్లాల వారీ ప్రకటనలు వెలువడ్డాయి. సామాజిక సేవా దృక్పథం ఉన్న నిరుద్యోగ యువతీయువకులు వలంటీర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఔత్సాహికులకు ఉపయోగపడేలా ఖాళీల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, విధులు తదితర వివరాల సమాహారం..

- ప్రజలు, ప్రభుత్వం మధ్య అనుసంధానకర్తలుగా వలంటీర్ విధులు
- సమాజానికి సేవచేసే సదవకాశం
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ జూలై 5

ఏపీ నోటిఫికేషన్స్

సంక్షేమ సారథికి వారధి..

గ్రామ/వార్డు వలంటీర్

గ్రామ వలంటీర్ ఖాళీల వివరాలు

జిల్లా	ఖాళీలు
శ్రీకాకుళం	11,924
విజయనగరం	10,012
విశాఖపట్నం	12,272
తూర్పు గోదావరి	22,000
పశ్చిమ గోదావరి	17,881
కృష్ణా	14,000
గుంటూరు	17,550
ప్రకాశం	14,106
చిత్తూరు	15,824
కర్నూలు	12,045
వైఎస్సార్	9,322
అనంతపురం	14,007
ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	11,342
మొత్తం	**1,82,285**

గమనిక:

- ఖాళీల సంఖ్యలో మార్పులు ఉండొచ్చు.
- పట్టణ ప్రాంత వార్డు వలంటీర్ ఖాళీల భర్తీకి జిల్లాల కలెక్టర్లు విడిగా నోటిఫికేషన్లు విడుదల చేశారు.

అర్హతలు

- గ్రామ వలంటీర్‌కు ఇంటర్మీడియెట్/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత. గిరిజన ప్రాంతాలకు సంబంధించి పదో తరగతి ఉత్తీర్ణత సరిపోతుంది.
- వార్డు వలంటీర్‌కు డిగ్రీ/తత్సమాన ఉత్తీర్ణత.
- గ్రామ/వార్డు వలంటీర్‌గా పనిచేయాలనుకునే వారు స్థానికులై ఉండాలి.
- వయసు 2019, జూన్ 30 నాటికి 18-35 ఏళ్లు.
- నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. మహిళలకు దాదాపు 50 శాతం రిజర్వేషన్ ఉంటుంది.

వలంటీర్ విధులు

- తమకు కేటాయించిన కుటుంబాలకు ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలను చేరవేయాలి.
- కులం, మతం, రాజకీయంతో సంబంధం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను చేరవేయాలి.
- తమ పరిధిలోని కుటుంబాల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలి.
- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించాలి.
- ఉన్నతాధికారులు అప్పగించిన ఇతర విధులను కూడా నిర్వర్తించాల్సి ఉంటుంది.
- పనితీరు సంతృప్తికరంగా లేకుంటే వలంటీర్లను తొలగిస్తారు.

ఇంటర్వ్యూకు సన్నద్ధత

మౌఖిక పరీక్ష అనగానే ఏ విధమైన ప్రశ్నలు ఎదురవుతాయనే ఆందోళన అభ్యర్థుల్లో ఉంటుంది. అయితే ఎలాంటి ఆందోళన లేకుండా, ఒత్తిడిని దరిచేరనీయకుండా ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూకు సన్నద్ధమవాలంటున్నారు నిపుణులు. ఈ కింది అంశాలకు సంబంధించి అభ్యర్థులకున్న అవగాహన/నైపుణ్యాలను ఇంటర్వ్యూ ద్వారా పరీక్షిస్తారు.

- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు.
- సామాజిక సమస్యలు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు.
- ఎన్‌జీవోలు/సాంఘిక కార్యక్రమాలు/సంస్థల్లోని అనుభవం.
- నాయకత్వ లక్షణాలు **(leadership qualities)**, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు **(communication skills).**

సమాచార సేకరణ, అవగాహన

దినపత్రికలు, అధికారికి వెబ్‌సైట్లు తదితరాల ఆధారంగా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకోవాలి. అభ్యర్థులు నివసిస్తున్న ప్రాంతాల్లోని వివిధ సమస్యలను తెలుసుకోవాలి. వాటి పరిష్కార మార్గాలపై అవగాహన పెంపొందించుకోవాలి.

ఇంటర్వ్యూలో విజయానికి అభ్యర్థికి ఉండాల్సిన లక్షణాలు

- నిజాయితీ.
- భావ వ్యక్తీకరణలో స్పష్టత.
- తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని, పరిణామాలను సునిశితంగా పరిశీలించేతత్వం.
- సామాజిక స్పృహ, సహానుభూతి.
- నాయకత్వ లక్షణాలు.
- సమస్య పరిష్కార నైపుణ్యం.

ఇంటర్వ్యూ సమయంలో

- సమాధానాలను సూటిగా, స్పష్టంగా చెప్పాలి.
- అవసరమైతే ఉదాహరణలతో వివరించాలి.
- ప్రశ్నలను జాగ్రత్తగా వినాలి. ప్రశ్న పూర్తికాకుండానే సమాధానం చెప్పేందుకు ప్రయత్నించకూడదు.
- వాదనలు వద్దు.
- చెప్పే సమాధానాల్లో నిజాయితీ ప్రస్ఫుటమవాలి.

కొన్ని నమూనా ప్రశ్నలు

- మీ గ్రామ రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు ఏమిటి?
- మీరు ఇది వరకు ఏవైనా సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారా?
- పిల్లలు మధ్యలో బడి మానేయకుండా చూడాలంటే ఏం చేస్తే బాగుంటుంది?
- రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే 'నవరత్నాల' గురించి చెప్పండి?
- పిల్లలను బడికి పంపితే 'అమ్మ ఒడి పథకం' కింద తల్లి ఖాతాలో ఎంత మొత్తం జమచేస్తారు?

- **గౌరవ వేతనం:** పనితీరు ఆధారంగా నెలకు రూ.5,000.

ఎంపిక విధానం

- తొలిదశలో దరఖాస్తుల పరిశీలన జరుగుతుంది. ఆ తర్వాత గ్రామాల్లో అయితే ఎంపీడీవో/తహసీల్దార్/ఈవో (పీఆర్ అండ్ ఆర్‌డీ)లతో కూడిన సెలక్షన్ కమిటీ అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. ఇందులో ప్రతిభ చూపిన వారికి గ్రామ వలంటీర్లుగా సెలక్షన్ కమిటీ చైర్మన్ (ఎంపీడీవో) నియామక పత్రాలు అందిస్తారు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సెలక్షన్ కమిటీ వార్డు వలంటీర్ల నియామక ప్రక్రియలో పాల్గొంటుంది.

ముఖ్య తేదీలు

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో.
- **దరఖాస్తు రుసుం:** లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5, 2019.
- **ఇంటర్వ్యూల నిర్వహణ:** జూలై 11-25, 2019.
- **ఎంపికైన అభ్యర్థులకు సమాచారం ఇచ్చే తేదీ:** ఆగస్టు 1, 2019.
- **ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ:** ఆగస్టు 5-10, 2019
- **విధులు ప్రారంభం:** ఆగస్టు 15, 2019.
- **వెబ్‌సైట్: http://gramavolunteer.ap.gov.in**

పథకాలపై అవగాహన ముఖ్యం

"పరిపాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే గ్రామ/వార్డు వలంటీర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. గ్రామ/వార్డు వలంటీర్లుగా పనిచేయాలనుకునే అభ్యర్థులకు నిర్దేశిత అర్హతలతో పాటు వ్యక్తిత్వ, మూర్తిమత్వ లక్షణాలుండాలి. అవి అభ్యర్థిలో ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేసేందుకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థి తప్పనిసరిగా పథకాలు/కార్యక్రమాలు ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'నవరత్నాలు' గురించి తెలుసుకోవాలి. వీటిద్వారా పేదల అభ్యున్నతికి జరుగుతున్న కృషిపై అవగాహన పెంపొందించుకోవాలి.

– బి.కృష్ణారెడ్డి, పోటీపరీక్షల నిపుణులు.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
1-7-2019

ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X వెస్టిండీస్

వేదిక: చెస్టర్ లీ స్ట్రీట్

మధ్యాహ్నం 3 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

జట్టు	ఆ	గె	ఓ	ర	నె.ర.రే.	పా
ఆస్ట్రేలియా	8	7	1	0	1.000	14
భారత్	7	5	1	1	0.854	11
న్యూజిలాండ్	8	5	2	1	0.572	11
ఇంగ్లండ్	8	5	3	0	1.000	10
పాకిస్తాన్	8	4	3	1	-0.792	9

జట్టు	ఆ	గె	ఓ	ర	నె.ర.రే.	పా
బంగ్లాదేశ్	7	3	3	1	-0.133	7
శ్రీలంక	7	2	3	2	-1.186	6
దక్షిణాఫ్రికా	8	2	5	1	-0.080	5
వెస్టిండీస్	7	1	5	1	-0.320	3
అఫ్గానిస్తాన్	8	0	8	0	-1.418	0

తగిలింది తొలి షాక్

ధోని-జాదవ్ ఇంత చెత్తగానా?

7 డాట్ బాల్స్, 20 సింగిల్స్, 3 ఫోర్లు, 1 సిక్స్...!

31 బంతుల్లో 71 పరుగులు చేయాల్సిన దశలో ధోని-జాదవ్ భాగస్వామ్యం సాగిన తీరిది. కాస్త కష్టపడితే అందుకోదగ్గ లక్ష్యం కళ్లెదుట ఉండగా సీనియర్లిద్దరూ మన వల్ల కాదులే అన్నట్లు ఆడారు. విరుచుకుపడటం మాట దేవుడెరుగు? ప్రత్యర్థి పేసర్ల బౌలింగ్‌లో చాలాసార్లు బంతిని బ్యాట్‌కు కనీసం తాకించలేక పోయారు. మధ్య ఓవర్ల తర హాలో సింగిల్స్ తీస్తూ ఆగ్రహం తెప్పించారు.

1
వన్డేల్లో 25 సెంచరీలు చేసిన రోహిత్ ఒక్క సిక్స్ కొట్టకుండా శతకం చేయడం ఇదే ప్రథమం.

2
ఒకే ప్రపంచకప్‌లో మూడు సెంచరీలు చేసిన రెండో భారత క్రికెటర్ రోహిత్. గంగూలీ (2003లో) కూడా మూడు సెంచరీలు చేశాడు.

6
ప్రపంచకప్‌లోని ఓ మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీసిన ఆరో భారత బౌలర్ షమీ. గతంలో కపిల్ (1983), రాజన్ సింగ్ (1999), వెంకటేశ్ ప్రసాద్ (1999), ఆశిష్ నెహ్రా (2003), యువరాజ్ సింగ్ (2011) ఈ ఘనత సాధించారు.

2
ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక సెంచరీలు చేసిన భారత బ్యాట్స్‌మెన్ జాబితాలో గంగూలీ సర సన రోహిత్ (4 చొప్పున) నిలిచాడు. సచిన్ (6) ముందున్నాడు.

1
ఒకే ప్రపంచకప్‌లో వరు సగా ఐదు ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీలు చేసిన తొలి కెప్టెన్ కోహ్లి.

1
భారత్ తరఫున ప్రపంచ కప్ మ్యాచ్‌లో అత్యధిక వరుగులు సమర్పించు కున్న బౌలర్‌గా చహల్ నిలిచాడు. శ్రీనాథ్ (87; 2003లో ఆస్ట్రేలియా పై)ను చహల్ వెనక్కి నెట్టాడు.

సెమీస్ రేసులో ఎవరంటే..

- ఆస్ట్రేలియా ఇప్పటికే సెమీస్ చేరగా... రేపు బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో భారత్ గెలిస్తే 13 పాయింట్లతో సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసు కుంటుంది. ఒకవేళ భారత్ ఓడినా 11 పాయింట్లతో సెమీఫైనల్ రేసులో ఉంటుంది.
- ఇక జూలై 3న జరిగే తమ చివరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై గెలిస్తే ఎలాంటి సమీకరణా లతో సంబంధం లేకుండా ఇంగ్లండ్ 12 పాయిం ట్లతో సెమీస్ చేరుతుంది.
- న్యూజిలాండ్ చేతిలో ఇంగ్లండ్ ఓడిపోయి... బంగ్లాదేశ్‌పై గెలిస్తే పాకిస్తాన్ జట్టు 11 పాయిం ట్లతో సెమీస్ బెర్త్ దక్కించుకుంటుంది.
- భారత్, పాకిస్తాన్‌లపై నెగ్గడంతోపాటు రన్‌రేట్ మెరుగైతేనే బంగ్లాదేశ్‌కు సెమీస్ చాన్స్ ఉంది.
- భారత్‌పై ఇంగ్లండ్ గెలవడంతో శ్రీలంక జట్టు సెమీఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి.

భారత్‌కు ఝలక్ ఇస్తూ... ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ ఊపిరి పీల్చుకుంది. నాకౌట్ బెర్త్ ఉత్కంఠను సగం తగ్గించుకుంది. ఫ్లాట్ పిచ్ ఎదురైతే, అందునా ముందు బ్యాటింగ్‌కు దిగితే తామెంత భీకరంగా ఆడతామో చూపుతూ చెలరేగిన ఆతిథ్య జట్టు... మెగా టోర్నీలో కోహ్లి సేనకు తొలి ఓటమి రుచి చూపింది. అంతమాత్రాన భారత్ తేలిగ్గా ఏమీ లొంగలేదు. తొలుత వెనుకబడ్డా బౌలింగ్‌లో, బ్యాటింగ్‌లో పుంజుకుని ప్రత్యర్థికి సవాల్ విసిరింది. చివర్లో పైచేయి సాధించలేక విజయానికి దూరమైంది.

ఇంగ్లండ్ చేతిలో 31 పరుగుల తేడాతో ఓడిన భారత్

- భారీ స్కోరు ఛేదించలేకపోయిన టీమిండియా
- రోహిత్ శర్మ శతకం వృథా
- సెంచరీతో ఆతిథ్య జట్టును నిలబెట్టిన బెయిర్‌స్టో
- మంగళవారం బంగ్లాదేశ్‌తో కోహ్లి సేన తదుపరి మ్యాచ్

కోహ్లి

బెయిర్‌స్టో

రోహిత్ సెంచరీ అభివాదం

బర్మింగ్‌హామ్: ప్రపంచ కప్‌లో భారత్ అప్ర తిహత విజయాలకు ఇంగ్లండ్ గండి కొట్టింది. సెమీఫైనల్స్ చేరాలంటే గెలుపు తప్పనిసరైన స్థితిలో ఆదివారం ఇక్కడ జరి గిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 31 పరుగుల తేడాతో నెగ్గింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఓపెనర్, 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' జానీ బెయిర్‌స్టో (109 బంతుల్లో 111; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీ బాదడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. మరో ఓపెనర్ జేసన్ రాయ్ (57 బంతుల్లో 66; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు); ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ (54 బంతుల్లో 79; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. మొహమ్మద్ షమీ (5/69) మరోసారి చక్కటి బౌలింగ్‌తో వికెట్లు పడగొట్టగా, జస్‌ప్రీత్ బుమ్రా (1/44) పొదుపుగా బంతులేశాడు. ఓపెనర్ రోహిత్ శర్మ (109 బంతుల్లో 102; 15 ఫోర్లు) శతకంతో అదరగొట్టినా, కెప్టెన్ విరాట్ కోహ్లి (76 బంతుల్లో 66; 7 ఫోర్లు) రాణించినా, హార్దిక్ పాండ్యా (33 బంతుల్లో 45; 4 ఫోర్లు) మెరిసినా... టీమిండియా భారీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. వెటరన్ ధోని (31 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, సిక్స్), కేదార్ జాదవ్ (13 బంతుల్లో 12 నాటౌట్)లు చివరి 31 బంతుల్లో 39 పరుగులే చేసి తీవ్రంగా నిరాశప ర్చారు. దీంతో టీమిండియా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 306 పరుగులే చేయగలిగింది. ప్లంకెట్ (3/55); వోక్స్ (2/58) వికెట్లు తీయగా, ఆర్చర్ (0/45) కీలక సమయంలో పరుగులు అడ్డు కున్నాడు. టోర్నీలో భారత్‌కిది తొలి ఓటమి. మంగళ వారం ఇదే వేదికపై బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

టాస్ చేజారింది... కూర్పు దెబ్బకొట్టింది

మ్యాచ్‌లో టీమిండియాకు టాస్ రూపంలో అదృష్టం కలిసిరాలేదు. ఫ్లాట్ పిచ్‌పై టాస్ నెగ్గిన మోర్గాన్ ఏమాత్రం ఆలోచించకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. భారత్ కూర్పులోనూ పొరపాటు చేసింది. ఇంగ్లండ్ పిచ్‌కు తగ్గట్లుగా స్పిన్ ఆల్ రౌండర్ మొయిన్ అలీని పక్కనపెట్టి పేసర్ ప్లంకెట్‌ను తీసుకుని వ్యూహాత్మ కంగా వ్యవహరించింది. తద్వారా ఐదుగురు స్పెషలిస్ట్ (నలుగురు పేసర్లు వోక్స్, వుడ్, ప్లంకెట్, ఆర్చర్ +స్పిన్నర్ రషీద్) బౌలర్లతో బరిలో దిగినట్టైంది. భారత్ మాత్రం స్పిన్నర్‌ను తగ్గించుకుని పేసర్ భువనేశ్వర్‌ను ఆడించే ఆలోచన చేయలేదు. పైగా తుది జట్టులో ఉంటాడని ముందు రోజే స్పష్టమైన పేస్ ఆల్ రౌండర్ విజయ్ శంకర్‌ను అనూహ్యంగా తప్పించి వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషభ్ పంత్‌కు చోటిచ్చింది. మ్యాచ్‌లో మన ప్రధాన పేసర్లు బుమ్రా, షమీ తమ పూర్తి కోటాలో 113 పరుగులిచ్చి 6 వికెట్లు తీస్తే స్పిన్ ద్వయం చహల్ (0/88), కుల్దీప్ (1/72) ఏకంగా 160 పరుగులు సమర్పించుకుని ఒక వికెటే పడగొట్టగలిగారు. వీరిని అలవోకగా ఎదుర్కొన్న ఆతిథ్య జట్టు బ్యాట్స్‌మెన్ పరుగుల పండుగ చేసుకున్నారు. అంతగా ఫామ్‌లో లేని బెయిర్‌స్టో ఇదే అదనుగా సిక్స్‌లతో చెలరేగిపోయాడు. దీన్నిచూసి కోహ్లి... పార్ట్‌టైమ్ స్పిన్నర్ జాదవ్‌కు బంతి ఇవ్వనేలేదు. ఈ నేపథ్యంలో శంకర్ ఉండి ఉంటే అతడి మీడియం పేస్ కొంతైనా ఉపయోగపడేది. పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గణాంకాలు (0/60) పరిశీలించినా మూడో పేసర్‌గా భువీని ఆడించి ఉండాల్సిందని స్పష్టమవుతుంది.

ఇతడు వచ్చాడు... అతడు దంచాడు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో 160 పరుగులు జోడించిన ఓపె నర్ల ఆటే హైలైట్. ముందు రాయ్, తర్వాత బెయి ర్‌స్టో దూకుడు చూపి అద్భుత ఆరంభం ఇచ్చారు. టోర్నీలో అంచనాకు తగ్గట్లు ఆడని బెయిర్‌స్టో ఈ ఇన్నింగ్స్‌తో సత్తా చాటగా, గత మూడు మ్యాచ్‌లకు దూరమైన రాయ్ పునరాగమనంలో జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో తన ప్రభావమెంతో చాటాడు. షమీ వేసిన మొదటి ఓవర్లోనే అతడు రెండు ఫోర్లు బాదాడు. చహల్‌ను ఆరో ఓవర్లోనే దింపడం ఈ ద్వయం పని తేలిక చేసింది. బెదురు లేని రాయ్ ఆటతో స్ఫూర్తి పొందిన బెయిర్‌స్టో జోరు పెంచి 56 బంతుల్లో అర్ధ సెంచరీని చేరుకున్నాడు. 41 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాయ్‌ను కుల్దీప్ ఔట్ చేశాడు. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని సిక్స్‌లు బాదిన బెయిర్‌స్టో 90 బంతుల్లో సెంచరీ సాధించాడు. అతడితో పాటు కెప్టెన్ మోర్గాన్ (1)ను వరుస ఓవర్లలో ఔట్ చేసి ప్రత్యర్థికి షమీ కళ్లెం వేశాడు. రూట్ (54 బంతుల్లో 44; 2 ఫోర్లు) వేగంగా ఆడలే కపోవడం, స్టోక్స్ కుదురుకోవాలని చూడటంతో ఇంగ్లండ్ రన్ రేట్ 6కు పడిపో యింది. అయితే, చహల్ వేసిన 40వ ఓవర్లో ఫోర్, సిక్స్‌తో స్టోక్స్ మళ్లీ పైకి లేపాడు. 38 బంతుల్లో అతడి అర్ధ సెంచరీ పూర్తయింది. రూట్, బట్లర్ (8 బంతుల్లో 20; ఫోర్, 2 సిక్స్‌లు), వోక్స్ (7)లను షమీ పెవిలియన్ బాట పట్టించినా, దూకుడు తగ్గించని స్టోక్స్ భారీ షాట్లతో జటుకు తగిన స్కోరు అందించాడు.

తట్టుకుని నిలిచారు...

వోక్స్ తొలి ఓవర్‌ను మెయిడిన్ ఆడిన రాహుల్ (0) అతడి తర్వాతి ఓవర్లో మూడు బంతులను ఎదుర్కొని ఖాతా తెరవకుండానే నిష్క్రమిం చాడు. ఈ దశలో వోక్స్, ఆర్చర్ అన్ని అస్త్రాలతో రోహిత్-కోహ్లిలను పరీక్షించారు. ఆర్చర్ బౌ లింగ్‌లో 4 పరుగుల వద్ద రోహిత్ క్యాచ్‌ను రెండో స్లిప్‌లో రూట్ చేజార్చడం మనకు కలిసొచ్చింది. ఈ జోడీ సాహసాలకు పోకుండా ఆడటంతో భారత్ టోర్నీలోనే అత్యంత తక్కువ పవర్ ప్లే స్కోరు (28/1) నమోదు చేసింది. వుడ్, ప్లంకెట్ దిగాక బౌండరీలు బాదుతూ వీరు గేర్ మార్చారు. 59 బంతుల్లో కోహ్లి, 65 బంతుల్లో రోహిత్ అర్ధశతకం మార్కును చేరుకున్నారు. స్టోక్స్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో రోహిత్ టాప్ గేర్‌లోకి వచ్చాడు. ప్లంకెట్ బౌలింగ్‌లో కోహ్లి ఔటవడంతో 138 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. పంత్ (29 బంతుల్లో 32; 4 ఫోర్లు) తోడుగా కప్‌లో రోహిత్ మూడో శతకం (106 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. 14 ఓవర్లలో 140 పరుగులు అవసరమైన దశలో ఇక చెలరే గిపోతాడని భావిస్తుండగా అతడిని... వోక్స్ స్లో బంతితో బోల్తా కొట్టించాడు. సమీకరణం 12 ఓవర్లలో 128గా ఉండగా వోక్స్ ఓవర్లో హార్దిక్ హ్యాట్రిక్ ఫోర్లు సహా 16 పరుగులు రాబట్టి ఆశలు రేపాడు. ఆ వెంటనే ప్లంకెట్ బౌలింగ్‌లో పంత్ కొట్టిన షాట్‌ను స్క్వేర్ లెగ్ వద్ద వోక్స్ ముందుకు దూకుతూ అందుకుని మలుపు తిప్పా డు. రన్‌రేట్ పెరుగుతూ పోతుం డగా భారీ షాట్‌కు యత్నించి హార్దిక్ ఔట య్యాడు. ధోని, జాదవ్ బ్యాటింగ్ తీరుతో ఓటమి ఖరారైంది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) సబ్ (జడేజా) (బి) కుల్దీప్ 66; బెయిర్‌స్టో (సి) పంత్ (బి) షమీ 111; రూట్ (సి) పాండ్యా (బి) షమీ 44; మోర్గాన్ (సి) జాదవ్ (బి) షమీ 1; స్టోక్స్ (సి) సబ్ (జడేజా) (బి) బుమ్రా 79; బట్లర్ (సి అండ్ బి) షమీ 20; వోక్స్ (సి) రోహిత్ (బి) షమీ 7; ప్లంకెట్ (నాటౌట్) 1; ఆర్చర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 337.**

వికెట్ల పతనం: 1-160, 2-205, 3-207, 4-277, 5-310, 6-319, 7-336.

బౌలింగ్: షమీ 10-1-69-5, బుమ్రా 10-1-44-1, చహల్ 10-0-88-0, హార్దిక్ 10-0-60-0, కుల్దీప్ 10-0-72-1.

భారత్ ఇన్నింగ్స్: రాహుల్ (సి అండ్ బి) వోక్స్ 0; రోహిత్ శర్మ (సి) బట్లర్ (బి) వోక్స్ 102; కోహ్లి (సి) సబ్ (విన్స్) (బి) ప్లంకెట్ 66; పంత్ (సి) వోక్స్ (బి) ప్లంకెట్ 32; హార్దిక్ పాండ్యా (సి) సబ్ (విన్స్) (బి) ప్లంకెట్ 45; ధోని (నాటౌట్) 42; కేదార్ జాదవ్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 306.**

వికెట్ల పతనం: 1-8, 2-146, 3-198, 4-226, 5-267. **బౌలింగ్:** వోక్స్ 10-3-58-2, ఆర్చర్ 10-0- 45-0, ప్లంకెట్ 10-0-55-3, మార్క్ వుడ్ 10-0-73-0, రషీద్ 6-0-40-0, స్టోక్స్ 4-0-34-0.

దివ్యా రెడ్డికి నాలుగు పతకాలు

జాతీయ మహిళల మాస్టర్స్ అథ్లెటిక్స్

సాక్షి, హైదరాబాద్: జాతీయ మహిళల మాస్టర్స్ అథ్లె టిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అథ్లెట్ దివ్యా రెడ్డి నాలుగు పతకాలతో మెరిసింది. గోవాలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో దివ్యా రెడ్డి రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. ప్లస్ 35 వయో విభాగంలో పోటీపడిన దివ్యా రెడ్డి 400 మీటర్లు (1ని:15.29 సెకన్లు), 800 మీటర్ల (3ని:03 సెకన్లు) విభాగంలో పసిడి పతకాలు గెలిచిం ది. 1500 మీటర్ల (6ని:41 సెకన్లు) విభాగంలో ఆమె మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దివ్యా రెడ్డి సభ్యురాలిగా ఉన్న తెలం గాణ బృందం 4x100 మీటర్ల రిలే (1ని:07 సెకన్లు) రేసులో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కిం చుకుంది. విజేత హోదాలో దివ్యా రెడ్డి ఈ ఏడాది డిసెంబర్‌లో కౌలాలంపూర్‌లో జరిగే ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని సంపాదించింది.

వింబుల్డన్‌కు వేళాయె...

- నేటి నుంచి సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ
- మధ్యాహ్నం గం. 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-2లో ప్రత్యక్ష ప్రసారం

జొకోవిచ్

లండన్: ఇప్పటికే క్రికెట్ ప్రపంచ కప్ కిక్‌లో ఉన్న క్రీడాభిమానులకు నేటి నుంచి మొదలయ్యే ప్రతిష్టాత్మక గ్రాస్ కోర్టు సమరం వింబుల్డన్ టోర్నమెంట్ మరింత వినోదాన్ని పంచనుంది. పురు షుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)తోపాటు మాజీ చాంపియన్ రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), రాఫెల్ నాదల్ (స్పెయిన్) ఫేవరెట్స్‌గా బరిలోకి దిగుతున్నారు. ఇటీవల జరిగిన హాలె ఓపెన్‌ను రికార్డుస్థాయిలో పదోసారి గెలి చిన రోజర్ ఫెడరర్ తన కెరీర్‌లో తొమ్మిదో వింబుల్డన్ టైటిల్‌పై కన్నేశాడు. ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన నాదల్‌కు క్లిష్టమైన 'డ్రా' ఎదురవ్వడంతో అతను రెండో రౌండ్ నుంచే బలమైన ప్రత్యర్థు లతో పోటీ పడాల్సి ఉంది. సోమవారం జరిగే తొలి రౌండ్‌లో ఫిలిప్ కోల్‌ష్రైబర్ (జర్మనీ)తో జొకోవిచ్ తలపడతాడు. తనస్థాయికి తగ్గట్టు ఆడితే జొకోవిచ్ ఫైనల్ చేరుకునే అవకాశముంది. మరో పార్శ్వం నుంచి ఫెడరర్, నాదల్‌లలో ఒకరు ఫైనల్ బెర్త్ దక్కించుకోవచ్చు. మంగళవారం జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో క్వాలిఫయర్ యుచి సుగిటా (జపా న్)తో నాదల్... లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)తో ఫెడరర్ పోటీపడతారు. జొకోవిచ్, ఫెడరర్, నాదల్‌లతో పాటు అండర్సన్ (దక్షిణాఫ్రికా), అలె గ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా), వావ్రింకా (స్విట్జర్లాండ్), సిట్సిపాస్ (గ్రీస్), సిలిచ్ (క్రొయేషియా) కూడా సంచలన ఫలి తాలు సాధించే సత్తా ఉన్నవారే. మహిళల సింగిల్స్ విభాగంలో కచ్చితమైన ఫేవరెట్స్ కనిపించడం లేదు. ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, కొత్త ప్రపంచ నంబర్‌వన్ యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా)తోపాటు మాజీ చాంపియన్స్ సెరెనా, వీనస్ (అమెరికా), కెర్బర్ (జర్మనీ), క్విటోవా (చెక్ రిపబ్లిక్), మాజీ నంబర్‌వన్ నయోమి ఒసాకా (జపాన్), సిమోనా హలెప్ (రొమేనియా) టైటిల్ రేసులో ఉన్నారు.

ప్రజ్నేశ్‌కు క్లిష్టం

భారత్ తరఫున పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఒక్కడే ఉన్నాడు. సోమ వారం జరిగే తొలి రౌండ్‌లో అతను 2016 రన్న రప్ మిలోస్ రావ్‌నిచ్ (కెనడా)తో ఆడతాడు.

విజేతకు రూ. 20 కోట్లు

ఈ ఏడాది పురుషుల, మహిళల సింగిల్స్ విజే తలకు 23 లక్షల 50 వేల పౌండ్ల (రూ. 20 కోట్ల 57 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ లభిస్తాయి. రన్నరప్‌గా నిలిచిన వారు 11 లక్షల 75 వేల పౌండ్ల చొప్పున (రూ. 10 కోట్ల 28 లక్షలు) అందుకుంటారు. తొలి రౌండ్‌లో ఓడిన వారికి 45 వేల పౌండ్ల (రూ. 39 లక్షల 40 వేలు) చొప్పున లభిస్తాయి.

12-12 వద్ద టైబ్రేక్...

సింగిల్స్‌లో చివరి సెట్‌లో టైబ్రేక్ లేనికారణం గా గతంలో వింబుల్డన్‌లో ఎన్నో సుదీర్ఘ మ్యాచ్‌లు జరిగాయి. ఈ ఏడాది నుంచి సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో చివరి సెట్‌లో తొలిసారి టైబ్రేక్‌ను ప్రవేశపెట్టారు. స్కోరు 12-12 వద్ద రాగానే టై బ్రేక్ నిర్వహించి విజే తను నిర్ణయిస్తారు. ఈసారి కొత్తగా నంబర్‌వన్ కోర్టుకు కూడా పైకప్పును ఏర్పాటు చేశారు.

ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి విజేత వెర్‌స్టాపెన్

స్పీల్‌బర్గ్ (ఆస్ట్రియా): ఈ ఏడాది ఫార్ము లావన్ సీజన్‌లో ఎట్టకేలకు తొమ్మిదో రేసులో మెర్సిడెస్ జట్టు డ్రైవర్ కాకుండా మరో జట్టు డ్రైవర్‌కు టైటిల్ లభించింది. ఆదివారం జరిగిన ఆస్ట్రియా గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలి చాడు. 71 ల్యాప్‌ల ఈ రేసును వెర్‌స్టా పెన్ గంటా 22 నిమిషాల 01.822 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని పొందాడు. 'పోల్ పొజిష న్'తో రేసును మొదలుపెట్టిన లెక్‌లెర్క్ (ఫెరారీ)ను 69వ ల్యాప్‌లో వెర్‌స్టాపెన్ ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వెళ్లాడు. లెక్‌లెర్క్‌కు రెండో స్థానం దక్కగా... బొటాస్ (మెర్సిడెస్) మూడో స్థానాన్ని పొందాడు. వెటెల్ (ఫెరారీ), హామి ల్టన్ (మెర్సిడెస్) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. ఈ సీజ న్‌లోని తొలి ఎనిమిది రేసుల్లో ఆరింటిలో హామిల్టన్ (మెర్సిడెస్), రెండింటిలో బొటాస్ (మెర్సిడెస్) టైటిల్ సాధించారు. తదుపరి రేసు బ్రిటిష్ గ్రాండ్‌ప్రి ఈనెల 14న జరుగుతుంది.

సూపర్ స్టార్క్

ఆసీస్‌కు ఏడో విజయం

లండన్: ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్న డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ప్రపంచకప్‌లో తమ జోరు కొనసాగిస్తోంది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన డేనైట్ మ్యాచ్‌లో ఆసీస్ 86 పరుగుల తేడాతో గెలిచి ఈ టోర్నీలో ఏడో విజయాన్ని నమోదు చేసుకుంది. 244 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్‌ను ఆసీస్ పేసర్ మిషెల్ స్టార్క్ (5/26) హడలెత్తించాడు. స్టార్క్ ధాటికి న్యూజిలాండ్ 43.4 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలి ఓటమి చవిచూసింది. ఆసీస్ మిగతా బౌలర్లలో బెహ్రాన్‌డార్ఫ్‌కు రెండు వికెట్లు దక్కగా... కమిన్స్, లయన్, స్టీవ్ స్మిత్ ఒక్కో వికెట్ తీశారు. తమ చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో జూలై 6న దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా; జూలై 9న ఇంగ్లండ్‌తో న్యూజిలాండ్ తలపడతాయి.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
1-7-2019

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
192 ▼	53 ▼
39,395	11,789

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	8,006	▲ 38
డోజోన్స్	26,600	▲ 73
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,426	▲ 23
డాక్స్	12,399	▲ 128
షాంఘై	2,979	▼ 18
నికాయ్	21,275	▼ 62

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫామన్‌కుక్	68.28	69.92
£	బ్రిటన్ పౌండ్	ఫామన్‌కుక్	86.00	89.15
€	యూరో	ఫామన్‌కుక్	77.09	80.02
¥	జపాన్ ఎన్ (100)	ఫామన్‌కుక్	62.99	65.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఫామన్‌కుక్	47.42	49.57
S$	సింగపూర్ డాలర్	ఫామన్‌కుక్	50.17	51.95
SAR	సౌదీ రియాల్	ఫామన్‌కుక్	17.68	19.39
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామన్‌కుక్	18.10	19.61
¥	చైనా యువాన్	ఫామన్‌కుక్	9.42	10.78

క్రెడిట్ కార్డ్ తిరిగిచ్చేస్తున్నారా?

క్రెడిట్ కార్డును స్వేచ్ఛగా ఖర్చు చేసేందుకు, రివార్డులు పొందేందుకు, మంచి క్రెడిట్ స్కోరు సాధించేందుకు, ఇతరత్రా ఎన్నో ప్రయోజనాలకు ఉపయోగపడే సాధనం. అందుకే వేతన జీవుల్లో ఎక్కువ మంది క్రెడిట్ కార్డుపై మక్కువ చూపుతారు. కొందరైతే వివిధ ఆకర్షణీయ ప్రయోజనాలు చూసి ఒకటికి మించి క్రెడిట్ కార్డులు తీసేసుకుంటుంటారు. అయితే, ఇలా ఎన్నో క్రెడిట్ కార్డుల కారణంగా చెల్లింపులు, వార్షిక రుసుములు, సకాలంలో బాకీల చెల్లింపు వంటి అంశాలను ట్రాక్ చేయడం కష్టం కావచ్చు. అందుకే అవసరం లేని వాటిని రద్దు చేసుకోవడం మంచి నిర్ణయమే అవుతుంది. అయితే, ఇలా క్రెడిట్ కార్డును రద్దు చేసుకుంటే క్రెడిట్ స్కోరుపై ప్రభావం పడుతుందా..? ఇది ఎవరికి వారి ఆర్థిక పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. క్రెడిట్ కార్డును రద్దు చేసుకునే విషయంలోనూ లాభ, నష్టాలు కూడా ఉంటాయి. క్రెడిట్ కార్డును రద్దు చేసుకుంటే రుణ వినియోగ రేషియో రేటు ప్రభావితం కావచ్చు. కొన్ని సందర్భాల్లో రద్దు మంచికే దారితీయవచ్చు. అందుకే క్రెడిట్ కార్డు స్వాధీనం చేసే విషయంలోనూ శ్రద్ధ అవసరం. లేదంటే వ్యక్తిగత క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపించొచ్చు. కనుక క్రెడిట్ కార్డు రద్దు చేసుకునే వారు తెలుసుకోవాల్సిన అంశాలను తెలియజేసే కథనమే ఇది.

- రద్దు పక్కాగా జరగాలి
- బకాయిలన్నీ తీర్చిన తర్వాత రద్దుకు దరఖాస్తు
- రద్దు చేసుకుంటే క్రెడిట్ రేషియో పెరగొచ్చు
- ఇది క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపించే అవకాశం

క్రెడిట్ స్కోరుపై ప్రభావం ఎంత మేర?

క్రెడిట్ కార్డును వెనక్కిచ్చిస్తే, తమ క్రెడిట్ స్కోరుపై ప్రభావం చూపిస్తుందా? అన్నది తెలుసుకోవడం ముందుగా చేయాల్సిన పని. రద్దు చేయాలనుకుంటున్న క్రెడిట్‌కార్డు ఒక్కటే మీ దగ్గర ఉండి ఉంటే, మరే ఇతర రుణం కూడా తీసుకుని లేకపోతే, క్రెడిట్ బ్యూరో మీ పేరిట క్రెడిట్ హిస్టరీ (రుణ చరిత్ర) ప్రారంభించదు. దీంతో క్రెడిట్ స్కోరును ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని కార్డు రద్దు చేసుకోవడం ద్వారా కోల్పోయినట్టు అవుతుంది. క్రెడిట్ కార్డు వినియోగం తర్వాత తిరిగి చెల్లింపులను సకాలంలో చేయడం అన్నది క్రెడిట్ స్కోరు నిర్ణయించే ప్రధాన అంశం. సకాలంలో చెల్లింపులు చేశారా, లేదా అన్నది క్రెడిట్ హిస్టరీ తెలియజేస్తుంది. సకాలంలో చెల్లింపులతో కూడిన మంచి చరిత్ర ఉంటే, మీ క్రెడిట్ కార్డు ఖాతాను కొనసాగించడమే మంచిదన్నది నిపుణుల సూచన. అయితే, క్రెడిట్ కార్డును రద్దు చేసుకున్నంత మాత్రాన, అప్పటికే మీ పేరిట ఉన్న క్రెడిట్ రిపోర్ట్ కానీ, చెల్లింపుల చరిత్ర కానీ కనుమరుగై పోదు. కనుక క్రెడిట్ కార్డును రద్దు చేసుకుంటే, ఆలస్యంగా చేసిన చెల్లింపుల చరిత్ర క్రెడిట్ బ్యూరోల నుంచి తెరమరుగై పోతుందన్న ఆలోచనతో ఆ పనిచేస్తే ఆశించిన ప్రయోజనం నెరవేరదు.

క్రెడిట్ స్కోరులో మరో ముఖ్యమైన అంశం... క్రెడిట్ వినియోగ రేషియో. అంటే మీకున్న రుణ వినియోగ పరిమితిలో ఎంత మేర వినియోగించుకున్నారన్నది. మరి క్రెడిట్ కార్డును రద్దు చేసుకుంటే, మీకున్న రుణ వినియోగ పరిమితి తగ్గిపోవచ్చు. కానీ, ఖర్చులను తగ్గించుకోకుండా, క్రెడిట్ కార్డును రద్దు చేసుకుంటే మరో కార్డుపై వినియోగ రేషియో పెరిగిపోవడానికి దారితీయవచ్చు. సాధారణంగా అందుబాటులో ఉన్న క్రెడిట్‌లో 30 శాతం వినియోగించుకుంటే, తిరిగి చెల్లించగలరని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పరిగణిస్తుంటాయి. ఇక రద్దు చేసుకోదలిచిన క్రెడిట్ కార్డు తీసుకుని ఎన్నేళ్లు అయిందన్నదీ చూడాలి. కార్డు తీసుకుని కేవలం ఏడాదే అయినా, కార్డులు తీసుకుని చాలా ఏళ్లు అయినా వాటిని రద్దు చేసుకుంటే క్రెడిట్ స్కోరు కొంత తగ్గే అవకాశం ఉంటుంది. ఎందుకంటే రుణ గ్రహీతలతో మంచి సంబంధాల్లో భాగంగా స్థిరమైన ట్రాక్ రికార్డును ముఖ్యమైన అంశంగా బ్యాంకులు చూస్తుంటాయి.

క్రెడిట్ కార్డును రద్దు చేసుకోవాలనుకుంటే, ముందుగా కార్డు సంస్థ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి, ప్రతీ నెలా క్రెడిట్ కార్డు నుంచి చేయాల్సిన

ఆటో చెల్లింపులు రద్దు

యుటిలిటీ బిల్లుల చెల్లింపుల ఇన్‌స్ట్రక్షన్స్‌ను (ఆటో చెల్లింపులు) రద్దు చేసుకోవాలి. లేదంటే, యుటిలిటీ కంపెనీ కార్డు నుంచి చార్జ్ తీసుకునే ప్రయత్నాలను ఎప్పటిమాదిరే చేస్తుంది. కార్డును రద్దు చేసుకోవడం వల్ల చెల్లింపులు విఫలం అవుతాయి. మీరు గుర్తుంచుకుని సకాలంలో ఆ బిల్లులను చెల్లించలేకపోతే ఆలస్యపు రుసుముల భారం భరించాల్సి వస్తుంది.

బకాయిలు చెల్లించిన తర్వాతే

క్రెడిట్ కార్డును రద్దు చేసుకునే ముందు ఆ కార్డుకు సంబంధించి బకాయిలను పూర్తిగా తీర్చివేయాలి. ఎందుకంటే బకాయిలు చెల్లించకపోతే ఆ కార్డును రద్దు చేయడానికి సంస్థలు అంగీకరించవు. ఒకవేళ కార్డుపై ఉన్న బకాయిలను చెల్లించలేని వారు, ఆ బ్యాలన్స్‌ను అప్పటికే ఉన్న మరో క్రెడిట్‌కార్డుకు బదలాయించుకోవచ్చు. అయితే తక్కువ వడ్డీ ప్రయోజనం ఉంటేనే ఇలా చేయాలన్నది సూచన.

రద్దు చేసుకునే ముందు ఆఫర్లు

క్రెడిట్ కార్డుపై బ్యాలన్స్ సున్నాగా మారిన తర్వాత క్రెడిట్ కార్డును రద్దు చేసుకోవాలనుకుంటున్నట్టు ఆ కార్డును జారీ చేసిన సంస్థకు తెలియజేయాలి. అయితే, ఇలా నిర్ణయం చెప్పిన తర్వాత అదనపు రివార్డులు, వడ్డీ రేటు తగ్గిస్తామంటూ ఆఫర్ చేయవచ్చు. అది మంచి ఆఫరే అని భావిస్తే, కార్డుపై అప్పటి వరకు ఉన్న ఆఫర్లు నచ్చక రద్దు నిర్ణయం తీసుకుని ఉంటే, మీ నిర్ణయం మార్చుకోవడం తప్పేమీ కాదు. కానీ, మీరు మీ ఆర్థిక క్రమశిక్షణ, పరిస్థితులకు అనుగుణంగా కార్డును రద్దు చేసుకోవాలని కచ్చితంగా నిర్ణయించుకుంటే మాత్రం కార్డు సంస్థ ఆఫర్ల ఆకర్షణలో పడొద్దు.

ఇక క్రెడిట్ కార్డు ఖాతా సంపూర్ణంగా క్లోజ్ అయిందని నిర్ధారించుకోకపోతే, వార్షిక ఫీజులను చెల్లించుకోవాల్సి రావచ్చు. క్రెడిట్ కార్డును జారీ చేసిన బ్యాంకు లేదా సంస్థకు రద్దు చేసుకునే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేయడం, దాన్ని ఓ రికార్డుగా ఉంచుకోవడం మంచిది. ఇలా రాసే క్లోజింగ్ రిక్వెస్ట్ లెటర్‌లో పేరు, పూర్తి చిరునామా, క్రెడిట్‌కార్డు నంబర్, జారీ చేసిన తేదీ, సంవత్సరం, రద్దు చేసుకోవాలనుకుంటూ రాస్తున్న తేదీ తదితర వివరాలన్నీ ఉండేలా చూసుకోవాలి. బ్యాంకు నుంచి క్రెడిట్ కార్డును క్లోజ్ చేసినట్టు ఆధారం కూడా తీసుకోవాలి. కార్డును రద్దు చేసుకున్నట్టు ధ్రువీకరణ అందిన తర్వాత మీవద్దనున్న కార్డును జాగ్రత్తగా నిర్వీర్యం చేయాలి.

కార్డుపై ఉన్న ప్రయోజనాలు

క్రెడిట్ కార్డులు కేవలం రుణమే కాకుండా ఎన్నో ఇతర ప్రయోజనాలతో ఉంటాయి. పర్యటనలు, షాపింగ్ బిల్లుల చెల్లింపులకు క్రెడిట్ కార్డులను వినియోగించడం ద్వారా రివార్డులను పొందొచ్చు. అయితే, కార్డును రద్దు చేసుకుంటే వాటిపై ఉన్న రివార్డులూ కోల్పోతారు. కనుక క్రెడిట్ రివార్డులను అప్పటికే చెల్లించాల్సిన బకాయిలతో సర్దుబాటు చేసుకునేందుకు అవకాశం ఉందా అని తెలుసుకోవాలి. ఒకవేళ అప్పటికే బ్యాలన్స్‌ను కూడా చెల్లించేసి ఉంటే, ఆ రివార్డులను షాపింగ్ లేక రెస్టారెంట్‌లో రెడీమ్ చేసుకున్న తర్వాతే రద్దు చేసుకోవాలి.

క్రెడిట్ రిపోర్ట్ పరిశీలన

క్రెడిట్‌కార్డు రద్దు నిర్ణయం మీ క్రెడిట్ రిపోర్ట్‌లోకి చేరేందుకు కనీసం 4-6 వారాల సమయం తీసుకోవచ్చు. అందుకని అంత కాలం పాటు ఆగి ఆ తర్వాత, ఆర్‌బీఐ అనుమతి కలిగిన ఏ క్రెడిట్ బ్యూరో నుంచి అయినా రిపోర్ట్ తీసుకుని పరిశీలించుకోవడం చేయాలి. ఒకవేళ క్రెడిట్ కార్డు ఖాతా క్లోజ్ అయినట్టు క్రెడిట్ రిపోర్ట్ చూపించకపోతే, వెంటనే సంబంధిత కార్డు సంస్థ వద్ద ఫిర్యాదు దాఖలు చేయడం అవసరం. క్రెడిట్ కార్డు రద్దు చేసుకోవడం చిన్న పనే. కానీ, తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మాత్రం క్రెడిట్ స్కోరును దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు.

పరాగ్ పారిఖ్ నుంచి ఈఎల్ఎస్ఎస్ స్కీమ్

పరాగ్ పారిఖ్ ఫైనాన్షియల్ అడ్వైజరీ సర్వీసెస్ (పీపీఎఫ్ఏఎస్) దాదాపు ఆరేళ్ల తర్వాత తొలి ఈక్విటీ స్కీమ్‌ను ప్రారంభించనుంది. పరాగ్ పారిఖ్ ట్యాక్స్ సేవర్ ఫండ్ పేరిట దీన్ని జూలై మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు సంస్థ చైర్మన్ నీల్ పరాగ్ పారిఖ్ వెల్లడించారు. తమ ఫండ్ హౌస్ నుంచి ఇది మూడో స్కీమ్ అవుతుందని, ఈక్విటీలకు సంబంధించి రెండోదని వివరించారు. 'గత కొన్నేళ్లుగా ఈఎల్ఎస్ఎస్ స్కీమ్ ప్రారంభించాలంటూ చాలా మంది కోరుతున్నారు. అయితే, తగినంత సంఖ్యలో ఇన్వెస్టర్లు పోగయ్యేవరకు వేచి చూడాలని భావించాం' అని తెలిపారు. పీపీఎఫ్ఏఎస్ ఇప్పటి దాకా కేవలం ఒకటే ఈక్విటీ స్కీమ్ ఆఫర్ చేస్తోంది. లాంగ్ టర్మ్ ఈక్విటీ ఫండ్ పేరిట నిర్వహిస్తున్న ఈ స్కీము మల్టీ-క్యాప్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇటు భారత్‌లోనూ అటు విదేశీ స్టాక్స్‌లోనూ దీని ద్వారా ఇన్వెస్ట్ చేసేందుకు వెసులుబాటు ఉందని తెలిపారు. మరోవైపు ఈక్విటీ స్కీమ్‌లోకి సిస్టమాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ సదుపాయం కల్పించేందుకు 2018 మే లో పరాగ్ పారిఖ్ లిక్విడ్ ఫండ్ కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. సెల్ఫ్ ఇన్వెస్ట్ పేరిట మొబైల్, వెబ్ యాప్‌లూ అందిస్తున్నామన్నారు.

మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్‌లో మంచి అవకాశాలు

దిద్దుబాటుకు గురైన షేర్లు త్వరలో ర్యాలీ • రానున్న 12 నెలల్లో మంచి పనితనం ప్రదర్శించే అవకాశం

ఎన్‌డీఏకు స్పష్టమైన విజయాన్ని ఇవ్వడంతో ఈక్విటీ మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ నెలకొంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో పెట్టుబడులకు ఇది మంచి అనుకూల సమయం. వృద్ధిని పునరుద్ధరించేందుకు నూతన ప్రభుత్వం బలమైన విధానపర చర్యల్ని చేపట్టే అవకాశం ఉంది. మిడ్, స్మాల్‌క్యాప్ రెండు రకాల పరిస్థితుల్లో మంచి పనితీరు చూపిస్తాయి. మార్కెట్లు రిస్కీగా ఉన్నా, ఒక్కో సందర్భంలో ఇవి మంచి ప్రదర్శన చూపుతాయి. సెన్సెక్స్‌తో పోలిస్తే వ్యాల్యూషన్లు సౌకర్యంగా ఉన్నప్పుడు కూడా ఇది జరుగుతుంది. సెన్సెక్స్‌తో పోలిస్తే మిడ్‌క్యాప్ ఇండెక్స్ 12 శాతం ప్రీమియంతోనూ గతంలో ట్రేడయింది. ఇప్పుడు మిడ్‌క్యాప్ సూచీ తక్కువలో ఉందంటే, భవిష్యత్తులో వేగవంతమైన పనితీరు చూపించే అవకాశం ఉంటుందని అర్థం. రిస్కీ స్థాయికి వెళ్లిన తర్వాత మిడ్‌క్యాప్స్, స్మాల్‌క్యాప్స్‌లో దిద్దుబాటు జరగడం వల్లే ప్రస్తుతం తక్కువ వ్యాల్యూషన్లకు వచ్చాయి.

డి.జయంత్ కుమార్
నేషనల్ హెడ్
కార్పొరేట్ పార్టీ ప్రాడక్ట్స్

ఎన్నికల నేపథ్యంలో అనిశ్చితి...

ప్రస్తుతం మిడ్‌క్యాప్ సూచీ సెన్సెక్స్ కంటే 10 శాతం డిస్కౌంట్‌లో ఉంది. ఎన్నికల నేపథ్యం మార్కెట్లలో రిస్కును పెంచింది. మిడ్‌క్యాప్ స్టాక్స్ తక్కువ విలువల వద్ద ట్రేడవుతున్నాయి. ఈ తరహా పరిస్థితులు... దిద్దుబాటుకు గురైన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ర్యాలీ చేస్తాయని సూచిస్తున్నాయి. వచ్చే 12 నెలల్లో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మంచి పనితీరు చూపిస్తాయని మేం భావిస్తున్నాం. మిడ్‌క్యాప్ ఈక్విటీ ఫండ్స్ పథకాలు ప్రధానంగా మిడ్‌క్యాప్ కంపెనీల షేర్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. సెబీ నిర్వచనం ప్రకారం... మార్కెట్ విలువ పరంగా 101 నుంచి 250 వరకు స్థానాల్లో ఉన్నవి మిడ్‌క్యాప్. మిడ్‌క్యాప్ పథకాలు వాటి పోర్ట్‌ఫోలియోలో కనీసం 65 శాతాన్ని మిడ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. రూ.8,500 కోట్లకుపైగా మార్కెట్ క్యాప్ కలిగిన కంపెనీలు 150 వరకు ఉన్నాయి. మరో 35 శాతాన్ని మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే సౌకర్యాన్ని ఈ పథకాలు కలిగి ఉంటాయి.

హెచ్‌డీఎఫ్‌సీ ఫండ్...

హెచ్‌డీఎఫ్‌సీ మిడ్‌క్యాప్ ఫండ్ మిడ్‌క్యాప్ విభాగంలో మంచి పనితీరు కలిగిన పథకం. 12 ఏళ్ల బలమైన ట్రాక్ రికార్డు కలిగి ఉంది. దీర్ఘకాలంలో సంపద సృష్టించాలన్న లక్ష్యాన్ని ఈ పథకం రుజువు చేసి చూపించింది. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి వార్షికంగా 15 శాతం రాబడులను ఇచ్చింది. కానీ, ఇదే కాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్- 100 సూచి రాబడులు 11 శాతంగానే ఉన్నాయి. మధ్య కాలం నుంచి దీర్ఘకాలంలో ఈ పథకం గొప్ప పనితీరుతో ముందున్నది. ఈ పథకం ఆరంభమైన నాటి నుంచి ప్రతీ నెలా రూ.10,000 సిప్ చేస్తూ వస్తే ఇప్పటికి రూ.14.40 లక్షల పెట్టుబడి రూ.45.42 లక్షలుగా వృద్ధి చెందేది. తగినంత వృద్ధి అవకాశాలు, బలమైన ఆర్థిక సామర్థ్యం (రిటర్న్ రేషియో, క్యాష్‌ఫ్లో), స్థిరమైన, అర్థం చేసుకోతగిన వ్యాపార నమూనాలు, ఆమోదనీయమైన వ్యాల్యూషన్ అంశాల ఆధారంగా స్టాక్స్ ఎంపిక చేసుకుంటుంది.

బలమైన పనితీరు చరిత్ర, తగినంత వైవిధ్యం, అనుభవంతో కూడిన నిర్వహణ బృందంతో కూడిన హెచ్‌డీఎఫ్‌సీ మిడ్‌క్యాప్ అపార్చునిటీస్ ఫండ్, మిడ్‌క్యాప్ విభాగంలో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి మంచి ఆప్షన్ అవుతుంది. ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాల సాధన కోసం ఈ పథకంలో ఇన్వెస్ట్‌మెంట్‌కు సిప్ మార్గాన్ని ఎంచుకోవచ్చు. అధిక రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్లకు మిడ్‌క్యాప్ ఫండ్స్ సూచించడం జరుగుతుంది. కనుక అధిక రిస్క్ తీసుకుని, అధిక రాబడులు కోరుకునే వారు ఈ తరహా పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

పటిష్టంగా పసిడి..

బంగారం అనూహ్యరీతిలో పటిష్టస్థాయిలో ఉంది. అంతర్జాతీయ కమోడిటీ ఫ్యూచర్స్ మార్కెట్- నైమెక్స్‌లో 28వ తేదీతో ముగిసిన మొత్తం ఐదు ట్రేడింగ్ సెషన్లలో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర 1,400 డాలర్లపైనే కొనసాగింది. వారం ప్రారంభంలో 1,404 డాలర్ల వద్ద ప్రారంభమైన పసిడి ధర, వారం మధ్యలో (జూన్ 25వ తేదీ) 1,442 డాలర్లను చూసింది. అయితే అదేరోజు 1,433 డాలర్ల వద్ద ముగిసింది. ఈ రెండు స్థాయిలూ పసిడికి ఆరు సంవత్సరాల గరిష్టం కావడం గమనార్హం. వారం చివరి ట్రేడింగ్ సెషన్‌లో వారంవారీగా దాదాపు 24 డాలర్ల లాభంతో 1,428 డాలర్ల వద్ద ముగిసింది. రెండేళ్లలో కీలకమైన 1,360 డాలర్ల స్థాయిని దాటిన తర్వాత పసిడి మరో కీలక నిరోధం 1,400 డాలర్లపైన ట్రేడవుతోంది. దిగువస్థాయికి వెళ్లాలంటే ఈ రెండు మద్దతులనూ పసిడి కాపాడుకోవాల్సి ఉంటుంది. అయితే పసిడిది బులిష్ ధోరణేనన్నది నిపుణుల అభిప్రాయం. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతలతో పసిడిలోకి పెట్టుబడులు మారుతున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి. ఇక భారత్‌లో కూడా పసిడి పటిష్టంగానే కొనసాగే వీలుంది,

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జూన్-28-2019 అంతెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1-2 ఏళ్లు	3-5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	6.6	6.8	6.75
యాక్సిస్ బ్యాంక్	7.1	7.3	7.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.5	7	6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.75	6.5
కెనరా బ్యాంక్	6.2	6.75	6
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.5	6.65	6.45
కార్పొరేషన్ బ్యాంక్	6.35	7	6.5
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.1	7.3	7.25
ఐసీఐసీఐ బ్యాంక్	6.75	7	7.25
ఐడీబీఐ బ్యాంక్	6.5	7.25	7.4
ఇండస్‌ఇండ్ బ్యాంక్	7.25	7.75	7.5
కోటక్ మహీంద్రా బ్యాంక్	7	7.2	7
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.5	6.85	6.75
ఎస్‌బీఐ	6.4	7	6.7
సిండికేట్ బ్యాంక్	6.35	7.05	7.15
పీఎన్‌బీ	6.95	7	6.25
యస్ బ్యాంక్	7.15	7.75	7.25

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

రిస్క్ తగ్గిస్తూ.. డైనమిక్ రాబడులు

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్

బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ విభాగంలోని మ్యూచువల్ ఫండ్స్ (వీటినే డైనమిక్ అసెట్ అలోకేషన్ ఫండ్స్ అని కూడా అంటారు) ఈక్విటీలో, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా డైనమిక్‌గా ఇన్వెస్ట్ చేస్తూ రాబడులను ఇచ్చే విధానంలో పనిచేస్తుంటాయి. ఈక్విటీ మార్కెట్లు తక్కువ వ్యాల్యూషన్లకు చేరినప్పుడు అందులో పెట్టుబడులు పెంచుకోవడం, మార్కెట్లు అధిక వ్యాల్యూషన్లకు చేరినప్పుడు ఎక్స్‌పోజర్ తగ్గించుకోవడం అనే రిస్క్ బ్యాలన్స్‌డ్ విధానాన్ని అనుసరిస్తుంటాయి. ప్రస్తుతం ఈ విభాగంలో 19 ఫండ్స్ ఉన్నాయి. ప్రతీ ఫండ్ కూడా తనకుంటూ వ్యాల్యూషన్ విధానాన్ని అనుసరిస్తోంది. అయితే, ఈక్విటీ విభాగం పెట్టుబడులను కనీసం 65% కొనసాగించడం వల్ల ఇవి ఈక్విటీ ఫండ్స్ కిందకే వస్తాయి.

రాబడులు..: ఈ విభాగంలో చాలా ఫండ్స్ మార్కెట్లు గరిష్టాలకు చేరినప్పుడు ఈక్విటీ డెరివేటివ్‌లోనూ పొజిషన్లను తీసుకోవడం ద్వారా హెడ్జింగ్ విధానాలను అనుసరిస్తున్నాయి. ఈక్విటీలకు కేటాయింపులు 65 శాతానికి పైగా చేయడం వల్ల మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే నష్టాలను తగ్గించడం కోసం ఇలా చేస్తుంటాయి. ముఖ్యంగా ఈక్విటీల్లో కొంత పెట్టుబడులు పెట్టాలనుకునే వారు, పరిమిత రిస్క్ కోరుకునే వారు ఈ తరహా పథకాలను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో అగ్రగామి పథకాల్లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ కూడా ఒకటి. ఈ పథకం ఏడాదిలో 6.5 శాతం రాబడులను ఇవ్వగా, ఈ విభాగం సగటు రాబడులు 3.3 శాతంగానే ఉన్నాయి. మూడేళ్లలో చూసుకుంటే వార్షిక రాబడులు 9.8 శాతంగాను, ఐదేళ్లలో వార్షికంగా 10 శాతం చొప్పున రాబడులను ఇచ్చాయి. కానీ, ఈ విభాగం సగటు రాబడులు మూడేళ్లలో 7.8 శాతం, ఐదేళ్లలో 8.1 శాతం చొప్పున ఉన్నాయి.

ఈ పథకంతోపాటు ఎల్‌అండ్‌టీ డైనమిక్ ఈక్విటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్, ఇన్వెస్కో ఇండియా డైనమిక్ ఈక్విటీ పథకాలు గత ఏడేళ్ల కాలంలో కాంపౌండెడ్‌గా 13-14 శాతం రాబడులను ఇచ్చాయి. ఇదే కాలంలో నిఫ్టీ 50 టీఆర్ఐ రాబడులు 11 శాతంగానే ఉన్నాయి. రిస్క్, రాబడుల ఆధారంగా క్రమాన్ని చూస్తే బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ విభాగం... ఈక్విటీ సేవింగ్స్, అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్ మధ్య ఉంటుంది.

పెట్టుబడుల విధానం..: ఈక్విటీ పెట్టుబడులకు సంబంధించి మల్టీక్యాప్ విధానాన్ని అనుసరిస్తుంది. లార్జ్‌క్యాప్ స్టాక్స్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. గత ఐదేళ్ల కాలాన్ని పరిశీలిస్తే ఈ పథకం ఈక్విటీల్లో పెట్టుబడులను 65-69% మధ్య నిర్వహిస్తోంది. ఈక్విటీ మార్కెట్లు బాగా పెరిగిన సందర్భాల్లో ఫండ్ మేనేజర్ డెరివేటివ్‌లో ఈక్విటీ పొజిషన్ల ఆధారంగా షార్ట్‌కు వెళుతుంటారు. 2015 జనవరి, 2018 జనవరిలో ఈ పథకం హెడ్జ్‌డ్ పొజిషన్లను 34-36 శాతానికి పెంచుకుంది. ఈక్విటీ నికర పొజిషన్లను 34.36 శాతానికి తగ్గించుకోవడం గమనార్హం.

టాప్ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ	4.34
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	3.87
కోటక్ మహీంద్రా బ్యాంకు	3.15
ఇన్ఫోసిస్	3.02
యాక్సిస్ బ్యాంకు	2.84
ఎల్‌అండ్‌టీ	2.49
ఐసీఐసీఐ బ్యాంకు	2.23
ఐటీసీ	2.19
ఎస్‌బీఐ	2.18
ఎన్‌టీపీసీ	2

"విజయం కోసం నేను ఎప్పుడూ కలగనలేదు... కష్టం మాత్రమే పడ్డాను..!"
- ఎస్టీ లాడర్, ఎస్టీ లాడర్ వ్యవస్థాపకురాలు

బొమ్మ-బొరుసు

ఐటీ మినహాయింపు పరిమితి పెంపు!

- రూ.10 కోట్ల ఆదాయం మించితే 40 శాతం పన్ను...
- బడ్జెట్‌లో ఈ దిశగా చర్యలు ఉండొచ్చని కేపీఎంజీ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: రానున్న కేంద్ర బడ్జెట్‌లో మోదీ సర్కారు ఆదాయపు పన్ను(ఐటీ) విషయంలో కీలక చర్యలను ప్రకటించే అవకాశం ఉందని కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ నిర్వహించిన సర్వేలో అత్యధికులు అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులకు ఇప్పటివరకూ రూ.2.5 లక్షలుగా ఉన్న మినహాయింపు పరిమితిని పెంచొచ్చని పేర్కొన్నారు. ఈ నెల 5న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. దీనిపై అంచనాల విషయంలో అన్ని పరిశ్రమలకు చెందిన 226 మంది నుంచి కేపీఎంజీ ప్రీ-బడ్జెట్ సర్వేను నిర్వహించింది. నివేదికలో ముఖ్యాంశాలివీ...

- ఐటీ మినహాయింపు పరిమితిని ఇప్పుడున్న రూ.2.5 లక్షల నుంచి పెంచే అవకాశం ఉందని సర్వేలో పాల్గొన్న 74 శాతం మంది పేర్కొన్నారు.
- ఇక కుబేరుల(సూపర్ రిచ్)కు సంబంధించి... రూ.10 కోట్ల ఆదాయం మించిన వారికి కొత్తగా 40 శాతం పన్ను శ్లాబ్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టొచ్చని 58 శాతం మంది అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రూ.2.5 లక్షల వరకూ వ్యక్తిగత ఆదాయంపై ఎలాంటి పన్నూ లేదు. అయితే, మధ్యంతర బడ్జెట్‌లో రూ.5 లక్షల వరకూ పన్ను పడకుండా రిబేటు రూపంలో ప్రభుత్వం చర్యలు తీసుకున్న సంగతి తెలిసందే.
- మరోపక్క, అనువంశిక పన్నును మళ్లీ తీసుకొచ్చే అవకాశం ఉందని 13 శాతం మంది, సంపద/ఎస్టేట్ పన్నును పునఃప్రవేశపెట్టొచ్చని 10 శాతం మంది అంచనా వేశారు.
- గృహనిర్మాణ రంగంలో డిమాండ్‌ను పెంచేందుకు వీలుగా హౌసింగ్ రుణాల(సొంతింట్లో ఉన్నవారికి) వడ్డీపై పన్ను మినహాయింపు పరిమితిని ఇప్పుడున్న రూ.2 లక్షల స్థాయి నుంచి పెంచొచ్చని 65 శాతం మంది పేర్కొన్నారు.
- అదేవిధంగా సెక్షన్ 80సీ కింద ఉన్న రూ.1.5 లక్షల మినహాయింపు పరిమితి నుంచి హౌసింగ్ రుణాల అసలు మొత్తం(ప్రిన్సిపల్) చెల్లింపులను వేరు చేసే అవకాశం ఉందని 51 శాతం మంది చెప్పారు.
- అయితే, ప్రత్యక్ష పన్నుల విషయంలో భారీ మార్పులేవీ ఉండకపోవచ్చని 53 శాతం మంది అంచనా వేశారు.
- ఇక పరిశ్రమ వర్గాలు డిమాండ్ చేస్తున్నట్లుగా ఇప్పుడున్న 25 శాతం కార్పొరేట్ పన్ను తగ్గింపు విషయంలో చర్యలు ఉండే అవకాశం లేదని 46 శాతం మంది సర్వేలో అభిప్రాయం వ్యక్తం చేశారు.

సీపీఎస్ఈ, భారత్-22లకు పన్ను ప్రయోజనాలు?

న్యూఢిల్లీ: సీపీఎస్ఈ, భారత్-22 ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్‌మెంట్‌పై రిటైల్ ఇన్వెస్టర్లకు పన్ను ప్రయోజనాలు కల్పించాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. సెక్షన్ 80సీ కింద ఈఎల్ఎస్ఎస్‌కు ఇస్తున్న పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని, ఈటీఎఫ్‌లకూ వర్తింపజేయవచ్చా అనేదానిపై పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం (దీపమ్) ప్రత్యక్ష పన్నుల మండలికి లేఖ రాసింది. ఇది ఆమోదానికి నోచుకుంటే ఇన్వెస్టర్లు ఈ రెండు ఈటీఎఫ్‌లలో పెట్టుబడులపై సెక్షన్80సీ ప్రయోజనాలకు అర్హులవుతారు. అయితే, ఈఎల్ఎస్ఎస్ విభాగం కింద పరగణించొద్దని కోరే వెసులుబాటును కూడా ఇన్వెస్టర్లకు ఇవ్వాలన్నది ఈ ప్రణాళికలో భాగం. అలా అయితే, లాకిన్ పీరియడ్ లేకుండా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

తగ్గనున్న నెఫ్ట్ చార్జీలు..

ఆర్‌బీఐ ఆదేశాలతో నేటి నుంచే అమల్లోకి

ముంబై: ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ విధానాల ద్వారా నగదు బదిలీ లావాదేవీల చార్జీలు నేటి నుంచి (సోమవారం) తగ్గనున్నాయి. ఈ తరహా లావాదేవీలపై తాను విధించే చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన ఆదేశాలు జూలై 1 నుంచి (నేడు) అమల్లోకి రావడం ఇందుకు కారణం. ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా బ్యాంకులు కూడా ఈ లావాదేవీల చార్జీలను తగ్గించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగ ఆంధ్రా బ్యాంక్ జూలై 1 నుంచి ఆర్‌టీజీఎస్ లావాదేవీలపై చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు, నెఫ్ట్ లావాదేవీలపై ఆర్‌బీఐ విధించే ప్రాసెసింగ్ చార్జీలను తొలగిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది. రూ. 2 లక్షల దాకా నగదు బదిలీ లావాదేవీలకు నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), అంతకు మించిన మొత్తానికి రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్‌టీజీఎస్) విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ తన ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ సిస్టమ్ ద్వారా జరిగే లావాదేవీలపై బ్యాంకుల నుంచి కనీస చార్జీలను వసూలు చేస్తోంది. తదనుగుణంగా బ్యాంకులు కూడా కస్టమర్ల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నెఫ్ట్ లావాదేవీలపై రూ. 1 నుంచి రూ. 5 దాకా, ఆర్‌టీజీఎస్‌పై రూ. 5 నుంచి 50 దాకా చార్జీలు విధిస్తోంది. మరోవైపు ఏటీఎంల వాడకంపై బ్యాంకులు వడ్డిస్తున్న చార్జీలు, ఫీజులను కూడా సవరించాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతుండటంతో ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ అత్యున్నత స్థాయి కమిటీ వేసింది.

కల సాకారం చేసిన ట్రూజెట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విమానయాన సంస్థ ట్రూజెట్ నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా జూలై 12 వరకు పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రతిష్టాత్మకంగా ఈ సంస్థ చేపట్టిన వింగ్స్ ఆఫ్ ప్రైడ్‌లో భాగంగా హైదరాబాద్ మల్కాజిగిరిలోని సెయింట్ ఆంటోనీస్ ఓల్డ్ ఏజ్ హోమ్‌కు చెందిన 45 మంది వృద్ధులకు విమానంలో విహరించాలన్న కలను సాకారం చేసింది. హైదరాబాద్ నుంచి నాందేడ్‌కు వీరిని ప్రత్యేక విమానంలో ఉచితంగా తీసుకువెళ్లారు. అక్కడి గురుద్వారాలో దర్శనం అనంతరం తిరిగి భాగ్యనగరికి అదే విమానంలో చేర్చారు. అలాగే శనివారం జరిగిన కార్యక్రమంలో దుండిగల్‌లోని స్ఫూర్తి అనాథాశ్రమంలోని 200 మంది చిన్నారులతో కలిసిపోయి ట్రూజెట్ పైలట్లు, కెప్టెన్లు, ఎయిర్‌హోస్టెస్‌లు, ఇతర సిబ్బంది ఆట, పాటల్లో మునిగితేలారు. వారికి బొమ్మలు, ఇతర బహుమతులను అందిచారు. చిన్నారులతో కలిసి భోజనం చేశారు. సామాజిక బాధ్యత కింద గతంలో ట్రూజెట్ పలువురు అనాథ పిల్లలకు ఉచిత విమాన ప్రయాణ అనుభూతిని అందించింది.

ఓఎల్ఎక్స్‌లో మరిన్ని భద్రతా ఫీచర్లు

హైదరాబాద్: ఆన్‌లైన్ ప్రకటనల వేదిక ఓఎల్ఎక్స్ వినియోగదారుల భద్రతకు సంబంధించి మరిన్ని చర్యలను అమల్లోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్లో సురక్షిత లావాదేవీల నిర్వహణ, సైబర్ భద్రత పట్ల వారిలో అవగాహన కల్పించనుంది. ఉత్పత్తుల ఉన్నతీకరణ, యూజర్ల భద్రత మార్గదర్శకాలు, సోషల్ మీడియాలో డిజిటల్ ప్రచారం చర్యలను కూడా చేపట్టనుంది. సైబర్ పీస్ ఫౌండేషన్‌తో ఓఎల్ఎక్స్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. సైబర్ భద్రతా అవగాహన సదస్సులను తొలిదశ కింద రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో నిర్వహించనుంది. యూజర్ల భద్రత కోణంలో ఓఎల్ఎక్స్ యాప్‌లో సేఫ్టీ ఫీచర్లను కూడా ప్రవేశపెట్టినట్టు సంస్థ ప్రకటించింది. స్పామ్, హానికారక కంటెంట్ గురించి రిపోర్ట్ చేయవచ్చని తెలిపింది.

కోడిగుడ్లు

(హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో) 1-7-2019

విశాఖ	420-00
చిత్తూరు	463-00
వరంగల్	422-00
చెన్నై	470-00
ముంబై	472-00
విజయవాడ	420-00
నమక్కల్	455-00
గోదావరి	420-00
30-6-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	419-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.80

బడ్జెట్‌పైనే మార్కెట్ దృష్టి

- శుక్రవారం పూర్తిస్థాయి బడ్జెట్, గురువారం ఆర్థిక సర్వే
- అంచనాలను అందుకోలేకపోతే అమ్మకాల ఒత్తిడి: శామ్‌కో
- ఆశాజనకంగా జి-20 సదస్సు, వాణిజ్య యుద్ధానికి తాత్కాలిక తెర

ముంబై: ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నరేంద్ర మోదీ సర్కార్.. కేంద్రంలో రెండోసారి అధికారాన్ని చేపట్టాక 2019-20 ఆర్థిక ఏడాదికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే కౌంట్ డౌన్ ప్రారంభించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జూలై 5న (శుక్రవారం) బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా.. ఈ ప్రధాన అంశమే మార్కెట్ వర్గాలకు ఉత్కంఠభరితంగా మారిపోయింది. ఆర్థిక వ్యవస్థ నెమ్మదించి, కంపెనీల ఆదాయాలు అంతంత మాత్రంగా ఉన్నందున బడ్జెట్‌లో ఈసారి ద్రవ్య లభ్యత పెంపు, భారీ సంస్కరణల సూచనలు ఉండేందుకు ఆస్కారం ఉందని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. 'గ్రామీణ ప్రాంతాల్లో నెమ్మదించిన డిమాండ్ మళ్లీ ఊపందుకునేలా చూడడం, వినియోగదారుల కొనుగోలు శక్తి పెరిగేలా నిర్ణయాలు తీసుకోవడం అనేది ఈ బడ్జెట్‌లో ప్రధాన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పన.. బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీ, ఇంధన, విద్యుత్, ఉక్కు, ఆటోమొబైల్ రంగాలకు ఊతమిచ్చే నిర్ణయాలు వెల్లడైతే మాత్రం మార్కెట్‌కు నూతన ఉత్సాహం వస్తుంది. గతంలో కూడా.. మూలధన వ్యయంపై ప్రకటనలు, విధాన సంస్కరణలే సూచీల దిశానిర్దేశం చేశాయి' అని ఎస్ఎమ్‌సీ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ అడ్వైజర్స్ చైర్మన్ డీకే అగర్వాల్ అన్నారు.

నిరాశపరిస్తే నేలచూపులే..

ఈవారంలో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్.. భవిష్యత్తుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్పష్టంచేయనుంది. భారీ అంచనాలు ఉన్న కారణంగా ఒడిదుడుకులకు ఆస్కారం ఉందని ఎపిక్ రీసెర్చ్ సీఈవో ముస్తఫా నదీమ్ విశ్లేషించారు. ఈ నేపథ్యంలో వేచిచూసే ధోరణిలోనే ఉండడం ఉత్తమం అని సూచించారు. మార్కెట్ ప్రస్తుత గమనం చూస్తుంటే తుపానుకు ముందు ప్రశాంతతలా ఉందని శామ్‌కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోడీ అన్నారు. బడ్జెట్ అంచనాలను అందుకోలేకపోతే అమ్మకాల ఒత్తిడి భారీస్థాయిలోనే ఉంటుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆటోరంగంలో ఉంటే భారీ పతనం కానీ.. లేదంటే.. కోలుకోవడానికి ఆస్కారం ఉందన్నారు. ఆటో, మెటల్ రంగాలు ఈవారం ఫోకస్‌లో ఉండనున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం హెడ్ వినోద్ నాయర్ అన్నారు. ఈవారంలో బడ్జెట్, 2018-19 ఆర్థిక సంవత్సర ఎకనామిక్ సర్వే (జూలై 4న) ఉన్న కారణంగా.. ప్రస్తుతం కన్సాలిడేషన్‌లో ఉన్న మార్కెట్ ఈ ప్రధాన అంశాలు పూర్తయిన తరువాత బలమైన ర్యాలీ నమోదుచేయవచ్చని భావిస్తున్నట్లు ఎడెల్వీజ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సాహిల్ కపూర్ అన్నారు.

అంతర్జాతీయ పరిణామాలు ఆశాజనకం..

మార్కెట్ వర్గాలను ఇరకాటంలో పడేసిన వాణిజ్య యుద్ధం తాత్కాలికంగా ఆగింది. అమెరికా-చైనాల మధ్య ట్రేడ్‌వార్‌కు ప్రస్తుతానికి తెరపడింది. గతంలో ఆగిపోయిన వాణిజ్య చర్చలను తిరిగి ప్రారంభించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్‌లు అంగీకరించారు. జపాన్‌లోని ఒసాకాలో జరుగుతున్న జీ-20 సదస్సు సందర్భంగా శనివారం సమావేశమైన ఇరువురు నేతలు ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం మార్కెట్‌కు సానుకూల అంశంగా ఉంది. వివాదం పరిష్కారం అయ్యేంత వరకూ చైనా ఉత్పత్తులపై కొత్తగా సుంకాలు విధించబోమని ట్రంప్ ప్రకటించారు. మరోవైపు ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్, ట్రంప్‌ల మధ్య ఆదివారం చరిత్రాత్మక భేటీ జరగడం కూడా మార్కెట్‌కు సానుకూల అంశంగా ఉంది. ఈ తాజా అంశాలపై మార్కెట్ వర్గాలు దృష్టి సారించినట్లు సాహిల్ కపూర్ అభిప్రాయపడ్డారు.

స్థూల ఆర్థిక అంశాలపై దృష్టి..

నికాయ్ ఇండియా తయారీ రంగ ఇండెక్స్ జూన్‌నెల గణాంకాలు సోమవారం వెల్లడికానున్నాయి. సేవల డేటా బుధవారం వస్తుంది. మౌలికరంగ డేటా శుక్రవారం మార్కెట్ ముగిశాక వెల్లడికానుండగా.. జూలై ఒకటి నుంచి గతనెల ఆటో రంగ అమ్మకాల సమాచారం వెల్లడికానుంది. మరోవైపు అంతర్జాతీయ అంశాల్లో.. ఈవారంలోనే అమెరికా, చైనా దేశాల తయారీ రంగ సమాచారం వెల్లడికానుంది.

రూ.10,384 కోట్ల విదేశీ నిధుల వెల్లువ

భారత్ క్యాపిటల్ మార్కెట్లో విదేశీ పోర్ట్ ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐ) పెట్టుబడుల పరంపర కొనసాగుతోంది. ఆర్థిక సంస్కరణలు కొనసాగుతాయనే అంచనాల కారణంగా వీరు వరుసగా ఐదో నెల్లోనూ నికర కొనుగోలుదారులుగా నిలిచారు. జూన్‌లో ఈక్విటీ మార్కెట్లో రూ.2,273 కోట్లు.. డెట్ మార్కెట్లో రూ.8,112 కోట్లను ఇన్వెస్ట్‌చేశారు. మొత్తంగా గత నెలలో రూ.10,384 కోట్లను పెట్టుబడిపెట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.87,313 కోట్లను వీరు పెట్టుబడి పెట్టినట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది.

యాక్సిస్ బ్యాంక్

బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ.808 **టార్గెట్ ధర:** రూ.925

ఎందుకంటే: ఈ ప్రైవేట్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం నిలకడైన పనితీరును సాధించింది. మొండి బకాయిల సమస్య, కవరేజ్ రేషియో అంశాల్లో మెరుగుదలను సాధించింది. ఈ బ్యాంక్ దూకుడుగా బ్రాంచ్‌లను విస్తరిస్తోంది. సగటు బ్రాంచ్ వ్యాపారం ఏడాది కాలంలో రూ.240 కోట్ల నుంచి రూ.260 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో సగటు ఉద్యోగి వ్యాపారం రూ.15 కోట్ల నుంచి రూ.17 కోట్లకు పెరిగింది. రుణ నాణ్యత నిష్పత్తులు మెరుగుపడుతున్నాయి. 2017-18లో రూ.33,400 కోట్లుగా ఉన్న కొత్త మొండి బకాయిలు గత ఆర్థిక సంవత్సరంలో రూ.13,900 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ 'డిజిటల్' ప్రయత్నాలు పెరుగుతున్నాయి. 2017-18లో 22 శాతంగా ఉన్న డిజిటల్‌గా ఇచ్చిన వ్యక్తిగత రుణాలు గత ఆర్థిక సంవత్సరంలో 43 శాతానికి పెరిగాయి. 2012-13లో 5 శాతంగా ఉన్న బ్యాంక్ క్రెడిట్ కార్డ్ మార్కెట్ వాటా గత ఆర్థిక సంవత్సరంలో 12 శాతానికి పెరిగింది. దేశంలో క్రెడిట్‌కార్డ్‌ల జారీలో నాలుగో స్థానం ఈ బ్యాంక్‌దే. 2013-14లో 32 శాతంగా ఉన్న రిటైల్ రుణాలు గత ఆర్థిక సంవత్సరంలో 50 శాతానికి పెరిగాయి. మార్జిన్లు అధికంగా ఉండే రిటైల్ రుణాలు పెరగడం సానుకూలాంశమే. టైర్ వన్ మూలధనం 12.5 శాతానికి పెరగడంతో రుణ వృద్ధి మళ్లీ ఆరోగ్యకర స్థాయికి చేరవచ్చు. వారంట్ల కన్వర్జన్ కారణంగా వృద్ధికి తగినంత మూలధనం అందుబాటులోకి రానున్నది. తర్వాతి దశ వృద్ధిని అందిపుచ్చుకోవడానికి తగిన స్థాయిలో పెట్టుబడులు పెట్టింది.యాక్సిస్ క్యాపిటల్ మినహా మిగిలిన ఇతర అనుబంధ సంస్థలు-యాక్సిస్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, యాక్సిస్ ఫైనాన్స్, యాక్సిస్ సెక్యూరిటీస్ పనితీరు ఆరోగ్యకరంగానే ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరం కల్లా రిటర్న్ ఆన్ అసెట్ (ఆర్‌ఓఏ) 1.4 శాతానికి, రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్‌ఓఈ) 17 శాతానికి చేరగలవని అంచనా.

స్టాక్స్ షార్ట్

బీఈఎంఎల్

బ్రోకరేజ్ సంస్థ: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ.912 **టార్గెట్ ధర:** రూ.1,060

ఎందుకంటే: మట్టిని తవ్వి, తరలించే యంత్రాలను తయారు చేసే కంపెనీల్లో ఇది ఆసియాలోనే రెండో అతి పెద్ద కంపెనీ ఇది. భారత్‌లో ఈ రంగంలో 60% మార్కెట్ వాటా ఈ కంపెనీదే. కోల్ ఇండియా, దాని అనుబంధ కంపెనీలకు అత్యధికంగా యంత్రాలు సరఫరా చేస్తున్న ఈ కంపెనీ మూడు ప్రధాన వ్యాపార విభాగాల్లో- మైనింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్, రైల్ అండ్ మెట్రో, రక్షణ విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వివిధ నగరాల్లో మెట్రో రైల్వే వ్యవస్థ విస్తరిస్తుండటంలో మెట్రో కోచ్‌ల తయారీ రంగంలో ఈ కంపెనీకి భారీ అవకాశాలు లభించనున్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో ముంబై మెట్రో నుంచి ఈ కంపెనీకి రూ.3,000 కోట్ల ఆర్డర్ లభించింది. రానున్న రెండేళ్లలో రైల్వే, రక్షణ రంగాల్లో ఈ కంపెనీ భారీ ఆర్డర్లు చేజిక్కించుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయి. మైనింగ్ కార్యకలపాలు పెరగడం, రక్షణ రంగంలో ఖర్చు పెరగడం, రైల్వే రంగంలో పెట్టుబడులు పెరుగుతుం డటం... ఇవన్నీ కంపెనీకి ప్రయోజనం కలిగించే అంశాలే. రక్షణ రంగంలో అంతర్జాతీయ దిగ్గజాలతో కలిసి భాగస్వామ్యం కుదుర్చుకోవడం, మెట్రో రైల్వే రంగంలో అవకాశాలు పెరుగుతుండటం సానుకూలాంశాలు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ పనితీరు అంతంతమాత్రంగానే ఉన్నా, ఆర్డర్ బుక్ భారీగా ఉండటం గమనించాల్సిన విషయం. ఈ కంపెనీలో 26% వాటాను విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అనిశ్చితి నెలకొన్నది. ఈ విషయంలో ఏమైనా కదలిక వస్తే, అది కంపెనీ షేర్‌ను రీరేట్ చేయగలదు. రెండేళ్లలో కంపెనీ అమ్మకాలు 20%, నికర లాభం 85% చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 5-6%గా ఉన్న రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్‌ఓఈ) వచ్చే ఆర్థిక సంవత్సరంలో 10%నికి చేరగలదని భావిస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

జీఎస్‌టీ 2.0 అమల్లోకి తేవాలి

పరిశ్రమవర్గాల అభిప్రాయం

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్నుల విధానం (జీఎస్‌టీ) రెండో దశను (2.0) అమల్లోకి తేవాల్సిన సమయం వచ్చిందని పరిశ్రమ వర్గాలు వ్యాఖ్యానించాయి. విద్యుత్, చమురు, గ్యాస్, రియల్ ఎస్టేట్, ఆల్కహాల్‌ను కూడా దీని పరిధిలోకి తీసుకురావడం ద్వారా పన్ను సంస్కరణలకు మరింత ఊతమివ్వాల్సిన అవసరముందని పేర్కొన్నాయి. అలాగే పన్ను రేటును 2-3 శ్లాబులకు పరిమితం చేయాలని కోరాయి. 'జీఎస్‌టీ అమల్లోకి వచ్చి రెండేళ్లయింది. ఇక జీఎస్‌టీ 2.0ని అమలు చేయాల్సిన తరుణం వచ్చింది. ఇది దేశ ఎకానమీని తదుపరి వృద్ధి స్థాయికి చేర్చగలదు' అని పరిశ్రమల సమాఖ్య సీఐఐ ప్రెసిడెంట్ విక్రమ్ కిర్లోస్కర్ తెలిపారు. ప్రారంభ దశలో ఎదురైన పలు సవాళ్లను అధిగమించిన నేపథ్యంలో పరోక్ష పన్నుల విధానాన్ని మరింత సరళతరం చేయాలన్న లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని ఫిక్కీ ప్రెసిడెంట్ సందీప్ సోమానీ పేర్కొన్నారు. మరోవైపు రిటర్నుల ఫైలింగ్‌ల్లోనూ.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్స్‌ల్లోనూ వ్యత్యాసాలు ఉన్నా, పన్నులు ఎగవేసినా ఆయా సంస్థల ప్రమోటర్లు, డైరెక్టర్లు, ప్రొమైటర్లకు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నట్లు జీఎస్‌టీ నెట్‌వర్క్ సీఈవో ప్రకాష్ కుమార్ తెలిపారు. దీనివల్ల తెలియక చేసిన తప్పులేమైనా ఉంటే వారు సరిదిద్దుకునే అవకాశం లభిస్తుందని ఆయన వివరించారు. ఇందుకోసం ప్రత్యేక జీఎస్‌టీ వ్యవస్థను రూపొందించినట్లు కుమార్ చెప్పారు. ఐటీసీ క్లెయిమ్‌లు, రిటర్నుల్లో తేడాలున్న పక్షంలో ఆయా అసెసీలకు అలర్ట్‌లు పంపడంతో పాటు ఆదాయ పన్ను శాఖకు సమాచారం అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. మరోవైపు వరుసగా రెండు నెలల పాటు జీఎస్‌టీఆర్-3బి దాఖలు చేయని సంస్థలకు ఆగస్టు 22 నుంచి ఈ-వే బిల్లుల జారీ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 1.22 కోట్ల వ్యాపార సంస్థలు జీఎస్‌టీ కింద నమోదయ్యాయి.

సెన్సెక్స్ నిరోధశ్రేణి 39,675-39,820

మార్కెట్ పంచాంగం

వాణిజ్య యుద్ధానికి సంబంధించి అమెరికా-చైనాల మధ్య తాత్కాలిక సంధి కుదరడం, ఉత్తర కొరియా దేశాధ్యక్షుడు కిమ్‌తో భేటీకి ఆ దేశ భూభాగంలోకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడుగుపెట్టడం వంటి అంశాలకు ఈ వారం ప్రారంభంలో ప్రపంచ మార్కెట్లు సానుకూలంగా స్పందించే అవకాశం వుంది. ఈ క్రమంలో భారత్ మార్కెట్లు ఎంతవరకూ పెరుగుతాయన్నది ఆసక్తిదాయకం. ఎందుకంటే ప్రపంచ పరిణామాలకంటే...ఈ వారంలో వెలువడనున్న కేంద్ర బడ్జెట్‌పై అంచనాలే మన మార్కెట్‌ను కదల్చవచ్చు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి పరిమితశ్రేణిలో కదులుతున్న మన మార్కెట్....బడ్జెట్ తర్వాత ఒక ట్రెండ్‌ను ఏర్పర్చుకుని, ఆ బాటలో వేగంగా పయనించవచ్చు. ఇక ప్రస్తుత సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే...,

సెన్సెక్స్ సాంకేతికాంశాలు...



జూన్ 28తో ముగిసిన వారం ప్రధమార్థంలో 38,946 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గిన బీఎస్ఈ సెన్సెక్స్ ద్వితీయార్థంలో 39,817 పాయింట్ల గరిష్టస్థాయివరకూ పెరిగింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 201 పాయింట్ల లాభంతో 39,395 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో ఈ సోమవారం సెన్సెక్స్ గ్యాప్‌అప్‌తో ప్రారంభమైతే 39,675-39,820 పాయింట్ల శ్రేణి తొలుత అవరోధం కల్పించవచ్చు. ఈ శ్రేణిని అధిగమిస్తే 40,060 పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. ఆపైన 40,320 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఈ వారం తొలి నిరోధశ్రేణిని దాటలేకపోతే 50 రోజుల చలన సగటు (50 డీఎంఏ) రేఖ కదులుతున్న 39,005 పాయింట్ల స్థాయి తొలుత మద్దతును అందించవచ్చు. ఈ మద్దతును కోల్పోతే 38,825-38,570 పాయింట్ల శ్రేణి వద్దకు తగ్గవచ్చు. ఈ లోపున 38,000 పాయింట్ల వద్దకు పతనం కావచ్చు.

నిఫ్టీ నిరోధశ్రేణి 11,875-11,910 పాయింట్లు...



గత వారం 11,911-11,651 పాయింట్ల శ్రేణిలో గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య హెచ్చుతగ్గులకు లోనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే 65 పాయింట్ల లాభంతో 11,789 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీ గ్యాప్‌అప్‌తో మొదలైతే 11,875-11,910 పాయింట్ల శ్రేణి తొలుత నిరోధించవచ్చు. ఈ శ్రేణిని దాటితే 11,960పాయింట్ల స్థాయిని అందుకోవచ్చు. ఈ స్థాయి పైన ముగిస్తే, 12,100 పాయింట్లకు పెరగవచ్చు. ఈ వారం తొలి అవరోధ శ్రేణిని దాటలేకపోతే 50 డీఎంఏ రేఖ కదులుతున్న 11,705 పాయింట

'కల్యాణ లక్ష్మి' నిధుల పెంపుపై దివ్యాంగుల హర్షం

హైదరాబాద్: పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఇచ్చే పెళ్లి కానుకను తమకు 25 శాతం పెంచడంపై రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ హర్షం వ్యక్తం చేసింది. దివ్యాంగులకు ఈ పథకం ద్వారా ఇచ్చే మెత్తాన్ని రూ.1,00,116 నుంచి రూ. 1,25,145కి పెంచడాన్ని వారు స్వాగతించారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జూలై నుంచి 5 లక్షల మంది దివ్యాంగులకు పెన్షన్ కింద రూ. 3,016 ఇవ్వబోతుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సభ్యులు రాజ్యలక్ష్మి, భువనేశ్వర్, మున్నా, రాజేందర్, మల్లిఖార్జున్, కవిత, దయామని, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న కామన్ పీజీ ఎంట్రన్స్ (సీపీజీఈటీ) పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు సీపీజీఈటీ-2019 కన్వీనర్ కిషన్ ఆదివారం తెలిపారు. ఈ నెల (జూలై) 8 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఈ ప్రవేశ పరీక్షలకు రాష్ట్రంలో 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, టైం టేబుల్ వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జూన్ 30తో అపరాధ రుసుముతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందన్నారు. ఏడు యూనివర్సిటీల్లో ప్రవేశాలకు సీపీజీఈటీ-2019కు 92 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం సాయంత్రం నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ కోర్సు

హైదరాబాద్: బ్రిటిష్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి 3వ తేదీ వరకు ఐఈఎల్‌టీఈఎస్ ఇంటెన్సివ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువ నిపుణులు లక్ష్యంగా రూపొందించిన ఈ కోర్సు ఫీజు రూ.11వేలు అని, జూబ్లీహిల్స్‌లోని బ్రిటిష్ లైబ్రరీలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. లిజనింగ్, స్పీకింగ్, రైటింగ్, రీడింగ్ అనే నాలుగు అంశాలు ప్రధానంగా బోధన ఉంటుందని, బ్యాచ్‌కు కేవలం 20 మంది విద్యార్థులను మాత్రమే తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నిపుణులైన శిక్షకులు బోధిస్తారని, శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 96669 79250 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఢిల్లీలో లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాలు

రేపటి నుంచి మూడ్రోజులపాటు నిర్వహణ

సాక్షి, న్యూఢిల్లీ: లాల్‌దర్వాజ సింహవాహిన శ్రీ మహంకాళీ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో ముందుగా 2వ తేదీన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించనున్నారు. 3వ తేదీన సాయంత్రం 5 గంటలకు అమ్మవారి ఘట్టాన్ని ఇండియా గేట్ నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి తెలంగాణ భవన్‌లో ప్రతిష్టించనున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారని ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్ తెలిపారు. 4వ తేదీన ప్రత్యేక పూజలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పిస్తారని చెప్పారు.

ఏకగ్రీవంగా కాపు, బలిజ సంఘం ఎన్నికలు

హైదరాబాద్: ఆలిండియా తెలగ, కాపు, బలిజ సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆలిండియా తెలగ, కాపు, బలిజ సంఘం కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. సభ్యులందరి ఆమోదంతో గతంలో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వై. ప్రభాకర్‌రావును తిరిగి 2019-20 సంవత్సరానికి నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఆరవ రామకృష్ణ, సుంకర వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా తోట హనుమంతరావు, సహాయ కార్యదర్శులుగా టి. శ్రీలక్ష్మి, సీహెచ్ గోపాలక్రిష్ణ, కోశాధికారిగా డి. శేషగిరిరావు, సభ్యులుగా గోపిశెట్టి నాగేశ్వరరావు, రవికుమార్, శ్రీనాథ్, మారేశ్వరరావు, కర్న శ్రీనివాస్, నారాయణ, ఎస్ఆర్‌వీ నాయుడు, రమణరావులు ఎన్నికైన్నట్లు కాపు, బలిజ సంఘం ఎన్నికల పరిశీలకులు తెలిపారు.

సౌదీలో రోడ్డు ప్రమాదం

ముగ్గురు హైదరాబాదీల మృతి

హైదరాబాద్: సౌదీ అరేబియాలో జరిగిన ఓ ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. ముషీరాబాద్‌లోని బాకారానికి చెందిన వ్యాపారి జహినుల్లా అబిదిన్ దంపతులు గత 40 ఏళ్లుగా సౌదీలోని జెడ్డాలో నివాసముంటున్నారు. వీరికి ఐదుగురు కుమారులు, ఓ కుమార్తె. కాగా వీరిలో ఇద్దరు కుమారులు రష్యాలోనూ, మరో కుమారుడు బాకారంలోనూ నివసిస్తున్నారు. ఈ నెల 27న జహినుల్లా అబిదిన్ తన భార్యా పిల్లలతో కలసి జెడ్డా నుంచి సౌదీకి కారులో వస్తుండగా వీరి వాహనానికి ఒంటె అడ్డుగా రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది. అబిదిన్ దంపతులిద్దరితో పాటు కుమారుడు ముర్తాజా అక్కడికక్కడే మృతి చెందారు. మరో కుమారుడు ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇస్మాయిల్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ముగ్గురి మృతదేహాలను రెండ్రోజుల్లో నగరానికి పంపేలా ఏర్పాటు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు.



చకచకా 'చంద్రయాన్-2' ఏర్పాట్లు

ప్రయోగం తేదీ జూలై 15న

- సెప్టెంబర్ 6న చంద్రుడిపైకి..
- మొత్తం 3.50 లక్షల కిలోమీటర్లు ప్రయాణించనున్న చంద్రయాన్-2

శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న చంద్రయాన్-2 ప్రయోగానికి సమయం దగ్గరపడుతోంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జూలై 15న వేకువజామున 2.51 గంటలకు చంద్రయాన్-2ను ప్రయోగించనున్నారు. ఇప్పటికే షార్‌లో రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో మూడు దశల జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం1 రాకెట్ పనులను పూర్తిచేశారు. పేజ్-3 లెవెల్-1 తనిఖీలను నిర్వహించారు. అదేవిధంగా శాటిలైట్ బిల్డింగ్‌లో ఆర్బిటర్ మిషన్ మీద ల్యాండర్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను పూర్తి చేశారు. చంద్రయాన్-2 మిషన్‌ను రాకెట్ శిఖర భాగంలో అమర్చేందుకు హీట్‌షీల్డ్ క్లోజ్ చేసి, ఆ భాగాన్ని శాటిలైట్ బిల్డింగ్ నుంచి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌కు తరలించి రాకెట్‌కు అనుసంధానం చేస్తారు. దీంతో రాకెట్ అనుసంధానం పనులన్నీ పూర్తవుతాయి. ఆ తర్వాత రాకెట్‌లో అన్ని తనిఖీలు నిర్వహించి ఊంబ్లికల్ టవర్ మీదకు తరలించే ప్రక్రియను చేపట్టనున్నారు. ప్రయోగానికి గడువు మరికొన్ని రోజులే ఉండడంతో సెలవు దినాలను కూడా చూడకుండా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగ పనుల్లో నిమగ్నమయ్యారు. సోమవారం నుంచి నూతన డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పర్యవేక్షణలో అనుసంధానం పనులు జరుగుతాయి. జూలై 15న చంద్రయాన్-2 భూకక్ష్య నుంచి బయలుదేరి 3.50 లక్షల కిలోమీటర్లు దూరం ప్రయాణించి సెప్టెంబర్ 6న చంద్రుడిపైకి చేరుతుంది. అదేరోజున ఆర్బిటర్ చంద్రుడి కక్ష్యలోకి చేరుకుని ల్యాండర్‌ను చంద్రుడిపై దించుతుంది. చంద్రుడిపై ల్యాండర్ దిగాక అందులో అమర్చిన రోవర్ బయటకొచ్చి పరిశోధనలు చేస్తుంది. ఈ లోపు ఆర్బిటర్ చంద్రుడి కక్ష్యలోనే పరిభ్రమిస్తూ ఉంటుంది.

జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం1 రాకెట్ ద్వారానే చంద్రయాన్-2..

640 టన్నులు బరువు కలిగిన జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం1 రాకెట్ 3.8 టన్నుల బరువు కలిగిన చంద్రయాన్-2 ఉపగ్రహాన్ని అంతరిక్షం వైపు మోసుకెళ్లనుంది. చంద్రయాన్-2 ఉపగ్రహంలో 2.3 టన్నుల బరువు కలిగిన ఆర్బిటర్, 1.4 టన్నులు బరువు కలిగిన ల్యాండర్ (విక్రమ్), 27 కిలోలు బరువు కలిగిన రోవర్ (ప్రజ్ఞాన్) అనే ఇండియన్ పేలోడ్స్‌తోపాటు అమెరికా, యూరప్ దేశాలకు సంబంధించిన అనేక పేలోడ్స్‌ను పంపిస్తున్నారు. వీటితోపాటు ఆర్బిటర్‌లో 8 పేలోడ్స్, ల్యాండర్, రోవర్‌లో మూడేసి పేలోడ్స్‌ను పంపుతున్నారు.



ఆర్బిటర్‌లో పంపే పేలోడ్స్ ఇవి..

- టెరియన్ మ్యాపింగ్ కెమెరా-2 (టీఎంసీ-2)
- చంద్రయాన్-2 లార్జ్ ఏరియా సాఫ్ట్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్ (సీఎల్ఏఎస్ఎస్)
- సోలార్ ఎక్స్‌రే మానిటర్ (ఎక్స్ఎస్ఎం)
- ఆర్బిటర్ హైరిజుల్యూషన్ కెమెరా (ఓహెచ్ఆర్‌సీ)
- ఇమేజింగ్ ఐఆర్ స్పెక్ట్రోమీటర్ (ఐఐఆర్ఎస్)
- డ్యూయెల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపార్చర్ రాడార్ (ఎస్ఏఆర్)
- చంద్రయాన్-2 అట్మాస్ఫియరిక్ కాంపోజిషనల్ ఎక్స్‌ప్లోరల్ 2 (సీహెచ్ఏసీఈ)
- డ్యూయెల్ ఫ్రీక్వెన్సీ రేడియో సైన్స్ (డీఎఫ్ఆర్ఎస్) ఎక్స్‌పరిమెంట్

ల్యాండర్ (విక్రమ్)లో పేలోడ్స్ ఇవి..

- రేడియో అనాటమీ ఆఫ్ మూన్ బౌండ్ హైపర్‌సెన్సిటివ్ ఐనోస్ఫియర్ అండ్ అట్మాస్ఫియర్ (ఆర్ఎఎంబీఏ)
- చంద్రయాన్-2 సర్ఫేస్ థెర్మో-ఫిజికల్ ఎక్స్‌పరిమెంట్ (సీహెచ్ఏఎస్‌టీఈ)
- ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సీయాస్మిక్ యాక్టివిటీ (ఐఎల్ఎస్ఏ)

రోవర్ (ప్రజ్ఞాన్)లో పేలోడ్స్ ఇవి..

- అల్ఫా ఫర్టికల్స్ ఎక్స్‌రే స్పెక్ట్రో మీటర్ (ఏఎస్ఎక్స్ఎస్)
- లేజర్ ఇన్‌డ్యూస్‌డ్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (ఎన్ఐబీఎస్)
- లేజర్ రెట్రో రిఫ్లెక్టర్ అర్రే (ఎల్ఆర్ఏ)

బంగాళాఖాతంలో అల్పపీడనం

- నేడు, రేపు ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు
- అనేక చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది తీవ్రంగా మారి రాగల 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే దక్షిణ ఛత్తీస్‌గఢ్ దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ ప్రభావాలతో సోమవారం ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు, అనేక చోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. అలాగే మంగళవారం కొన్ని చోట్ల భారీ వర్షాలతోపాటు ఒకట్రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు తెలిపారు. మరోవైపు గత 24 గంటల్లో దుండిగల్‌లో 6 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదవగా గజ్వేల్, బజర్హత్‌నూర్, తూప్రాన్‌లలో 5 సెంటీమీటర్ల చొప్పున, ధర్మసాగర్, నర్మెట్ట, వర్నిలలో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

హైదరాబాద్‌లో 11 శాతం అధిక వర్షపాతం...

జూన్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల్లో హైదరాబాద్‌లో 11 శాతం అధిక వర్షపాతం నమోదైంది. సాధారణంగా ఈ నెల రోజుల్లో 105.6 మిల్లీమీటర్ల (ఎంఎం) వర్షం కురవాల్సి ఉండగా 116.9 ఎంఎం కురిసింది. కరీంనగర్ జిల్లాలో ఆరు శాతం అధిక వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించడంతో రాష్ట్రవ్యాప్తంగా 35 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఈ నెల రోజుల్లో రాష్ట్రంలో సరాసరి 132 ఎంఎం వర్షం కురవాల్సి ఉండగా 86.2 ఎంఎం కురిసింది. ఖమ్మం జిల్లాలో మాత్రం ఏకంగా 73 శాతం లోటు వర్షపాతం నమోదవడం గమనార్హం. జిల్లాలో గత నెల రోజుల్లో సాధారణంగా 130.5 ఎంఎం మేర వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 35.2 ఎం.ఎం. మాత్రమే నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. అక్కడ 64 శాతం లోటు వర్షం కురిసింది. సాధారణంగా 153.1 ఎం.ఎం. ఆ జిల్లాలో కురవాల్సి ఉండగా, కేవలం 54.8 ఎం.ఎం. మాత్రమే కురిసింది.

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: రెండు, మూడేళ్ల డిప్లొమా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు జూలై 4వ తేదీలోపు వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. వ్యవసాయంలో 620, విత్తన సాంకేతిక పరిజ్ఞానం 80, సేంద్రియ వ్యవసాయం 60, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో 110 సీట్లున్నట్లు తెలిపింది. 10వ తరగతి, తత్సమాన పరీక్షలో కనీసం 5.0 గ్రేడ్ పాయింట్లతో (హిందీతో కలిపి) ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సులకు అర్హులుగా పేర్కొంది. 10వ తరగతి కంపార్ట్‌మెంటల్ పాస్, ఇంటర్ ఫెయిలైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఇంటర్ పాసైనవారు, దానికంటే పై చదువులు చదివిన అభ్యర్థులు అర్హులు కాదని స్పష్టంచేసింది. విద్యార్థుల వయసు 2019 డిసెంబర్ 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలని, 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపింది. వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ వ్యవసాయం కోర్సుల కాలపరిమితి రెండేళ్లు కాగా, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కాలపరిమితి మూడేళ్లుగా పేర్కొంది. కోర్సు ఫీజు రూ.12,700 అని వెల్లడించింది.

వ్యవసాయ పాలిటెక్నిక్‌ల సీట్ల వివరాలు

నాగర్‌కర్నూల్ (పాలెం), జగిత్యాల (పొలాస), నల్లగొండ (కంపాసాగర్), సంగారెడ్డి (బసంతపూర్), ఖమ్మం (మధిర), సంగారెడ్డి (జోగిపేట), సిద్దిపేట (తోర్నాల), కరీంనగర్ (జమ్మికుంట), కామారెడ్డి (మాల్‌తుమ్మెద), నిజామాబాద్ (రుద్రూరు), హైదరాబాద్ (రాజేంద్రనగర్)లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 8 ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఈ కోర్సులను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. వ్యవసాయం, విత్తన సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ వ్యవసాయం కోర్సుల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో 20 చొప్పున సీట్లు, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 60 సీట్లు ఉన్నాయి. అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 30 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ ఫీజుల మోత!

ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు రంగం సిద్ధం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో బీ కేటగిరీ, సీ కేటగిరీ (ఎన్ఆర్ఐ) కోటా సీట్లల్లో 5 శాతం ఫీజులు పెంచుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రైవేటు మెడికల్ కాలేజీల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. గతేడాది ఐదు శాతం ఫీజు పెంచినా ఆ ఏడాదికే పరిమితం చేశారని, కాబట్టి ఈ ఏడాది మరో ఐదు శాతం ఫీజు పెంచుకునేందుకు అవకాశం కల్పించాలని లేఖ రాసినట్లు ప్రైవేటు మెడికల్ కాలేజీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు 'సాక్షి'కి తెలిపారు. పెంపుపై అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. ఏటా ఐదు శాతం ఫీజులు పెంచుకోవడానికి అవకాశం కల్పిస్తూ గతంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున ఆ మేరకు ఈసారి కూడా ఫీజులు పెరుగుతాయని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు కూడా స్పష్టం చేశాయి.

ఏడాదికి బీ కేటగిరీకి రూ. 57 వేలు, ఎన్ఆర్ఐ రూ. 1.15 లక్షలు అదనం...

రాష్ట్రంలో 21 ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఉండగా అందులో నాలుగు మైనారిటీ మెడికల్ కాలేజీలున్నాయి. మైనారిటీ మెడికల్ కాలేజీలకు ఏడాదికి 5 శాతం పెంపు నిబంధన వర్తించదు. కాబట్టి మిగిలిన 17 మెడికల్ కాలేజీల్లోని ఎంబీబీఎస్ సీట్లకు ఫీజుల పెంపు ఉత్తర్వులు వర్తిస్తాయి. ఇవిగాక ప్రైవేటు డెంటల్ కాలేజీల్లోనూ 5 శాతం ఫీజుల పెంచుకునే నిబంధన వర్తిస్తుంది. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని వైద్య సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటా సీట్లు ఉంటాయి. ఇక 35 శాతం బీ కేటగిరీ సీట్లు ఉంటాయి. మరో 15 శాతం సీట్లను సీ కేటగిరీ కింద భర్తీ చేసుకునే వీలుంది. ఇప్పుడు బీ, సీ కేటగిరీ సీట్లకు ఫీజు పెంచేందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం ఎంబీబీఎస్ బీ కేటగిరీ ఫీజు ఏడాదికి రూ. 11.55 లక్షలుగా ఉంది. ఐదు శాతం పెంచితే రూ. 57,750 మేర పెరగనుంది. అంటే మొత్తం ఎంబీబీఎస్ బీ కేటగిరీ ఫీజు ఏడాదికి రూ. 12,12,750 కానుంది. ఇక సీ కేటగిరీ ఫీజు ప్రస్తుతం ఏడాదికి రూ. 23.10 లక్షలుంది. ఐదు శాతం పెంచితే అదనంగా రూ. 1,15,500 కానుంది. అంటే మొత్తం ఎంబీబీఎస్ సీ కేటగిరీ ఫీజు రూ. 24,25,500 కానుంది. అలాగే డెంటల్ కోర్సులకూ ఐదు శాతం మేర ఫీజు పెరగనుంది. ఐదేళ్లకు కలిపి చూస్తే పెంచిన ఫీజుల భారం విద్యార్థులపై అధికం కానుంది. కన్వీనర్ కోటా సీట్లలో మొదటి విడత ప్రవేశాలకు రాష్ట్రంలో మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ప్రస్తుతం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. ఆ తర్వాత సీట్ల ఎంపిక పూర్తి చేస్తారు. అనంతరం రెండో విడత కన్వీనర్ కోటాకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆ సమయంలోనే బీ కేటగిరీ సీట్లకు కూడా నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆలోగా ఫీజుల పెంపుపై స్పష్టత ఇవ్వాలని ప్రైవేటు మెడికల్ కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరాయి.

బీ, సీ కేటగిరీ ఎంబీబీఎస్ సీట్లు 1250...

ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2019-20లో మొత్తంగా 4,600 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,500 ఎంబీబీఎస్ సీట్లు, 21 ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 3,100 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 4 మైనారిటీ కాలేజీల సీట్లు పోను మిగిలిన ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2,500 సీట్లున్నాయి. కన్వీనర్ కోటా సీట్లు 1,250 పోను మిగిలినవి బీ, సీ కేటగిరీకి చెందినవి ఉన్నాయి. బీ కేటగిరీ ఎంబీబీఎస్ సీట్లు 875 కాగా, ఎన్ఆర్ఐ కోటా ఎంబీబీఎస్ సీట్లు 375 ఉన్నాయి. ఈ 1,250 సీట్లకు ఫీజులను పెంచేందుకు ప్రైవేటు మెడికల్ కాలేజీల యాజమాన్యాలు రంగం సిద్ధం చేశాయి. ఇక 11 ప్రైవేటు డెంటల్ కాలేజీల్లోనూ 1,140 బీడీఎస్ సీట్లున్నాయి. సగం బీ, సీ కేటగిరీ సీట్లుకాగా వాటికి కూడా 5 శాతం మేర ఫీజులు పెరగనున్నాయి.

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో బీ, సీ కేటగిరీ ఎంబీబీఎస్ సీట్ల వివరాలు

కాలేజీ పేరు	బీ, సీ కేటగిరీ సీట్లు
అపోలో, హైదరాబాద్	50
భాస్కర్ మెడికల్ కాలేజీ, ఎంకపల్లి	75
చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీ, కరీంనగర్	75
డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, చేవెళ్ల	75
సురభి మెడికల్ కాలేజీ, సిద్దిపేట	75
కామినేని అకాడమీ, హైదరాబాద్	75
కామినేని మెడికల్ కాలేజీ, నార్కట్‌పల్లి	100
మహావీర్ మెడికల్ కాలేజీ, వికారాబాద్	75
మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, హైదరాబాద్	75
మల్లారెడ్డి ఉమెన్స్ మెడికల్ కాలేజీ, హైదరాబాద్	75
మమత మెడికల్ కాలేజీ, బాచుపల్లి	75
మమత మెడికల్ కాలేజీ, ఖమ్మం	75
మెడిసిటీ మెడికల్ కాలేజీ, ఘన్‌పూర్	75
ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ, సంగారెడ్డి	50
ప్రతిమ మెడికల్ కాలేజీ, కరీంనగర్	100
ఆర్వీఎం మెడికల్ కాలేజీ, మెదక్	75
ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, మహబూబ్‌నగర్	75
మొత్తం	1,250

నేటి నుంచి గ్రూప్ 2 ఇంటర్వ్యూలు

- రోజుకు 48 మంది చొప్పున రెండు నెలలపాటు నిర్వహణ
- 1,032 పోస్టులకు 2,190 మంది అభ్యర్థులు
- ఇంటర్వ్యూ విధానంలో నిష్పాక్షికతకు పెద్దపీట

సాక్షి, హైదరాబాద్: గ్రూపు-2 పోస్టుల భర్తీలో భాగంగా సోమవారం(నేటి) నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 1,032 పోస్టుల భర్తీకి 2017లో నోటిఫికేషన్ జారీచేయగా, పలు న్యాయవివాదాల కారణంగా ఆలస్యమైంది. ఇటీవలే కోర్టు టీఎస్‌పీఎస్సీకి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో పోస్టులభర్తీకి 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూలు నిర్వహించాలని నిర్ణయించింది. మొత్తం 2,190 మంది అభ్యర్థులకు దాదాపు రెండు నెలలపాటు ఇంటర్వ్యూలను నిర్వహించనుంది. ప్రతివారం తేదీలవారీగా ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సిన అభ్యర్థుల జాబితాను వారం మొదటే ప్రకటించాలని నిర్ణయించింది. ఇప్పటికే సోమవారం నుంచి 6వ తేదీ వరకు హాజరుకావాల్సిన 288 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. రోజూ ఉదయం 24 మందికి, మధ్యాహ్నం 24 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది. రోజూ ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 12:30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభం కానున్నాయి.

సమగ్ర సంస్కరణల దిశగా..

ఇంటర్వ్యూల విధానంలో సమగ్ర సంస్కరణలకు టీఎస్‌పీఎస్సీ శ్రీకారం చుట్టింది. ఇంటర్వ్యూల్లో నిష్పాక్షికతకు పెద్దపీట వేసింది. ఒకప్పుడు ఇంటర్వ్యూలంటే అభ్యర్థి సామాజికవర్గం, ప్రాంతం, కుటుంబనేపథ్యంలో అనేక అంశాలను కూడా ఇంటర్వ్యూల్లో దాదాపుగా అడిగేవారు. కానీ, అప్పుడు అవేవీ అడగవద్దన్న నిబంధనను టీఎస్‌పీఎస్సీ విధించుకుంది. అభ్యర్థి పేరును బట్టి ఏ సామాజికవర్గానికి చెందినవారో గుర్తుపట్టే అవకాశం ఉండేది. కానీ, ఇప్పుడు అవేవీ ఇంటర్వ్యూ బోర్డులో ఉండేవారికి తెలియకుండా చర్యలు చేపట్టింది. గతంలో అభ్యర్థి పేరు, ప్రాంతం, ఇతర వివరాలను అడిగే విధానం ఉండగా, టీఎస్‌పీఎస్సీ రెడ్డి, రావు, యాదవ్ వంటి వివరాల తొలగింపుతో సంస్కరణలను వేగవంతం చేసింది. ఇంటర్వ్యూ బోర్డుల్లో ఉండే కమిషన్ సభ్యులు, సబ్జెక్టు నిపుణులు కూడా ఏ బోర్డుకు ఎవరు వెళతారో ముందుగా తెలిసే అవకాశం లేకుండా చేసింది. కేవలం 10 నిమిషాల ముందే కమిషన్ సభ్యుడు గానీ, సబ్జెక్టు నిపుణులుగానీ వెళ్లే బోర్డు వివరాలను ఆన్‌లైన్ అలాట్‌మెంట్ ద్వారా తెలియజేస్తారు.

ఇంటర్వ్యూ బోర్డుకు ర్యాండమ్‌గా ఎంపిక

ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఆధారిత సంస్కరణలు అమలు చేస్తోంది. ఆన్‌లైన్లో ర్యాండమ్‌గా అభ్యర్థులను ఎంపిక చేసి బోర్డుకు కేటాయిస్తారు. అభ్యర్థుల హాల్